

# స్థానిక పాలన

ఏప్రిల్ 2009

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 3 పేజీలు: 64 వెల: రూ. 20/-

## సామాజిక న్యాయానికి పితామహుడు



## డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్




తాజా నీటి ప్రాధాన్యతను తెలియజేసే
అంతర్జాతీయ నీటిదినం

# స్థానిక పాలన

గ్రామీణ వికాస తెలుగు మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 3

ఏప్రిల్, 2009



ఎడిటర్

**ఫణి కుమార్**

ఎడిటోరియల్ బోర్డు

**డి. రామకృష్ణ,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఏ.ఎస్. (రిటైర్డ్)

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**మహమ్మద్ తకీయుద్దీన్**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ ఆర్. అరుణ జ్యోతి**

**ఎన్. విజయ కుమార్**

**బి. నరేంద్రనాథ్ రావు**

**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ వి. ఎస్.ఎస్. ప్రసాద్**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**



*కాన్సెప్ట్, ప్లానింగ్,*
*ఎడిటింగ్, డిజైనింగ్*

మాస్టర్ మల్టీమీడియా, హైదరాబాద్

ప్రచురణ

**ఎ.ఎం.ఆర్. అపార్డ్**



రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ & ఫ్యాక్స్ : 040-24018656

E-mail ID : peshicomamapard@ap.gov.in


# విషయ సూచిక


సంపాదకీయం .......... 2

సామర్థ్యాల పెంపుదలలో కీలకం .......... 3

షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్ .......... 5

ఆం.ప్ర. స్మార్ట్ కార్డ్ ప్రాజక్టు అమలుపై ఓ పరిశీలన .......... 7

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా ప్రణాళికా కమిటీలు ఎట్లా పనిచేస్తున్నాయి ? .......... 9

తెల్ల గుర్రం (కథ) .......... 19

సమష్టి కృషితో సంపూర్ణ పారిశుధ్యం .......... 25

ఆకాశ దేశాన హాయిగా .......... 31

అసలైన విజయానికి చిహ్నం 'శుభ శుక్రవారం' .......... 37

అందరూ హాయిగా వుండాలంటే .......... 41

సామాజిక న్యాయ పితామహుడు డా॥ బి.ఆర్. అంబేద్కర్ .......... 45

పంచాయితీ రాజ్ సంస్థల్లో
'నూతన అకౌంటింగ్' విధానం .......... 49

ప్రభుత్వ భూములు – పంచాయితీల పాత్ర .......... 53

తాజా నీటి ప్రాధాన్యత తెలిపేందుకే అంతర్జాతీయ నీటి దినం .......... 57

చిన్నారులకొక చిన్ని అవకాశం .......... 61

సిరులు కురిపిస్తున్న వాటర్‌షెడ్ .......... 64

# సంపాదకీయం..

## అట్టడుగుస్థాయి నుంచి అత్యున్నత స్థానానికి....

ఇరవయ్యవ శతాబ్దానికి చెందిన ఓ గొప్ప మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్. అట్టడుగు ప్రజల విముక్తికి ఆయన చేసిన కృషి, జరిపిన పోరాటాలకు మానవ చరిత్రలో సాటి రాగలిగిన ఉదంతాలు అరుదనే చెప్పాలి. 'అంటరాని వారు' గా ఆనాటి సమాజం అమానుషంగా ముద్ర వేసిన కుటుంబంలో జన్మించిన అంబేద్కర్ విజ్ఞానం, పాండిత్యం, నాయకత్వం, రాజనీతిజ్ఞ రంగాల్లో అత్యున్నత స్థాయికి ఎదిగిన వైనం అపూర్వం.

విద్యను, జ్ఞానాన్ని సముపార్జించటంలో సమాజం ఆంక్షలు విధించి, ఎంతగాదూరం చేసినప్పటికీ, ప్రపంచంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన విశ్వవిద్యాలయాలనుంచి అత్యున్నతమైన పట్టాలను, గౌరవాలను అంబేద్కర్ పొందారు. తద్వారా, పుట్టుకతోనే ఒకరి గొప్పదనం కానీ, తక్కువదనం కానీ నిర్ణయమైపోతుందనే ఆనాటి సమాజం అవలంబించిన మౌలిక దృక్పధాన్ని తన విజయాలతో తోసిపుచ్చారు.

అనేక శతాబ్దాలపాటు కులరక్కసి పాదాల కింద నలిగిపోయిన దళిత ప్రజలకు ఒక గుర్తింపును, గౌరవాన్ని, అస్తిత్వాన్ని, రాజకీయ చైతన్యాన్ని అందించడం ద్వారా ఒక బలమైన ఉద్యమాన్ని నిర్మించి దేశ రాజకీయ దిశనే ఆయన సమూలంగా మార్చివేశారు. అత్యంత సంక్లిష్టమైన కుల వ్యవస్థపై తను ఏకవ్యక్తి సైన్యంగా జరిపిన సంకుల సమరంలో ఒక మేధావిగా, ఒక పరిశోధకుడిగా, ఒక సైద్ధాంతిక వేత్తగా, ఒక ఆర్గనైజర్‌గా, ఒక జర్నలిస్టుగా, ఒక రాజనీతిజ్ఞుడుగా, ఒక నాయకుడిగా అంబేద్కర్ బహుముఖ పాత్రలు పోషించారు. అనితరసాధ్యమైన విజయాలు సాధించారు. చివరికి భారత రాజ్యాంగ రచనలో కీలకపాత్ర కూడా పోషించారు.

### అంబేద్కర్ వివిధ సందర్భాలలో చేసిన వ్యాఖ్యలు, వ్యాఖ్యానాలు మననం చేసుకోవడం అవసరం

"మనుషులు గతిస్తారు. అదేవిధంగా భావాలు కూడా గతిస్తాయి. ఒక మొక్కకి నిరంతరం నీరు ఎలా అవసరమో, ఒక భావానికి ప్రచారం కూడా అంతే అవసరం. లేకపోతే, నీరు అందని మొక్క వాడిపోయి, ఎండిపోయినట్లే, ప్రచారం పొందని భావం కూడా గతిస్తుంది."

"మీ బానిసత్వాన్ని మీరే నిర్మూలించుకోవాలి. దాని నిర్మూలనకు దేవుడిపైనో, ఇంకొకరిపైనో ఆధారపడవద్దు. సంఖ్యాపరంగా గరిష్ట సంఖ్యలో ఉన్నంతమాత్రాన సరిపోదని గుర్తుంచుకోవాలి. నిరంతరం నిఘాతో, పటిష్ఠంగా ఉంటూ, ఆత్మగౌరవంతో బతుకుతూ విజయాన్ని సాధించుకోవాలి, నిలబెట్టుకోవాలి. మన మార్గాన్ని మనంతట మనమే నిర్దేశించుకోవాలి."

ఆణిముత్యాల్లాంటి అంబేద్కర్ వ్యాఖ్యల గురించి ఇట్లా ఎన్నయినా చెప్పుకోవచ్చు. దళితుల జీవితాల దశను, దిశను సమూలంగా మార్చివేసిన ఆ మహనీయుడి జయంతి సందర్భంగా ఇదే మా నివాళి.

# సామర్థ్యాల పెంపుదలలో కీలకం



*ఆంధ్రప్రదేశ్ గ్రామీణ జీవనోపాధుల కార్యక్రమం' (APRLP) (వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమం) అనంతపురం, కర్నూలు, నల్లగొండ, మహబూబ్‌నగర్, ప్రకాశం మొదలైన ఐదు జిల్లాల్లో అమలు జరిగింది. మహిళా సంఘాలు, రైతులచే భాగస్వామ్య పద్ధతిలో అమలు జరుగుతూ, స్త్రీ, పురుష సమానత్వం (జెండరు), వ్యవసాయ ఉత్పాదకత పెంపుదల, జీవనోపాధులకు మద్దతు, సంస్థ నిర్మాణం, నెట్‌వర్కింగ్, కన్వర్జెన్స్, కార్యక్రమ అమలులో పాలు పంచుకొనే వివిధ స్థాయిల్లోని ప్రైమరీ సెకండరీ స్టేక్‌హోల్డర్స్‌కు (ప్రాథమిక, ద్వితీయ భాగస్వామ్యదారులకు ,మహిళలకు, రైతులకు, ప్రజాప్రతినిధులకు, యంత్రాంగానికి) సామర్థ్య పెంపుదల సాధించింది. వీటిని దృష్టిలో ఉంచుకొని ఈ విధానాలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని నిర్ణయించటం జరిగింది.*



దీనిలో భాగంగా గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్, ఎ.ఎమ్.ఆర్. అపార్డు, జిల్లా నీటి యాజమాన్య సంస్థల ప్రాజెక్టు డైరెక్టర్లు, పి.ఐ.ఎ.లు, వివిధ ఎన్.జి.ఒ రిసోర్స్ ఆర్గనైజేషన్స్‌తో పలుసార్లు సమావేశాలు, వర్క్‌షాపులు నిర్వహించి సామర్థ్య పెంపుదల వ్యూహాన్ని ఖరారు చేసారు. ఈ క్రమంలో వికేంద్రీకృత, ప్రణాళికా బద్ధమైన సామర్థ్య పెంపుదల కార్యక్రమాలు చేపట్టడానికి జీవనోపాధుల వనరుల కేంద్రాలకు (DLRC, CLRC) అంకురార్పణ జరిగింది. జాతీయ ఉపాధి హామీ పథకం అమలు లోనికి రావడంతో సామర్థ్యాల పెంపుదలకు సంస్థాగత ఏర్పాటు, పటిష్టత ఆవశ్యకతలుగా ముందుకు వచ్చాయి.

## జీవనోపాధుల వనరుల కేంద్రాలు

జిల్లా స్థాయిలో గ్రామీణాభివృద్ధి శాఖ అమలుచేసే జాతీయ ఉపాధి హామీ పథకం, వాటర్‌షెడ్ డెవలప్‌మెంటు పథకం, 'ఇందిరప్రభ' కార్యక్రమాల అమలులో ప్రత్యక్ష పాత్ర వహించే ప్రాథమిక భాగస్వామ్యులైన గ్రామ పంచాయితీలు, మహిళా సంఘాలు, సబ్యుల, రైతులు, కూలీబృందాలు, ఎఫ్.ఎ.లు మొదలైన వారికి సి.ఎల్.ఆర్.సి (క్లస్టరు స్థాయి జీవనోపాధుల కేంద్రాలు) పరోక్ష పాత్ర వహించే ద్వితీయ భాగస్వామ్యులైన క్షేత్ర సిబ్బంది సామర్థ్య పెంపుదలకు డి.ఎల్.ఆర్.సి (జిల్లా స్థాయి జీవనోపాధుల వనరుల కేంద్రాలు) జీ.వో.ఎమ్.ఎస్. నెం. 381 16/12/2004 ద్వారా ఏర్పాటు చేయబడినవి.

ప్రస్తుతం 55 సి.ఎల్.ఆర్.సి.లు 17 డి.ఎల్.ఆర్.సి.లు, సామర్థ్య పెంపుదలలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో కీలకపాత్ర వహిస్తున్నాయి. ప్రతి క్లస్టరు స్థాయి జీవనోపాధుల కేంద్రం కోర్సు డైరెక్టరు, కంప్యూటర్ ఆపరేటరు మొదలైన యంత్రాంగం ద్వారా ఎ.పి.డిల సహకారంతో నడుస్తోంది. ఎప్పటికప్పుడు పి.డి. ఎ.పి.డి.లు సామర్థ్య పెంపుదలకు

సంబంధించిన విషయాలపై చర్చ జరిపి శిక్షణల అమలకు తోడ్పడుతున్నారు. ఇంతేగాక 59 సి.ఎల్.ఆర్.సి.లు, డి.ఎల్.ఆర్.సి.లు స్వంత భవనాలతో సామర్థ్య పెంపుదల నిర్వహణకు తోడ్పడుతున్నాయి.



## జీవనోపాధుల వనరుల కేంద్రం విజన్

"గ్రామీణ ప్రాంతాలలో నివసించే పేద, బలహీన వర్గాలు ముఖ్యంగా మహిళలు తమ సామర్థ్యాలను పెంపుదల చేసుకోవడం ద్వారా సుస్థిర జీవనోపాధులను కల్పించుకోవడంలో సహకరిస్తూ, స్వయం ప్రతిపత్తితో, స్వయం సమృద్ధి చెందిన బహుళ సంస్థగా నిరంతరం పని చేస్తూ వుంటుంది.

## జీవనోపాధుల వనరుల కేంద్రం అంటే . . .

గ్రామీణ పేదలకు సుస్థిర జీవనోపాదుల కల్పన కోసం ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలు ప్రభావ వంతమైన ఫలితాలు సాధించడానికి కావలసిన సామర్థ్య పెంపుదల కార్యక్రమాలను నిర్వహించే కేంద్రాన్ని జీవనోపాధుల వనరుల కేంద్రంగా నిర్వచించవచ్చు.

## జీవనోపాధుల వనరుల కేంద్రాల బాధ్యతలు

- గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అమలుపరచబడే కార్యక్రమాలు, భాగస్వామ్యులకు అవసరమైన శిక్షణాంశాలను గుర్తించి శిక్షణా ప్రణాళిక, కేలండరు రూపొందించి, శిక్షణలు నిర్వహించడం.
- గ్రామస్థాయి సంఘాలను, సంస్థలను బలోపేతం చేసే సామర్థ్య పెంపుదల కార్యక్రమాలను రూపొందించి శిక్షణలు నిర్వహించటం.
- సామర్థ్య పెంపుదలలో భాగంగా కొన్ని గ్రామాలలో డెమోన్‌స్ట్రేషన్ కొరకు పథక అమలును సమర్థవంతంగా నిర్వహించేలా ఫెసిలిటేట్ చేసి ఆ గ్రామాలలో క్షేత్రసందర్శన ఏర్పాటు చేసుకొనడం.
- గ్రామీణ ప్రాంతాలలో కార్యక్రమాలలో భాగస్వామ్యులైన అందరికి అందుబాటులో కావలసిన సమాచారం, నైపుణ్యం, అవసరమైన కార్యక్రమాలు రూపొందించి అమలు చేయటం.
- గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో జరిగే సామర్థ్య పెంపుదల కార్యక్రమాలను వ్యవస్థీకృతం చేయటం.
- రిసోర్సు పర్సన్స్ పూల్‌ను ఏర్పాటు చేసుకోవడం.
- కమ్యూనిటీ రిసోర్సు పర్సన్స్‌ల శిక్షణలలో సమాచార జ్ఞానాన్ని, నైపుణ్యతలను పెంపొందించడం, అవసరమైన కార్యక్రమాలను రూపొందించి అమలుజరపడం.

## సహకారమందిస్తున్న రాష్ట్ర స్థాయి సంస్థలు

ఎ.ఎమ్.ఆర్. ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి సంస్థ, గ్రామీణాభివృద్ధి శాఖ ఎన్.జి.ఒ.లు, రిసోర్సు సంస్థలు సంయుక్తంగా ఈ కేంద్రాల పటిష్టతకు సంస్థాగత ఏర్పాట్లు, కోర్సు డైరక్టర్ల శిక్షణలు, శిక్షణావసరాల గుర్తింపు, మాడ్యుల్స్, మెటీరియల్ తయారీ వంటి విషయాలు, సాంకేతిక అంశాల పరిజ్ఞానంపై ఎప్పటికపుడు సహకారం అందిస్తున్నాయి. వీటిలో 15 కేంద్రాలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్వహించబడుతున్నాయి. రాష్ట్ర స్థాయిలో వివిధ రిసోర్సు సంస్థలు నిపుణతతో కూడిన సహకారం అందిస్తున్నాయి.



59 కేంద్రాలు స్వంత భవనాలతో విరాజిల్లుతూ తమ కేంద్రంలో శిక్షణలు నిర్వహించని, ప్రణాళికలు తయారుచేయని ఖాళీ సమయాల్లో ఇతర సంస్థలకు వసతి సౌకర్యాలు కల్పించడానికి సంసిద్ధంగా ఉన్నాయి. వివరాలకు ఆయా జిల్లాల్లోని ప్రాజెక్టు డైరెక్టరు, డ్వామాని సంప్రదించగలరు.

*-బి.ఎస్.ఎస్.వి. సుమమాలిని & డి. కల్పన*
*గ్రామీణాభివృద్ధి శాఖ*

**2001** జనాభా లెక్కల ప్రకారం, దేశంలో 16.61 కోట్ల నుండి షెడ్యూల్డ్ కులాల వారు ఉన్నారు. దేశ జనాభాలో వీరు 16.6 శాతం మంది ఉన్నారు. 'షెడ్యూల్డ్ కులాలు' అనే మాటను రాజ్యాంగ రచన సందర్భంలో మొదట వాడారు. సమాజంలో 'అంటరాని వారి' గా పేరుపడి, సభ్య సమాజం నుంచి దూరంగా ఉంటూ, దోపిడీకి గురైన వెనుకబడిన కులాల వారిని ఉద్దేశించి 'షెడ్యూల్డ్ కులాలు' అనే మాటను రాజ్యాంగ నిర్మాతలు వాడారు. ఈ అట్టడుగు వర్గాల వారిని పాఠశాలల్లో అనుమతించేవారు కాదు. సమాజంలో గౌరవం లేకుండా అమానుషమైన పేదరికం, అవిద్యతో చీకటి బతుకులు బతికేవారు.



# షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్

ఈ వర్గాల దుస్థితిని అర్థం చేసుకొన్న మన నేతలు, అంటరానితనాన్ని నిషేధిస్తూ, ఆర్టికల్ 17ను రాజ్యాంగంలో పొందుపరిచారు. ఈ ఆర్టికల్‌కు '1955లో చట్టరూపం ఇస్తూ' అంటరానితనాన్ని నేరంగా పరిగణిస్తూ శాసనం చేశారు. అదే శాసనానికి కొన్ని మార్పులు, చేర్పులు చేసి 1976లో 'పౌరహక్కుల రక్షణ' చట్టంగా పేరు మార్చారు. తర్వాత 1989లో అదే చట్టానికి మరిన్ని అధికారాలు జోడించి, 'ప్రివెన్షన్ ఆఫ్ ఆట్రోసిటీస్ అగ్నెస్ట్ షెడ్యూల్డ్ కాస్ట్స్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్' యాక్ట్‌గా రూపొందించారు. ఇందులో షెడ్యూల్డ్ కులాలు/తరగతుల వారిని శారీరకంగా గాయపరిచినా, ఈ వర్గాల మహిళల గౌరవాన్ని కించపరిచినా తీవ్రమైన నేరంగా పరిగణించి కఠిన శిక్షలు పడేలా చట్టాన్ని సవరించారు.




ప్రస్తుతం, షెడ్యూల్డ్ కులాలు అనే పదానికి గతంలో ఉన్న అర్థం లేదని చెప్పవచ్చు. వారు సాంఘిక, విద్య, ఆర్థిక రంగాల్లో చాలా మెరుగైన స్థితికి చేరుకొన్నారు. వారిలో అత్యధికంగా 40 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. దాదాపు 28 శాతం మంది చిన్న వ్యవసాయ కమతాలున్న వారు కూడా ఉండటం గమనార్హం. దేశంలోని తోలు పరిశ్రమ కార్మికులంతా షెడ్యూల్డ్ కులాలవారే. చాలా కొద్దిమంది మత్స్యకారులుగానూ, నేతవారిగానూ స్థిరపడిపోయారు. అతికొద్ది మంది పారిశుధ్యవృత్తిని చేపట్టి జీవనం సాగించేవారు. పట్టణ ప్రాంతాల్లోనైతే రిక్షా కార్మికులు గానూ, బండివాళ్లుగానూ స్థిరపడిపోయారు.

స్వాతంత్ర్యం వచ్చి 60 ఏళ్లు దాటుతున్నా షెడ్యూల్డ్ కులాల వారిలో అక్షరాస్యత రేటు 54.6 శాతం మాత్రమే ఉంది. భారతదేశ సగటు అక్షరాస్యత 65 శాతమని గణాంక వివరాలు చెబుతున్నాయి. అయితే, షెడ్యూల్డ్ కులాల మహిళలలో అక్షరాస్యత శాతం మరింత తక్కువగా, అంటే 43.3 శాతం మాత్రమే ఉంది.

ఈ వర్గాల వారికి సాంఘిక న్యాయం కోసం ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టింది. వారి హక్కులను కాపాడేందుకు, చట్టాలను కఠినంగా అమలు చేయడం ద్వారా సాంఘిక

న్యాయం అమలు చేయడానికి శాయశక్తులా ప్రభుత్వం కృషి చేస్తోంది. రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో, అసెంబ్లీ, పార్లమెంట్‌ల్లో, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా సాంఘిక న్యాయాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ చర్యలే కారణంగానే వివిధ వృత్తుల్లో, ముఖ్యంగా డాక్టర్లు, లాయర్లు, జడ్జీలు, టీచర్లు, ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులుగా షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులను చూడగలుగుతున్నాం మనం.



అందుకనే 1975లో, అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ, షెడ్యూల్డ్ కులాల దుస్థితికి ప్రభుత్వానిదే బాధ్యత అని అంగీకరించారు. అందుకే ఆమె ఒక స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్‌ను రూపొందించి తద్వారా వారి అభ్యున్నతికి బాటలు వేశారు.

1980లో ప్రధాని ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రకటించిన వార్షిక ప్రణాళికలో, ఒక నిర్ణీత వ్యవధిలో షెడ్యూల్డ్ కులాల వారు దారిద్ర్య రేఖకు ఎగువకు తీసుకురావడానికి వీలు కల్పించారు.

1980 ఏప్రిల్‌లో అప్పటి కేంద్రహోం శాఖ సహాయమంత్రి యోగేంద్ర మక్వానా ఒక ప్రకటన చేస్తూ, దేశంలోని పేద ప్రజల్లో అధికశాతం ఉన్న షెడ్యూల్డ్ కులాల వారికి ప్రత్యేక కేంద్ర సహాయం చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. దాని ద్వారా. .

- ✤. స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్ ( అది ఇప్పుడు ఎస్.సి.సబ్‌ప్లాన్‌గా మారింది)
- ✤ షెడ్యూల్డు కులాల వారికి కేంద్ర ప్రత్యేక సహాయం
- ✤ షెడ్యూల్డ్ కులాల ఆర్థికాభివృద్ధి కోసం ఎస్.సి. ఫైనాన్స్ కార్పోరేషన్ ఏర్పాటు.

స్పెషల్ కాంపొనెంట్ ప్రణాళికను ఆరో పంచవర్ష ప్రణాళిక నుంచి ప్రారంభించి 25 ఏళ్ల పాటు అమల్లో ఉంచారు. ఇప్పటికీ అమల్లో ఉన్న నాటి పథకాల్లో కొన్ని ....

- ✤ వ్యవసాయం, పశుగణాభివృద్ధి శాఖ, ఉద్యాన శాఖ, మత్స్యశాఖ, గ్రామీణ కుటీర పరిశ్రమలు
- ✤ విద్య, ఆరోగ్యం, గృహనిర్మాణం, తాగునీరు, పౌష్టికాహార పథకాల వంటి సాంఘిక సేవా పథకాలు
- ✤ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ పథకం, డి.పి.ఎ.పి., డి.ఆర్.డి.ఎ. వంటి ప్రత్యేక పథకాలు ఇప్పటికీ అమల్లో ఉన్నాయి.

25 ఏళ్లుగా ఈ పథకాలన్నింటినీ అమలుచేసినా దారిద్ర్యరేఖకు దిగువన ఎన్నో కుటుంబాలు ఉన్నాయి. మహిళలు, పిల్లల్లో పౌష్టికాహారం లోపం, అక్షరాస్యతా శాతం, తలసరి ఆదాయం, గృహ నిర్మాణం, మిగతా కులాల స్థాయిలో పెరగలేదు.

మనమిప్పుడు 11వ పంచవర్ష ప్రణాళిక 3వ ఏడాదిలో వున్నాం. పదో ప్రణాళికలో (2002-07) షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి 6.526 కోట్ల రూపాయలు కేటాయించబడినవి. అందులో రూ. 5,786 కోట్లు షెడ్యూల్డ్ కులాలకు, రూ. 3472 కోట్లు షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి సంబంధించిన రెగ్యులర్ పథకాలకు, 2,313 కోట్ల రూపాయలు కేంద్ర ప్రత్యేక సహాయం కింద నిధులను సమకూర్చారు.

అయితే, స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్‌ను సక్రమంగా అమలు చేయాల్సిన ఎస్.సి.డి.ఎస్, నోడల్ ఏజెన్సీలు సమర్థవంతంగా పనిచేయడం లేదని షెడ్యూల్డ్ కులాలు, జాతుల జాతీయ కమిషన్ తప్పుబట్టింది.

1989లో కేంద్రప్రభుత్వం జాతీయ షెడ్యూల్డ్ కులాలు, జాతుల ఆర్థిక సహాయ సంస్థను ఏర్పాటు చేసింది. అది దేశంలో సాంకేతిక పరిజ్ఞానమున్న లబ్దిదారులకు తక్కువ వడ్డీరేటుపై రుణాలు ఇచ్చే ఏర్పాటు చేశారు. ఈ పథకం కింద 2005 వరకు నాలుగున్నర లక్షలమంది లబ్దిదారులు రుణాలు పొందారు.

దేశంలో పంచాయతీ రాజ్ సంస్థలు కూడా 15 శాతం నిధులను షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి కేటాయించాలి. ఈ కేటాయింపులు 1962-63 నుంచి మూడు అంచెల పంచాయతీ రాజ్ సంస్థల్లో అమలు జరుగుతూనే వున్నాయి. ఈ నిధులతో తాగునీటి సరఫరా, రోడ్లు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి ప్రాథమిక వసతులు కల్పించాలి. దానితో పాటు సామాజిక మౌలికవసరాలైన పాఠశాలలు, వైద్య సౌకర్యాలు కూడా కల్పించాలి. ఆర్థిక సహాయ పథకాలు, స్వయం ఉపాధి పథకాలలో కూడా వారికి ప్రాధాన్యం ఇవ్వాలి.

అయితే, కొన్ని చోట్ల షెడ్యూల్డ్ కులాల కోసం కేటాయించాల్సిన నిధులను ఇతర పథకాలకు, ఇతర కులాల వారికి మళ్లిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గ్రామస్థాయిలో ఉండే షెడ్యూల్డ్ కులాల వారు అప్రమత్తంగా వుండి, వారి ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజాభిప్రాయాన్ని కూడ గట్టాల్సిన అవసరం ఉంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2008-09 ఆర్థిక సంవత్సరంలో స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్ (ఎస్.సి., ఎస్.పి) కింద రూ. 8560 కోట్లు కేటాయించింది. మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరం తాలూకు జమా ఖర్చుల నివేదిక వచ్చాక దాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉంది.

*-ఎం. సెబాస్టియన్ రాజు, ఐ.పి.ఎ.ఎస్. (రిటైర్డ్)*
*సెంటర్‌హెడ్, సిఎస్ఇఇ, ఎఎమ్ఆర్-అపార్డ్*
*(అనువాదం:కె.ఎస్)*




# ఆంధ్రప్రదేశ్ స్మార్ట్ కార్డ్

# ప్రాజెక్టు అమలుపై ఓ పరిశీలన

గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల ఆర్థిక లావాదేవీలన్నింటినీ ఒకే వ్యవస్థ కిందకు తెచ్చేందుకు 2006లో 'బయోమెట్రిక్ స్మార్ట్ కార్డు టెక్నాలజీ'ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రస్తుతం 10 ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఒక ప్రైవేటు బ్యాంక్ భాగస్వామ్యంతో 13 జిల్లాలలో ఈ స్మార్ట్ కార్డ్ విధానం అమల్లో ఉంది.

దాదాపు 50లక్షల మంది పేదలు ఈ పథకం కోసం పేర్లను నమోదు చేసుకోగా, 30లక్షల మందికి ఈ స్మార్ట్ కార్డులను అందచేశారు. దీనివలన 100కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయి. ఈ పథకం అమలు జరుగుతున్న గత రెండేళ్ల కాలంలో కొన్ని ముఖ్య ధోరణులు స్పష్టంగా కన్పిస్తున్నాయి. విధానాలు సరళతరం కావడం, నిర్వహణ ఖర్చుల తగ్గుదల, సామర్థ్యం పెరుగుదల ప్రధానంగా చెప్పుకోవచ్చు.

## 1. బ్యాంకు ఖాతాలు తెరిచే విధానం

కొత్త బ్యాంకుల 'Know Your Customer' (KYC) విధానాలు చాలా కష్టతరంగా ఉండేవి. కొత్త సభ్యుడ్ని చేర్చుకొనేటప్పుడు, కనీసం ఆరునెలలు బ్యాంక్‌తో లావాదేవీలు జరిపిన పాత సభ్యుడు విధిగా పరిచయం చేయాల్సి ఉండేది. కొత్త సభ్యుడి ఫోటోను, అడ్రస్‌ను పాత సభ్యుడు ధృవ పరచాల్సి వచ్చేది. అయితే, మొదట్లో ఒక్కో బ్యాంక్ ఒక్కో పద్ధతిని పాటించేది. ఓ కొత్త సభ్యుణ్ణి చేర్చుకోవాలంటే, అతని తాలూకు ఫోటోలు, రేషన్ కార్డు, జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ పథకం కార్డు వంటి ఎన్నో ధృవ పత్రాల కాపీలను జత చేయాల్సి వచ్చేది. సభ్యత్వ దరఖాస్తే ఎన్నో పేజీలు ఉండేది. ఫలితంగా కొత్త సభ్యులను చేర్చుకొనే ప్రక్రియ చాలా నెమ్మదిగా జరిగేది. తరువాత బ్యాంక్‌లు రిజర్వ్‌బ్యాంక్ నిబంధనల కనుగుణంగా త్వరితగతిన స్మార్ట్ కార్డు ఖాతాలు తెరిచే విధానాన్ని సరళీకృతం చేశాయి. ఈ ఖాతాలు తెరవటంలో సరళీకృత విధానం వల్ల కృష్ణా జిల్లాలో యాక్సిస్ బ్యాంక్ మూడు నెలల కన్నా తక్కువ వ్యవధిలో దాదాపు మూడున్నర లక్షల మంది కొత్త ఖాతాదారులను చేర్పించింది.

## 2. పాయింట్ ఆఫ్ సేల్ టెర్మినల్

సభ్యత్వాలు నమోదు చేయడం, చెల్లింపులు తదితర వ్యవహారాలన్నింటికీ కలిపి ఒకే టెర్మినల్ పరికరాన్ని రూపొందించడం మరో ముఖ్యమైన పరిణామం. మొదట్లో వివిధ బ్యాంకులు, సర్వీస్ ప్రొవైడర్లు వేరువేరు పరికరాల ద్వారా సభ్యత్వ నమోదు, చెల్లింపుల వ్యవహారాలను చేపట్టేవారు. దానికి వారు వేరువేరు యంత్రాలను వాడే వారు కూడా. ఫలితంగా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆలస్యం జరిగేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఒకటి రెండు చోట్ల తప్ప, అన్ని చోట్లా సభ్యత్వ నమోదు, చెల్లింపుల వ్యవహారాలను ఒకే యంత్రంపై చేస్తున్నారు. అందువల్ల, సామర్థ్యం గణనీయంగా పెరిగింది.




## 3. స్మార్ట్ కార్డులు

సాధారణంగా జావా అప్లికేషన్లలో రూపొందించిన కార్డులో కస్టమర్ సమాచారాన్ని నిక్షిప్తం చేస్తారు. ఆ కార్డుల్లో 32 కె.బి. మెమొరీ ఉంటుంది. మొదట్లో, ఒక్కో కార్డును తయారు చేయించడానికి 100 నుంచి 150 రూపాయల ఖర్చు అయ్యేది. ఈ పద్ధతిని మార్చి, టెర్మినల్‌లోనే సమాచారాన్ని నిక్షిప్తం చేసి, కస్టమర్‌కు ఐడెంటిటీ కార్డును ఇస్తారు. దీనివల్ల కార్డు ఖర్చు కేవలం 10 రూపాయలకే అవుతుంది కాబట్టి ప్రాజెక్టు వ్యయం గణనీయంగా తగ్గిపోతుంది. ఈ పద్ధతిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పటికే అమల్లో పెట్టింది. ఏ.పి. ఆన్‌లైన్ సంస్థ నిజామాబాద్‌లో అమలు చేయతలపెట్టిన ఈ ప్రాజెక్టులో కార్డు పద్ధతికి పూర్తిగా స్వస్తి పలకాలని భావిస్తోంది. ప్రాజెక్టు ప్రారంభదశలో ఉంది కాబట్టి లావాదేవీలు అంతగా లేకపోవడంతో రాబడి తక్కువగా ఉంది. అందువల్ల, పెట్టుబడుల వ్యయం తగ్గించడం వల్ల దీర్ఘకాలం ఈ ప్రాజెక్టును అమలుచేయడానికి అవకాశం ఉంది.

## 4. బ్యాంక్ విధానాలు

బ్రాంచీ లేకుండా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయంతో ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమైనప్పటికీ, ఈ ప్రాజెక్టు అమలుజరిగే క్రమంలో బ్రాంచీల పాత్ర ఉండాల్సిన అవసరం ఉందని రుజువైంది. మొదట్లో కస్టమర్లు చేసే లావాదేవీలలో బ్యాంక్ మేనేజర్ల పాత్ర లేకుండా చేశారు. బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు మాత్రమే కొత్త అకౌంట్లను ప్రారంభించేవి.




అవే చెల్లింపులకు సంబంధించిన ఉత్తర్వులను క్రింది స్థాయిలో ఉన్న బ్రాంచ్ పరిధిలో కొత్తగా వచ్చిన అకౌంట్ల గురించి ఆయా బ్రాంచ్ మేనేజర్లుకు తెలిసేదికాదు. ఒక్కోసారి క్యాష్ సరిపడా ఉండేది కాదు, లేదా మెషీన్‌లు పనిచేసేవి కావు. ఈ విషయం రాష్ట్ర లేదా జిల్లా స్థాయి అధికారులకు వెంటనే తెలిసేది కాదు. ఫలితంగా, కొన్నిచోట్ల దీర్ఘకాలంపాటు చెల్లింపుల్లో జాప్యం జరిగేది.

ఈ సమస్యను గుర్తించాక, గత ఆరునెలలుగా పరిష్కారం కోసం ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. బ్యాంక్ మేనేజర్లకు వర్క్‌షాపులను నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ సత్వర చర్యలు ప్రారంభించింది. ఒక బ్రాంచ్ పరిధిలోని అన్ని అకౌంట్లను బ్యాంక్‌తో అనుసంధాన పరిచారు. దీనివల్ల క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలను, జాప్యాన్ని నివారించగలుగుతున్నారు.

### 5. తక్షణ జోక్యం అవసరమైన సమస్యలు

స్మార్ట్ కార్డులున్నప్పటికీ 40 శాతం చెల్లింపులు మాన్యువల్‌గానే జరుగుతున్నాయి. దీనికి అనేక కారణాలున్నట్లు అధ్యయనంలో వెల్లడైంది. కొన్ని సందర్భాలలో అకౌంట్లు ఓపెన్ కాకపోవడం, కార్డులు యాక్టివేషన్ కాకపోవడం, నెట్‌వర్క్ బిజీగా ఉండి డేటా ట్రాన్స్‌ఫర్ కాకపోవడం, కొన్ని గ్రామాల్లో విద్యుచ్ఛక్తి కోత వల్ల బ్యాటరీలు చార్జికాక యంత్రాలు మొరాయించడం జరుగుతోంది. అందువల్ల స్మార్ట్ కార్డులు ఉన్నా ఆశించిన ఫలితాలనివ్వడం లేదు.

కంప్యూటర్ల పనితీరును మెరుగుపరచి, మాన్యువల్ – చెల్లింపులు బాగా తగ్గించాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఈ ప్రాజెక్టు వల్ల సత్ఫలితాలు వస్తాయి. చెల్లింపుల్లో మోసాలకు అడ్డుకట్ట పడుతుంది.

ఎంతో మంచి ఉద్దేశంతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టును విజయవంతం చేయాడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ్యాంకులను ప్రోత్సహించడానికి జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ పథకం క్రింద వేతనాల చెల్లింపులను, సాంఘిక భద్రతా పథకం చెల్లింపులను బ్యాంకులకు అనుసంధానం చేయాలని కోరింది.

బ్రాంచి మేనేజర్లను ఈ కార్యక్రమంలో నిమగ్నం చేస్తూ, సంబంధిత బ్యాంకు బ్రాంచిలోని అన్ని అకౌంట్లను కలుపుతూ ఎస్‌బిఐ ఈ విషయంలో చొరవ తీసుకుని ముందంజ వేసింది. దీనివల్ల, క్షేత్ర స్థాయిలోని సమస్యలను, ఆలస్యాలను గణనీయంగా తగ్గించడానికి వీలయింది.

**– ఎ. శాంతికుమారి,** ఐ.ఎ.ఎస్.,
కమీషనర్, గ్రామీణాభివృద్ధి శాఖ

*విభిన్న సంస్కృతులు, మతాలు, భాషలు, భిన్నమైన భౌగోళిక వాతావరణ పరిస్థితులతో ఉపఖండంగా విస్తరించి ఉన్న భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడపటానికి ప్రణాళికా బద్ధమైన మార్గాన్ని అనుసరించక తప్పదని భావించిన భారత ప్రభుత్వం **1950**వ సంవత్సరంలో జాతీయ స్థాయిలో ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేసింది. దేశంలో అందుబాటులో ఉన్న ఆర్థిక, మానవ, సహజ వనరులను సమర్ధవంతంగా, సమతుల్యంగా అభిలషనీయమైన రీతిలో వినియోగించుకోవటానికి పంచవర్ష ప్రణాళికలను రూపొందించటం, ప్రణాళికల అమలు తీరుని ఎప్పటికప్పుడు సమీక్షించి, ఫలితాలను విశ్లేషించి ప్రభుత్వ విధానాలలో మార్పులు, చేర్పులు సూచించటం ప్రణాళికా సంఘం ముఖ్య ఉద్దేశాలు.*

రంగాలలో పురోభివృద్ధి సాధన దిశలో నేటికీ మనదేశం పలు సమస్యల ను ఎదుర్కొంటోంది. న్యూ ఢిల్లీలోని సెంట్రల్ స్టాటిస్టికల్ ఆర్గనైజేషన్, 2005 సంవత్సరంలో విడుదల చేసిన 'సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాల' (మిలీనియం డెవలప్‌మెంట్) మధ్యంతర నివేదిక ప్రకారం దేశంలో కేవలం 32.36 శాతం జనాభాకు మాత్రమే ఇళ్ళలో మరుగుదొడ్లు/స్నానపు గదుల సౌకర్యాలు ఉన్నాయని, 39.8 శాతం కాన్పులు మాత్రమే నిపుణుల పర్యవేక్షణలో జరుగుతున్నాయని, ప్రతీ 1000 శిశు జననాలకి 60 మరణాలు సంభవిస్తున్నాయని, ప్రతీ లక్ష మంది గర్భవతులలో 407 మంది మరణిస్తున్నారని వెల్లడించింది.

2007లో వెలువడిన జాతీయ కుటుంబ అరోగ్య సర్వేక్షణ-3 ప్రకారం కూడా ప్రతీ 1000 జననాలకు 57 శిశు మరణాలు సంభవిస్తున్నాయనీ, 41 శాతం కాన్పులు మాత్రమే నిపుణుల పర్యవేక్షణలో జరుగుతున్నాయని, 44 శాతం జనాభాకు మాత్రమే మరుగుదొడ్ల సదుపాయం ఉన్నదనీ, 27.9 శాతం జనాభాకి మాత్రమే పైపులైను ద్వారా మంచినీటి సరఫరా జరుగుతున్నదని మనం అర్థం చేసుకోవచ్చు. 2007 లో ఐక్యరాజ్య సమితి

# ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా ప్రణాళికా కమిటీలు ఎట్లా పని చేస్తున్నాయి ?

మనదేశంలో 1951 నుండి 2007 వరకూ 10 పంచవర్ష ప్రణాళికలు అమలుపరచబడ్డాయి. ప్రస్తుతం మనం 11 వ పంచవర్ష ప్రణాళిక (సం. 2007-2012)ను అమలు పరుచుకుంటున్నాము.

ఆర్థికవృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యాలుగా భారతదేశం గత ఐదు దశాబ్దాలలో వివిధ రకాలయిన ప్రణాళికా వ్యూహాల ద్వారా వ్యవసాయం, బహుళార్ధసాధక నీటిపారుదల ప్రాజెక్టులు, భారీ పరిశ్రమలు, సమాచార సాంకేతిక రంగాలు, ఉన్నత విద్య, శాస్త్ర సాంకేతిక, అంతరిక్ష రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధించింది. ప్రణాళికా బద్ధమైన విధానాల రూపకల్పన, అమలు వలన 1960 వ దశకాలలో 3.23 శాతంగా ఉన్న స్థూల జాతీయోత్పత్తిలో వృద్ధి రేటు 2008 సం. నాటికి 7.5 నుండి 8.0 శాతం మేరకు వృద్ధి చెందుతూ ప్రపంచంలోనే అత్యంత వేగవంతంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా మనదేశం అవతరించింది. ఈ ఆర్థిక అభివృద్ధికి వెనుక చీకటి కోణాలు సామాజిక న్యాయం సాధనా దిశలో మన దేశం ఇంకా ఎంతో పురోగతిని సాధించాలని అప్రమత్తం చేస్తున్నాయి.

### సామాజిక రంగంలో వెనుకబాటు

సామాజిక రంగంలో ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, వైద్యం, మహిళా శిశుసంక్షేమం, పోషకాహారం గృహ వసతి, మంచినీరు, పారిశుధ్ధ్య

## వికేంద్రీకృత ప్రణాళికా రచన

అభివృద్ధి కార్యక్రమం (యు.ఎన్.డి.పి) ప్రచురించిన మానవ అభివృద్ధి నివేదికలో 177 దేశాల జాబితాలో భారతదేశం 128 వ స్థానంలో ఉన్నదన్న విషయం ప్రణాళికా రూపశిల్పులకు, పాలకులకు మింగుడు పడని విషయమే కాక తమ విధానాలను తరచి చూసుకొనవలసిన అవసరాన్ని నొక్కి చెప్తోంది.


అదే విధంగా యునిసెఫ్ 2008 లో విడుదల చేసిన నివేదిక కూడా పలు చేదు నిజాలను బహిర్గతం చేసింది. ఈ నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 5సంవత్సరాలలోపు సంభవించే శిశుమరణాలలో 21 శాతం మరణాలు భారతదేశంలోనే సంభవిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా తక్కువ బరువుతో జన్మించే శిశువులలో 43 శాతం భారతదేశంలోనే జన్మిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంభవించే నియోనేటల్(28 రోజులలోపు) మరణాలలో 1/3 వ వంతు మనదేశంలోనే సంభవిస్తున్నాయి. అధికారిక లెక్కలకి, క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులకి వ్యత్యాసం మధ్య సంగతి ఎలా ఉన్నా, ఈ గణాంకాలను ఒకసారి పరిశీలిస్తే పేదల జీవన ప్రమాణాలు నానాటికీ తీసిపెట్టు నాగంభొట్లు అన్న చందాన తయారవుతున్నాయన్న వాస్తవాన్ని మనం జీర్ణించుకోకతప్పదు.

## కేంద్రీకృత ప్రణాళికా పరిమితులే కారణమా?

వివిధ రాష్ట్రాలు, భాషలు, జాతులు, కులాలు, విభిన్న సంస్కృతులు, ఆచారాలు, వ్యవహారాలు కల్గి భిన్నత్వంలో ఏకత్వంతో భాసిల్లే భారతదేశం దేశం మొత్తానికి కేంద్ర లేదా రాష్ట్ర స్థాయిలోనే వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పన, దేశ/రాష్ట్ర వ్యాప్తంగా ఒకే నిబంధనల వర్తింపు, వివిధ ప్రాంతాలలో ప్రభుత్వ పెట్టుబడులలో సమతూకం పాటించకపోవటం, అభివృద్ధికి ప్రాధాన్యతా రంగాలను సరిగా నిర్వచించుకోకపోవటం, ప్రణాళికా రచనలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర పరిమితం కావటం, స్థానిక సంస్థలకు ప్రణాళికా రచనలో లేశమాత్రమైనా ప్రాతినిధ్యం, అవకాశం కల్పించకపోవటం, ప్రణాళికా రూపకల్పనలో ప్రజలకు ప్రత్యక్ష పాత్ర లేకపోవటం, వివిధ స్థాయిలలో సమాచార లోపం, పథకాల అమలులో పారదర్శకత లోపించటం, నాయకుల/అధికారుల అవినీతి వంటి వివిధ కారణాల వల్ల సామాజిక రంగంలో ముఖ్యంగా పేదరిక నిర్మూలన, ఉపాధికల్పన, ఆదాయంలో పేద-ధనిక తారతమ్యాలు తగ్గించటంలో, విద్య, ఆరోగ్య రంగాలలో ఆశించిన ఫలితాలను ఇప్పటివరకూ అమలు పరుచుకున్న 10 పంచవర్ష ప్రణాళికల ద్వారా సాధించలేకపోయామన్నది పలు ఆర్థికవేత్తల అభిప్రాయం.

## వికేంద్రీకృత ప్రణాళికా రచనే పరిష్కారమా?

సామాజిక రంగంలో పురోభివృద్ధి సాధించాలంటే ప్రణాళికా ప్రక్రియను వికేంద్రీకరించవలసిన అవశ్యకతను మొదటి పంచవర్ష ప్రణాళికా కాలం నుండే నొక్కి చెప్తున్నప్పటికీ వాస్తవంగా ఈ దిశలో పురోగతి పెద్దగా లేదు. 1969 సం.లో జిల్లా ప్రణాళికా రచనపై ప్లానింగు కమీషను మార్గదర్శకాలు రూపొందించింది. డాంట్‌వాలా కమిటీ సిఫారసుల ప్రకారం 1978 సం.లో బ్లాకు స్థాయి ప్రణాళికా రచనపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ రాష్ట్రాలు/జిల్లాలు/బ్లాకుల స్థాయిలో ప్రణాళికా రూపకల్పనా నైపుణ్యాలు లేకపోవటం వల్ల, పంచాయతీరాజ్ సంస్థల సామర్థ్యాల పెంపుదలకు రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టకపోవటం వల్ల వికేంద్రీకృత ప్రణాళికా రచన ప్రయోగ దశలోనే ఆగిపోయింది.




**ఆర్థికవృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యాలుగా భారతదేశం గత ఐదు దశాబ్దాలలో వివిధ రకాలయిన ప్రణాళికా వ్యూహాల ద్వారా వ్యవసాయం, బహుళార్థసాధక నీటిపారుదల ప్రాజెక్టులు, భారీ పరిశ్రమలు, సమాచార సాంకేతిక రంగాలు, ఉన్నత విద్య, శాస్త్ర సాంకేతిక, అంతరిక్ష రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధించింది. ప్రణాళికా బద్ధమైన విధానాల రూపకల్పన, అమలు వలన 1960 వ దశకాలలో 3.23 శాతంగా ఉన్న స్థూల జాతీయోత్పత్తిలో వృద్ధి రేటు 2008 సం. నాటికి 7.5 నుండి 8.0 శాతం మేరకు వృద్ధి చెందుతూ ప్రపంచంలోనే అత్యంత వేగవంతంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా మనదేశం అవతరించింది. ఈ ఆర్థిక అభివృద్ధికి వెనుక చీకటి కోణాలు సామాజిక న్యాయం సాధనా దిశలో మన దేశం ఇంకా ఎంతో పురోగతిని సాధించాలని ఆప్రమత్తం చేస్తున్నాయి.**

1984లో హనుమంతరావు కమిటీ నివేదిక కూడా ప్రణాళికా వికేంద్రీకరణను సమర్థిస్తూ జిల్లా ప్రణాళికా ప్రక్రియను సూచించింది. 1985లో జి.వి.కె.రావు కమిటీ నివేదిక కూడా గ్రామీణాభివృద్ధి పథకాలను లక్షిత ప్రజలకు చేర్చాలంటే వికేంద్రీకృత ప్రణాళికా రచన, అందుకు కావలసిన పరిపాలనా వ్యవస్థను ఏర్పరచటం అవసరమని పేర్కొన్నది. ఎట్టకేలకు 73వ మరియు 74వ రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీరాజ్ సంస్థలకు ప్రణాళికల రూపకల్పన బాధ్యత రాజ్యాంగపరంగా సంక్రమించింది. పంచాయతీరాజ్ సంస్థలు రాజ్యాంగ ప్రతిపత్తి సంతరించుకొన్న 13 సంవత్సరాలకు అంటే 2006లో కేంద్ర ప్రభుత్వానికి రామచంద్రన్ కమిటీ సమర్పించిన నివేదిక 'ప్లానింగ్ ఎట్ ది గ్రాస్‌రూట్సు లెవెల్' ప్రకారం 2006 ఆగష్టులో ప్లానింగ్ కమీషన్ జిల్లా ప్రణాళికా రచనపై రాష్ట్రాలకు మార్గనిర్దేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రణాళికలో జిల్లా ప్రణాళికలు తప్పనిసరిగా అంతర్భాగాలవ్వాలని, జిల్లా ప్రణాళికలో గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్తు , మున్సిపాలిటీల ప్రణాళికలు అంతర్భాగం అవ్వాలని ఈ సూచనల సారాంశం.

సమ్మిళిత అభివృద్ధి సాధనకు మానవ అధివృద్ధి రంగంలో నాణ్యమైన సేవలను ప్రజలకు అందజేయడానికి పంచాయతీరాజ్ సంస్థలను ఒక సాధనంగా ఉపయోగించుకోవాలని, ప్రణాళికల తయారు, అమలు, మధింపులో ప్రజలకు, పంచాయతీరాజ్ సంస్థలకు తప్పనిసరిగా భాగస్వామ్యం కల్పించాలని 11వ పంచవర్ష ప్రణాళికా పత్రంలో కూడా ప్లానింగ్ కమీషన్ అభిప్రాయపడింది.

కేంద్రీకృత స్థాయిలో పథక రచనలు, అమలు, పర్యవేక్షణలకు క్రమేపీ

స్పష్టి పలికి స్థానిక ప్రభుత్వాలకు పథకాల ఎంపిక, అమలు, పర్యవేక్షణ , మధింపు ప్రక్రియలో పూర్తిస్థాయి భాగస్వామ్యం కలుగచేస్తే తప్ప మానవ అభివృద్ధి రంగంలో ఆశించిన మేర పురోగతి సాధ్యంకాదనే స్పష్టమైన సందేశాన్ని ఈ విధాన పత్రం మనకు స్పష్టం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలన్నీ పంచాయతీరాజ్ సంస్థలకు అధికారాల బదలాయింపు ప్రక్రియను వేగవంతం చేయటంతో పాటు 74 వ రాజ్యాంగ సవరణలో సూచించిన ప్రకారం జిల్లా ప్రణాళికా కమిటీలను ప్రతీ జిల్లాలోనూ ఏర్పరచి జిల్లా ప్రణాళికా ప్రక్రియను 11 వ పంచవర్ష ప్రణాళిక కాలంలో చేపట్టాలని ప్లానింగ్ కమీషన్ సూచించిన్పటికీ 18 రాష్ట్రాలలో మాత్రమే జిల్లా ప్రణాళికా కమిటీలు ఏర్పాటయ్యాయి. ఈ జిల్లా ప్రణాళికా కమిటీలను కార్యశీలతలోకి తీసుకొని రావటానికి కేంద్ర ప్రభుత్వ పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ చేస్తున్న కృషిలో భాగంగా దేశవ్యాప్తంగా 250 జిల్లాలను అభివృద్ధిలో వెనుకబడిన జిల్లాలుగా గుర్తించి, ఈ జిల్లాలలో జిల్లా అభివృద్ధి ప్రణాళికల తయారీకి ప్రత్యేకించి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి (బి.అర్.జి.ఎఫ్) ద్వారా నిబంధితం కాని నిధులను (అన్‌టైడ్ ఫండ్స్) కేటాయించి వికేంద్రీకృత ప్రణాళికల రచనా ప్రక్రియకు ప్లానింగు కమీషను ప్రయత్నాలను ప్రారంభించింది.

> ***సమ్మిళిత అభివృద్ధి సాధనకు మానవ అభివృద్ధి రంగంలో నాణ్యమైన సేవలను ప్రజలకు అందజేయడానికి పంచాయతీరాజ్ సంస్థలను ఒక సాధనంగా ఉపయోగించుకోవాలని, ప్రణాళికల తయారు, అమలు, మధింపులో ప్రజలకు, పంచాయతీరాజ్ సంస్థలకు తప్పనిసరిగా భాగస్వామ్యం కల్పించాలని 11వ పంచవర్ష ప్రణాళికా పత్రంలో కూడా ప్లానింగ్ కమీషన్ అభిప్రాయపడింది.***

## ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా ప్రణాళికా కమిటీలు

ప్రణాళికల రూపకల్పన కోసం జాతీయ స్థాయిలో ఏర్పర్చిన ప్రణాళికా సంఘం, జాతీయ అభివృద్ధి మండలి, రాష్ట్ర స్థాయిలోని ప్లానింగు బోర్డు, ప్రాంతీయ ప్రణాళిక మరియు అభివృద్ధి వంటి వివిధ రకాలయిన సంస్థలన్నీ వాస్తవానికి రాజ్యాంగేతర సంస్థలు. ఇవి కేవలం కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసిన ఉత్తర్వుల ద్వారా ఏర్పాటైనవి మాత్రమే. భారత రాజ్యాంగపు ఆర్టికల్ 243 జడ్.డి ననుసరించి ఏర్పడిన జిల్లా ప్రణాళికా కమిటీలు పూర్తిగా రాజ్యాంగ బద్ధమైనవి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ప్రణాళికా కమిటీల చట్టం (40/2005) ను 2005లో అమలులోకి తీసుకొని వచ్చి 2008 సం. నాటికి 22 జిల్లాలలోను జిల్లా ప్రణాళికా కమిటీ (డి.పి.సి)లను ఏర్పరిచింది.

జిల్లా స్థాయిలో అభివృద్ధి ప్రణాళికా రూపకల్పన ఒక బృహత్తర కార్యక్రమం. ఎందుకంటే గడిచిన ఐదు దశాబ్దాలలో మన రాష్ట్రం, జిల్లా స్థాయి ప్రణాళికల రూపకల్పన, సమీక్షలకు జిల్లా అభివృద్ధి బోర్డులు, జిల్లా ప్రణాళికా బోర్డులు, జిల్లా ప్రజా పరిషత్తులలో ప్రణాళికా స్టాండింగు కమిటీలు, జిల్లా అభివృద్ధి మరియు సమీక్షా మండలి, జిల్లా సమీక్షల మండలి వంటి సంస్థల ఏర్పాటుతో పలు ప్రయోగాలు చేసినా పూర్తి స్థాయిలో సమగ్రమైన జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించలేకపోయాయి.

ప్రణాళికా ప్రక్రియ అంతా రాష్ట్ర స్థాయిలోనే ఆర్థిక మరియు ప్రణాళికా శాఖల ఆధ్వర్యంలోనే జరిగిపోతోంది. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో ప్రణాళికా బోర్డు, ప్రాంతీయ స్థాయిలో ప్రాంతీయ ప్రణాళికా బోర్డులు ఉనికిలో ఉన్నప్పటికీ, నామ మాత్రంగానే పనిచేస్తున్నాయి. జిల్లా స్థాయిలో గణాంక సిబ్బందితో కూడిన ముఖ్య ప్రణాళికా అధికారి కార్యాలయాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినప్పటికీ ఈ యంత్రాంగం రాష్ట్ర స్థాయి ప్రణాళికల తయారీల ఉపయుక్తమయ్యే గణాంకాలను జిల్లాల నుండి సేకరించి ప్రభుత్వానికి అందచేయటానికి మాత్రమే పరిమితమైంది తప్ప ప్రణాళికలను తయారుచేసే స్థాయిని ఇంకా సంతరించుకోలేదు.

జిల్లా ప్రణాళికా చట్టాన్ననుసరించి ప్రతి జిల్లా ప్రణాళికా కమిటీ భాగస్వామ్య పద్ధతిలో స్థానిక ప్రజల అవసరాలను గుర్తింపచేస్తూ ప్రాధాన్యతా ప్రాతిపదికన అందుబాటులో ఉన్న వనరులను వినియోగస్తూ ఆ జిల్లాకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయాలి. ఈ ప్రక్రియలో భాగంగా ప్రతీ గ్రామ పంచాయతీ, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు జిల్లాలో గల అన్ని మునిసిపాలిటీలు తమ ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలను తయారు చేసుకొని జిల్లా ప్రణాళికా కమిటీకి సమర్పించాలి. దీనివల్ల అట్టడుగు స్థాయిలోని ప్రజాప్రతినిధులు ప్రణాళికా రచనలో భాగస్వాములు కావటమే గాక గ్రామసభ ద్వారా ప్రజలు కూడా ప్రత్యక్షంగా ప్రణాళికా రచనలో పాలుపంచుకోవటానికి అవకాశం కలుగుతుంది. ఈ విధంగా ప్రణాళికా ప్రక్రియ చేపట్టటం వల్ల ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాల రూపకల్పనకు వీలు కలగటమే కాక, పథకాల అమలులో ప్రజా భాగస్వామ్యం పెరిగి పారదర్శకతతోను, జవాబుదారీతనంతోనో ప్రజాధనాన్ని ఖర్చు చేయటానికి అవకాశం ఉంటుంది. అంతేగాక జిల్లా కోసం తయారు చేసుకొన్న అభివృద్ధి ప్రణాళికల అమలును తరచుగా పర్యవేక్షించటం, జరుగుతున్న అభివృద్ధిని సమీక్షించటం, మూల్యాంకనం చేయటం వంటి చర్యలు కూడా జిల్లా ప్రణాళికా కమిటీ ఎప్పటికప్పుడు చేపట్టటం వల్ల పరిపాలనలో నెలకొన్న స్తబ్దత తొలగి ప్రగతి పథంలో సాగటానికి సావకాశం ఉంటుంది. వికేంద్రీకృత ప్రణాళికా రచన విజయవంతమవాలంటే జిల్లా ప్రణాళికా యంత్రాంగాన్ని, ప్రణాళికా కమిటీలను పరిపుష్టి చెయ్యాలి. ఈ క్రింది చర్యలు చేపట్టినట్లయితే కొంత వరకూ సత్ఫలితాలను ఇవ్వటానికి అవకాశం ఉంటుంది.

## గ్రామ స్థాయి సమాచార సేకరణ

ప్రణాళికా రచనకవసరమయ్యే సమాచార సేకరణను గ్రామ స్థాయి నుండి జరిపి సేకరించిన సమాచారాన్ని ప్రజలచే గ్రామ సభల ద్వారా ధృవీకరింపచేయాలి. సమాచార సేకరణకు గాను ద్వితీయ సమాచార వనరులైన (సెకండరీ సోర్సెస్) అధీకృతించబడిన జనాభా లెక్కలు, పశుగణన సర్వేక్షణ, వ్యవసాయ భూకమతాల సర్వేక్షణ, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, రేషనుకార్డులు, సర్వ శిక్షా అభియాన్, అంగన్‌వాడీ సర్వేక్షణల ద్వారా సేకరించిన సమాచారంతో పాటు సహజవనరులు, భౌతిక వనరులు,

ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని కూడా సేకరించి గ్రామ స్థాయిలోనే డేటా బ్యాంకును ఏర్పరచవచ్చు. ఇదే విధమైన సమాచారాన్ని ప్రతి మండలానికి, జిల్లా స్థాయిలోను మరియు మునిసిపాలిటీల వారీగా సేకరించాలి. ఈ విధంగా సేకరించిన సమాచారాన్ని కంప్యూటరీకరించి తదనంతర విశ్లేషణకు, ప్రణాళికా రచనలు, నిర్ణయాలను తీసుకొనటానికి భౌగోళిక సమాచార వ్యవస్థతో అనుసంధానించి ఒక మంచి మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టంగా రూపొందించాలి. ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 21937 పంచాయతీలలో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేయటం కష్టమైనప్పటికీ భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మెరుగైన ప్రణాళికల రూపకల్పనకు ఇది తప్పనిసరి చర్య. జనన మరణాలు, బడి ఈడు గల పిల్లల సంఖ్య, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలకు అర్హత గల జంటల వివరాలు, భూగర్భ జలమట్టం, వర్షపాతం వంటి గతిశీలత గల్గిన సమాచారాన్ని (డైనమిక్ డాటా) ఎప్పటికప్పుడు ఈ సమాచార వ్యవస్థ ద్వారా నిర్వహించటానికి అవసరమయిన సాంకేతిక మద్దతును గ్రామ పంచాయతీ/మండల పరిషత్తులకు ప్రభుత్వం కల్పించి గ్రామ స్థాయిలోనే సమాచార నిర్వహణను వ్యవస్థీకృతం చెయ్యాలి.

## ఆర్థిక వనరుల లభ్యతా వివరాలు

ఏ స్థాయిలోని ప్రణాళికా రచనకైనా ప్రణాళికా అవధిలో ఎంతమేరకు నిధులు అందుబాటులో ఉన్నయనే సమాచారం లభ్యం కావటం కీలకమైన అంశం. ప్లానింగ్ కమీషన్ ఆదేశాల ప్రకారం వికేంద్రీకృత ప్రణాళికల రూపకల్పనా సమయంలో వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల క్రింద జిల్లాకు విడుదల అయ్యే నిధులు, రాష్ట్ర ప్రణాళికలో జిల్లా సెక్టారుకు కేటాయించిన నిధులు, వివిధ స్థాయిలలోని పంచాయతీరాజ్/మునిసిపల్ సంస్థలకు విడుదల అయ్యే నిధులు, మునిసిపాలిటీలు, పంచాయతీల (గ్రామ పంచాయతీ/మండల పరిషత్తు/జిల్లా పరిషత్తు) స్వంత నిధులను పరిగణనలోకి తీసుకొంటూ ఆయా స్థాయిలలో ప్రణాళికా రచన చేపట్టాలి. వికేంద్రీకృత ప్రణాళికల రూపకల్పన జరగాలంటే , పతీ ఆర్థిక సంవత్సరం మొదటిలోనే జిల్లాల వారీగా, పంచాయతీ/మునిసిపాలిటీల వారీగా ఏ పథకం క్రింద ఎంతమేర నిధులు విడుదల అయ్యే అవకాశం ఉందో తప్పనిసరిగా తెలియపర్చాల్సి ఉంటుంది.

ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ ఫ్లాగా షిప్ పథకాలయిన జాతీయ ఉపాధి




**రాష్ట్ర ప్రభుత్వాలన్నీ పంచాయతీరాజ్ సంస్థలకు అధికారాల బదలాయింపు ప్రక్రియను వేగవంతం చేయటంతో పాటు 74 వ రాజ్యాంగ సవరణలో సూచించిన ప్రకారం జిల్లా ప్రణాళికా కమిటీలను ప్రతీ జిల్లాలోనూ ఏర్పరచి జిల్లా ప్రణాళికా ప్రక్రియను 11 వ పంచవర్ష ప్రణాళిక కాలంలో చేపట్టాలని ప్లానింగ్ కమీషన్ సూచించినప్పటికీ 18 రాష్ట్రాలలో మాత్రమే జిల్లా ప్రణాళికా కమిటీలు ఏర్పాటయ్యాయి. ఈ జిల్లా ప్రణాళికా కమిటీలను కార్యశీలతలోకి తీసుకొని రావటానికి కేంద్ర ప్రభుత్వ పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ చేస్తున్న కృషిలో భాగంగా దేశవ్యాప్తంగా 250 జిల్లాలను అభివృద్ధిలో వెనుకబడిన జిల్లాలుగా గుర్తించి, ఈ జిల్లాలలో జిల్లా అభివృద్ధి ప్రణాళికల తయారీకి ప్రత్యేకించి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి (బి.ఆర్.జి.ఎఫ్) ద్వారా నిబంధితం కాని నిధులను (అన్‌టైడ్ ఫండ్స్) కేటాయించి వికేంద్రీకృత ప్రణాళికల రచనా ప్రక్రియకు ప్లానింగు కమీషను ప్రయత్నాలను ప్రారంభించింది.**

హామీ పథకం, సర్వశిక్షా అభియాన్, మధ్యాహ్న భోజన పథకం, సమగ్ర శిశు అభివృద్ధి పథకం, జిల్లా నీరు, పారిశుద్ధ్య మిషన్, భారత నిర్మాణ్ వంటి పథకాల క్రింద జిల్లాకు విడుదల అయ్యే నిధుల వివరాలను ప్రణాళికల రూపకల్పనా సమయంలో జిల్లా ప్రణాళికా కమిటీ పరిగణనలోకి తీసుకోవాలి.

ఈ పథకాల క్రింద నిధుల కేటాయింపు వివరాలను ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని జిల్లాలకు తెలియపరచాలి. ఈ విధమైన సమాచారం ప్రస్తుతం జిల్లా స్థాయిలో డి.పి.సిలకు అందుబాటులో లేకపోవటం వల్ల ప్రణాళికల రూపకల్పనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కర్ణాటక, మధ్యప్రదేశ్, కేరళ వంటి రాష్ట్రాలలో జిల్లా స్థాయిలో అందుబాటులో ఉండే నిధులు వివరాలు ముందస్తుగానే తెలియపరిచే విధానం అమలులో ఉన్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకోవాల్సి ఉన్నది.

## జిల్లా ప్రణాళికా కమిటీకి పత్యేక సచివాలయం

జిల్లా ప్రణాళికా కమిటీలు ఏర్పడినప్పటికీ ప్రత్యేకమైన సచివాలయ ఏర్పాట్ల ద్వారా జిల్లాలో వీటికి ప్రత్యేకమయిన అస్థిత్వాన్ని కల్పించలేదు. జిల్లా ప్రణాళికా కమిటీ సమావేశాలు ప్రస్తుతం చాలా జిల్లాలలో జిల్లా పరిషత్తు సమావేశ మందిరాలలోనే నిర్వహించబడటం వల్ల ఈ జిల్లా ప్రణాళికా కమిటీ సమావేశాలకు, జిల్లా పరిషత్తు సమావేశాలకు తేడా లేకుండా పోతోంది. జిల్లా ప్రణాళికా అధికారి నేతృత్వంలోని గణాంక

సిబ్బందికి అదనంగా కొద్దిమంది ప్రణాళికా నిపుణులు, ఆర్థికవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, వ్యవసాయ సంబంధిత రంగాలకు సంబంధించిన శాస్త్రవేత్తలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిపుణులను చేర్చి జిల్లా ప్రణాళికా కమిటీకి ఒక ప్రత్యేక సచివాలయాన్ని ఏర్పాటు చేసినట్లయితే మంచి ప్రణాళికలను తయారుచేయవచ్చు. కేరళ, రాజస్థాన్, హర్యానా వంటి రాష్ట్రాలు ప్రత్యేక సచివాలయాలను ఏర్పాటు చేయగా , కర్ణాటకలో జిల్లా పరిషత్తు ముఖ్య కార్యనిర్వహణాధికారే జిల్లా ప్రణాళికా కమిటీ మెంబరు సెక్రటరీ కనుక జిల్లా పరిషత్తులోనే ముఖ్య ప్రణాళికా అధికారి పదవిని సృష్టించి ప్రణాళికా రచనను సులభతరం చేసింది. ఈ విధమయిన చర్యల వలన నాణ్యమైన ప్రణాళికలను తయారుచేయవచ్చు.

## జిల్లా స్థాయిలో ప్రణాళికా నిపుణుల అందుబాటు

ప్రణాళికా రచనకు అవసరమయిన సాంకేతిక మద్దతును జిల్లా ప్రణాళికా కమిటీకి అందచేయటానికి కావల్సిన ప్రణాళికా నిపుణుల కొరత జిల్లాస్థాయిలో తీవ్రంగా ఉన్నది. ప్రణాళికా నిపుణుల కొరతను తీర్చటానికి ప్రతి జిల్లా ప్రణాళికా కమిటీలో నలుగురు నిపుణులను నామినేట్ చేయటానికి డి.పి.సి చట్టం సావకాశం కల్పించినప్పటికీ, ఈ నలుగురు సభ్యులను నామినేట్ చేసే సమయంలో రాజకీయ ప్రాధాన్యతల వల్ల ప్రణాళికా నిపుణులకు బదులుగా రాజకీయ పార్టీల ప్రతినిధులు సభ్యులుగా నామినేట్ చేయబడుతున్నారు. దీనివల్ల జిల్లా ప్రణాళికా కమిటీకి అవసరమయిన సాంకేతిక మద్దతు అందకుండా పోతోంది. ప్రణాళికలంటే కొన్ని సిమెంటు–కాంక్రీటు పనుల సమాహారమేనన్న చందంగా పరిణమిస్తోంది. ప్రణాళికా కమిటీ సభ్యుల నియామకంలో ఆయా జిల్లాలకు అందుబాటులో ఉండే యూనివర్సిటీల నుండి, సామాజిక రంగంలో కృషి చేస్తున్న స్వచ్ఛంద సేవాసంస్థలలో ప్రణాళికా రచనపై అవగాహన కల్గినటువంటి వారికి ప్రభుత్వం అవకాశం కల్పించినట్లయితే ఈ కమిటీలు రూపొందించే ప్రణాళికలలో నాణ్యత మెరుగుపడి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు, మానవ అభివృద్ధి సూచికల మెరుగుదలకు తోడ్పడే ప్రణాళికల రూపకల్పనకు దోహదం చెయ్యవచ్చు. జిల్లా స్థాయిలో ప్రణాళికా రూపకల్పనకు జిల్లా ప్రణాళికా కమిటీలకు సహకరించేందుకు దేశ స్థాయిలో పేరెన్నికగన్న నాబార్డు, క్రీడా, యాక్షన్ ఫర్ ఫుడ్ ప్రొడక్షన్, మైరాడా, అగ్రికల్చర్ ఫైనాన్సు కార్పొరేషను, ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ వంటి సంస్థలను జిల్లాలో సాంకేతిక మద్దతు సంస్థలుగా బి.అర్.జి.ఎఫ్. నియామకం చేసినప్పటికీ , భవిష్యత్తు అవసరాల దృష్ట్యా జిల్లా స్థాయిలోనే ప్రణాళికా రచనా సామర్థ్యాలు కల్గిన ఒక శక్తివంతమంతమైన బృందాన్ని తయారు చేసుకొనవలసిన అవసరం ఉన్నది.

## వివిధ శాఖల ప్రణాళికల అనుసంధానం

జిల్లా స్థాయిలో వ్యవసాయం, వైద్య ఆరోగ్య, విద్య, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం ఎస్.సి/ఎస్.టి సంక్షేమం వంటి వివిధ శాఖల వారీగా ఆయా శాఖలు అమలు చేసే పథకాలననుసరించి వార్షిక ప్రణాళికలు లభ్యమవుతున్నప్పటికీ, ఈ ప్రణాళికలన్నింటినీ క్రోడీకరించి సమగ్రంగా తయారుచేసిన అభివృద్ధి ప్రణాళికలు జిల్లా స్థాయిలోనే ఒకచోట లభ్యం కావటంలేదు. సర్వశిక్షా అభియాన్, మధ్యాహ్న భోజన పథకం, సంపూర్ణ పారిశుధ్య ప్రచారం, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, సమగ్ర శిశు అభివృద్ధి పథకం, రాజీవ్‌గాంధీ గ్రామీణ విద్యుదీకరణ పథకం, ఉపాధి హామీ పథకం, జిల్లా సమగ్ర వ్యవసాయ ప్రణాళిక (సి.డి.ఎ.పి), నేషనల్ హార్టికల్చర్ మిషన్, వాటర్‌షెడ్ కార్యక్రమాలు, ఐ.ఎ.వై, భారత నిర్మాణ్ తదితర ఫ్లాగ్ షిప్ పథకాల క్రింద ప్రతీజిల్లాలో సుమారు 500700 రూపాయల నిధులు ఖర్చు అవుతున్నాయనేది ఒక అంచనా. ఈ పథకాల సమగ్ర సమాచారం ఒకచోట లభ్యం కాకపోవటం వల్ల సంతులిత అభివృద్ధి సాధన కష్టతరమవుతోంది.

ఒక శాఖలో తయారుచేయబడిన ప్రణాళికలతో మరొక శాఖ తయారుచేసిన ప్రణాళికలను అనుసంధానించకపోవటం వల్ల వివిధ పథకాల నుండి ఆశించిన ఫలితాలను పొందలేకపోవటం జరుగుతోంది. ఉదాహరణకు, పశుసంవర్ధక శాఖ జిల్లాలో పాల ఉత్పత్తి గణనీయంగా పెంచాలని ప్రణాళిక తయారు చేసుకుంటే మేలైన పశుపోషణకు అవసరమైన పశుగ్రాసాన్ని పొందటానికి వ్యవసాయ శాఖ ప్రణాళికలతోను, పశువుల దాణా అవసరాలు తీర్చుకొనటానికి పరిశ్రమల శాఖతోనూ, పాల

> **జిల్లా స్థాయిలో గణాంక సిబ్బందితో కూడిన ముఖ్య ప్రణాళికా అధికారి కార్యాలయాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినప్పటికీ ఈ యంత్రాంగం రాష్ట్ర స్థాయి ప్రణాళికల తయారీల ఉపయుక్తమయ్యే గణాంకాలను జిల్లాల నుండి సేకరించి ప్రభుత్వానికి అందచేయటానికి మాత్రమే పరిమితమైంది తప్ప ప్రణాళికలను తయారుచేసే స్థాయిని ఇంకా సంతరించుకోలేదు.**

ఉత్పత్తుల మార్కెటింగు కోసం మార్కెటింగు శాఖతోనూ, రవాణా సౌకర్యాల కొరకు రహదారులు–భవనాల శాఖతోను, రైతులకు పరపతి సౌకర్యాలకు బ్యాంకులతోను, సహకార సంఘాల ప్రణాళికల తోను తమ ప్రణాళికలను అనుసంధానించుకోవాలి. ఈ విధమైన ప్రక్రియను జిల్లా స్థాయిలో చేపట్టి ప్రణాళికా ప్రక్రియలో వివిధ శాఖలను అనుసంధానం చేసే బాధ్యతను ప్రణాళికా కమిటీలు చేపట్టవచ్చు. వివిధ శాఖల ప్రణాళికలలో ఈ విధమైన సమాంతర సంబంధాలు (హారిజాంటల్ లింకేజ్) ఏర్పడనంతవరకూ సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదు. సమాంతర సంబంధాలే గాక ఒకే శాఖలో వివిధ స్థాయిలలో పనిచేస్తున్న అధికారులు, సంస్థల మధ్య కూడా క్షితిజ సంబంధాలు (వర్టికల్ లింకేజ్) ఏర్పడేలా జిల్లా ప్రణాళికా కమిటీ చొరవ చూపాలి.

## జిల్లా ప్రణాళికా కమిటీ సమావేశాలు

జిల్లా ప్రణాళికా కమిటీలను చట్ట ప్రకారం ప్రతీ మూడు నెలలకొకసారైనా తప్పనిసరిగా సమావేశపర్చాలి. ఈ నిబంధన క్షేత్ర స్థాయిలో ఖచ్చితంగా పాటించటంలేదు. సమావేశాన్ని 90 రోజులలోపు నిర్వహించలేకపోతే, ఎవరిని బాధ్యులుగా చేయాలనే విషయంపై చట్టంలో స్పష్టత కొరవడింది. జిల్లా

పరిషత్తు/మండల పరిషత్తు సమావేశాలను 90 రోజులలోపు తప్పనిసరిగా నిర్వహించవలసిన బాధ్యత ముఖ్య కార్యనిర్వహణాధికారి/మండల పరిషత్తు అభివృద్ధి అధికారిపై ఉన్నది. నిర్ణీత సమయంలోపు సమావేశాన్ని నిర్వహించటంలో ముఖ్య కార్యనిర్వహణాధికారి/మండల పరిషత్తు అభివృద్ధి అధికారి విఫలమైనట్లయితే వీరిపై క్రమశిక్షణా చర్యలకు చట్టం నిర్దేశిస్తూండటం వల్ల సమావేశాలు ఖచ్చితంగా జరుగుతున్నాయి. జిల్లా ప్రణాళికా చట్టంలో కూడా ఈ నిబంధనలను చేర్చితే వ్యవస్థ బలోపేతం అవుతుంది.


## జిల్లా ప్రణాళికా ఉప కమిటీల పనితీరు

జిల్లా ప్రణాళికా చట్టాన్ని అనుసరించి జిల్లా ప్రణాళికల రూపకల్పన, అమలు, సమీక్ష మొదలైన విధులను తరచుగా నిర్వర్తించటానికి అనువుగా ప్రతీ జిల్లా ప్రణాళికా కమిటీ కొన్ని ఉప కమిటీలను ఏర్పర్చుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ 448 ఉత్తర్వు ద్వారా 1) మానవ వనరుల అభివృద్ధి 2) సహజవనరుల సంరక్షణ 3) మౌలిక సదుపాయాల కల్పన 4) ఉపాధికల్పన 5) సాంఘిక సంక్షేమం, కుటుంబ సంక్షేమం 6) ఘన వ్యర్థాల నిర్వహణకు రంగాలకు గాను 5 ఉపకమిటీల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. జిల్లా ప్రణాళికా కమిటీలు తమ సభ్యుల నుండి ఈ ఉపకమిటీలను ఏర్పాటు చేసుకొన్నప్పటికీ ఈ కమిటీలు అంతంత మాత్రంగానే పనిచేస్తున్నాయి. ఈ కమిటీల సమావేశాల నిర్వహణకు సంబంధించి సవిరమయిన మార్గనిర్దేశాలు లేనందున, ఏ కమిటీకి ఎవరు అధ్యక్షత వహించాలి, సమావేశాల తరచుదనం ఎంత, సమావేశాలను ఎక్కడ నిర్వహించాలి, ఎవరు నిర్వహించాలి, సమావేశపు నిర్ణయాలను ఎవరు అమలుపరచాలి వంటి సమస్యలను అధిగమించాల్సి ఉన్నది. ఈ ఉపకమిటీలు తరచుగా సమావేశమయ్యేటట్లుగా తగు చర్యలు తీసుకొనగల్గినట్లయితే జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల అమలుపై నిర్మాణాత్మక చర్చ జరగటానికి, ఆయా పథకాల అమలును మరింత సమర్థవంతంగా నిర్వహించటానికి అవకాశం ఉంటుంది.

## సాంకేతిక సలహా బృందాలు మెరుగుపడాలి

జిల్లా/మండల స్థాయిలో ప్రణాళికా రచనకు మార్గనిర్దేశం చేయటానికి, జిల్లా స్థాయిలో విజనింగు ప్రక్రియను సుగమం చేయటానికి జిల్లా స్థాయిలో కలక్టరు నేతృత్వంలోనూ, మండల స్థాయిలో ఎం.పి.డి.ఓ

**నిర్ణీత సమయంలోపు సమావేశాన్ని నిర్వహించటంలో ముఖ్య కార్యనిర్వహణాధికారి/మండల పరిషత్తు అభివృద్ధి అధికారి విఫలమైనట్లయితే వీరిపై క్రమశిక్షణా చర్యలకు చట్టం నిర్దేశిస్తూండటం వల్ల సమావేశాలు ఖచ్చితంగా జరుగుతున్నాయి. జిల్లా ప్రణాళికా చట్టంలో కూడా ఈ నిబంధనలను చేర్చితే వ్యవస్థ బలోపేతం అవుతుంది.**




సమన్వయాధికారిగా సాంకేతిక సలహా బృందాలను ఏర్పాటుచేశారు. కానీ ఈ సలహా బృందాలు వాస్తవానికి ఆశించిన రీతిలో సమావేశమై జిల్లా/మండలం బలాలు, బలహీనతలు, అవకాశాలు, అవరోధాల గూర్చి సమగ్ర నివేదికలు తయారు చేయటంలేదు. అభివృద్ధిలో జిల్లా వెనుకబాటు తనానికి గల మూల కారణాలను అన్వేషించటం, ఈ సమస్యలను అధిగమించటానికి ఏవిధమైన వ్యూహ రచన చేయాలన్న విషయాన్ని జిల్లా ప్రణాళికా కమిటీ/మండల పరిషత్తుకి ఈ సాంకేతిక సలహా బృందాలు అందచేయాలి. సాంకేతిక సలహా బృందాలకు కూడా ప్రణాళికా రచనపై మెరుగైన శిక్షణను అందచేయాలి.

## జిల్లా కలెక్టరు పాత్ర కీలకం

కేంద్రీకృత ప్రణాళికా రచనా విధానాన్నుండి వికేంద్రీకృత ప్రణాళికా రచనా దిశగా మారుతున్నటువంటి నేటి పరిస్థితులలో జిల్లా ప్రణాళికా కమిటీ సభ్య కార్యదర్శిగా జిల్లా కలక్టరు పాత్ర కీలకమైనది. జిల్లా ప్రణాళికా కమిటీని సమావేశపర్చటం, అధ్యక్షునితో సంప్రదించి అజెండాను రూపొందించడం, సమావేశాలను సజావుగా నిర్వహించటం వంటి బాధ్యతలు నిర్వహించాలి. జిల్లా ప్రణాళికలను సకాలంలో రూపొందేలా అధికార యంత్రాంగం మొత్తానికి దిశానిర్దేశం చెయ్యవలసిన బాధ్యత జిల్లా కలెక్టరుదే. జిల్లా విజను రూపకల్పనలో జిల్లాకు లక్ష్యాలను నిర్దేశించటంలో జిల్లా ప్రణాళికా కమిటీకి దిశానిర్దేశం చెయ్యవలసిన ప్రధాన బాధ్యత జిల్లా కలక్టర్లకు ఉన్నది. రాష్ట్రంలో జిల్లా ప్రణాళికా కమిటీలు ఏర్పడి సంవత్సరం కావస్తున్నప్పటికీ, ఈ కార్యక్రమాలను నిర్వహించడానికి జిల్లా కలక్టరుకు ప్రత్యేకమైన ప్రణాళికా సిబ్బందిని ప్రభుత్వం సమకూర్చలేదు. ప్రతి జిల్లాలో ముఖ్య ప్రణాళికా అధికారులున్నప్పటికీ వారందరూ వివిధ రకాల గణాంకాల సేకరణలో పూర్తిస్థాయిలో నిమగ్నమవుతున్నందున జిల్లా కలక్టరు జిల్లా పరిషత్తు ముఖ్య కార్యనిర్వహణాధికారిపై ఆధారపడక తప్పడంలేదు. జిల్లా పరిషత్తులు కేవలం గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే పరిమితమై ఉండటం, పట్టణ ప్రాంతాలలో అమలు అయ్యే పథకాలపై జిల్లా పరిషత్తు సిబ్బందికి అవగాహన లేకపోవటం, జిల్లా పరిషత్తుల్లో కూడా ప్రణాళికా నిపుణులు, గణాంక అధికారులు వంటి సాంకేతిక సిబ్బంది లేకపోవటం వల్ల ప్రస్తుతం తయారయ్యే ప్రణాళికలు కేవలం కొన్ని పనుల సమాహారంగానే ఉంటున్నాయి. కనుక జిల్లా ప్రణాళికా రచన కొరకు జిల్లా

కలక్టరుకు సహకరించేందుకు ఒక ప్రత్యేక బృందాన్ని ప్రభుత్వం వెంటనే ఏర్పాటుచేయాలి.

## జిల్లా ప్రణాళికా కమిటీల నిర్వహణా వ్యయం

జిల్లా ప్రణాళికా కమిటీ సమావేశాల నిర్వహణకు అయ్యే వ్యయం, ప్రణాళికల అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించటానికి అయ్యే వ్యయాలు, కమిటీ సమావేశాలకు సభ్యులు హాజరు అయినందుకు గౌరవ భృతి, ప్రణాళికా నిపుణుల సేవలను వినియోగించుకొన్నందుకు గాను వారికి చెల్లించవలసిన గౌరవభృతులు తదితర చిల్లర ఖర్చుల కొరకు జిల్లా ప్రణాళికా కమిటీలకు కొంత మొత్తాన్ని కేటాయించాల్సి ఉన్నది. కర్ణాటకలో ఈ తరహా నిర్వహణా వ్యయాల కొరకు గ్రామ పంచాయతీలు, తాలూకా పంచాయతీలు, మునిసిపాలిటీల నుండి ప్రతీ సంవత్సరం నిర్ణీత మొత్తంలో విరాళాలు స్వీకరించటానికి జిల్లా ప్రణాళికా కమిటీలకు అధికారం కల్పించారు.

## స్థానిక సంస్థలకు విధులు, నిధులు, సిబ్బంది బదలాయింపు

జిల్లా ప్రణాళికా రచనా ప్రణాళికా కమిటీ నిర్దేశించిన రీతిలో జరగాలంటే గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు ఆయా స్థాయిలలో ప్రణాళికా రచనను చేపట్టాలి. నిజానికి ప్రణాళికా వికేంద్రీకరణ, పరిపాలనా వికేంద్రీకరణ పరస్పర పూరకాలు. గ్రామ స్థాయిలో ప్రణాళికా రచన చేపట్టాలంటే నిధులను, విధులను, సిబ్బందిని పూర్తి స్థాయిలో స్థానిక సంస్థలకు వికేంద్రీకరించటమే కాక నిర్ణయాకరణలో స్వేచ్ఛని కూడా ఇవ్వాలి. బి.ఆర్.జి.ఎఫ్ వంటి నిబంధితం కాని నిధులను పెద్ద మొత్తాలలో పంచాయతీరాజ్ సంస్థలకు, నగర పాలక సంస్థలకు విడుదల చేయాలి.

> **కేంద్రీకృత ప్రణాళికా రచనా విధానాన్నుండి వికేంద్రీకృత ప్రణాళికా రచనా దిశగా మారుతున్నటు వంటి నేటి పరిస్థితులలో జిల్లా ప్రణాళికా కమిటీ సభ్య కార్యదర్శిగా జిల్లా కలక్టరు పాత్ర కీలకమైనది.**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ఈ దిశగా చర్యలు చేపట్టి, వ్యవసాయం, విద్య, వైద్య, ఆరోగ్య, గ్రామీణాభివృద్ధి, త్రాగునీరు, వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాంఘిక సంక్షేమం, మహిళా శిశుసంక్షేమం, పశుసంవర్ధన, ఫిషరీస్ 10 కీలకశాఖలలో అధికారాలను, కొంత మేరకు నిధులను పంచాయతీరాజ్ సంస్థలకు బదలాయించుతూ అక్టోబరు 2007 -నవంబరు 2008ల మధ్య ఉత్తర్వులు వెలువరించింది.

ఈ ఉత్తర్వుల ప్రకారం 10 శాఖలకు సంబంధించిన ప్రణాళికలను గ్రామ పంచాయతీ/మండల పరిషత్తు/ జిల్లా పరిషత్తులు ఆమోదించాలి. జిల్లా ప్రణాళికా మార్గదర్శకాలు సైతం ప్రణాళికలు సంబంధిత స్థాయిలోని పంచాయతీరాజ్ సంస్థ ఆమోదం పొందాలన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అధికారాల బదలాయింపు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి చేసే ప్రజా ప్రతినిధులు కూడా తమకు బదలాయించిన అధికారాలను, విధుల ను క్షేత్రస్థాయిలో వినియోగించుకోకపోతే, ఈ ఉత్తర్వులు కేవలం కాగితాల కే పరిమితమైపోయే అవకాశం ఉంటుంది. అలాగే ప్రభుత్వం కూడా నిధులు, విధులు బదలాయించినప్పటికీ, ఈ పది శాఖల సిబ్బందిని కూడా కాలానుగుణంగా పంచాయతీరాజ్ సంస్థల పరిధిలోనికి తీసుకొని రావటానికి చర్యలు చేపట్టాల్సి ఉంది. సిబ్బందిపై ప్రత్యక్ష పర్యవేక్షణ లేనంతవరకూ పంచాయతీ రాజ్ సంస్థలు తమకు కేటాయించిన విధులను పూర్తిస్థాయిలో నిర్వర్తించలేకపోవచ్చు.

## జిల్లా ప్రణాళికా కమిటీలో గ్రామ / మండల స్థాయి ప్రజా ప్రతినిధులకు స్థానం లేకపోవటం

రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 జడ్.డి. ననుసరించి జిల్లా ప్రణాళికా కమిటీలోని 80 శాతం సభ్యులను జిల్లాలోని జిల్లా ప్రజా పరిషత్తు సభ్యులు మరియు పురపాలక సంఘాలలోని సభ్యుల నుండి మాత్రమే ఎన్నుకోవాలి. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలలోని జనాభా నిష్పత్తి దామాషా ప్రకారం జిల్లా ప్రణాళికా కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. మిగిలిన 20 శాతం మంది సభ్యులను ప్రణాళికా నిపుణులతో నామినేషను పద్ధతిపై ప్రభుత్వ భర్తీ చేయాలి. ఈ విధమైన ఎన్నిక విధానం వల్ల గ్రామ / మండల స్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులకు జిల్లా ప్రణాళికా కమిటీలో ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని కోల్పోయారు. గ్రామ పంచాయతీ సర్పంచులు, మండల పరిషత్తు సభ్యుల నుండి తమకు కూడా జిల్లా ప్రణాళికా కమిటీలో అవకాశం కల్పించాలని కోరుతున్నారు. కానీ ఈ సమస్య రాజ్యాంగ నిబంధనల పరంగా తలెత్తినందున రాజ్యాంగ సవరణ జరిగే వరకు గ్రామ / మండల స్థాయి ప్రజాప్రతినిధులతో జిల్లా ప్రణాళికా కమిటీ కొన్ని ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి ప్రణాళికా రచన, అమలు, మదింపులో వారికి ఎదురవుతున్న సమస్యలను కూడా పరి ష్కరించేందుకు చొరవ చూపాలి.

## రాష్ట్ర ప్రణాళికలో పంచాయతీ విండో

పంచాయతీ రాజ్ సంస్థల ద్వారా సూక్ష్మ స్థాయి అభివృద్ధి ప్రణాళికల తయారీకి ప్రజా భాగస్వామ్య పద్ధతిలో స్థానిక అవసరాల గుర్తింపు ఒక ఎత్తయితే ఈ అవసరాలను తీర్చటానికి నిధుల సమీకరణ అనేది మరింత కీలకమయినది. అయితే మన రాష్ట్రంలోని పంచాయతీ రాజ్ సంస్థలకు సొంత ఆదాయ వనరులు బహుస్వల్పం కాగా, ఈ సంస్థలన్నీ ప్రభుత్వ కేటాయింపులపైననే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. రాష్ట్ర ఆడిట్ శాఖ వద్దనున్న సమాచారం ప్రకారం పంచాయతీ రాజ్ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో కేటాయింపులు 1997-98 సం.లో 23.9 శాతం ఉండగా 2004-05 లో 12.5 శాతం మాత్రమే ఉన్నాయి. అంటే ఈ కేటాయింపులు కూడా రాను రానూ తగ్గుతున్నాయన్న విషయం అర్థం చేసుకోవాలి.

గ్రామ పంచాయతీల పరిధి చిన్నది కావటం, ఎక్కువ సంఖ్యలో గ్రామ పంచాయతీలు ఉండటం, గ్రామ పంచాయతీలకు మినహా మండల, జిల్లా పరిషత్తులకు పన్నులు వేసే అధికారం లేకపోవటం వంటి కారణాల వల్ల కూడా పంచాయతీ రాజ్ సంస్థలు నిధుల కోసం ప్రభుత్వ గ్రాంట్లపై ఆధారపడాల్సి వస్తుంది. పైగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం 1994 ద్వారా దఖలు పరచబడిన అధికారాలను అనుసరించి గ్రామపంచాయతీలు చట్ట ప్రకారం వసూలు చేయవల్సిన పన్నులను కూడా సంతృప్తికర రీతిలో వసూలు చేయలేకపోవటం నిధుల లేమికి మరొక్క కారణం.

ప్రాధాన్యీకరించిన స్థానిక అవసరాల ప్రాతిపదికన ప్రణాళికల తయారీ కొరకు అవసరమైన నిధులను స్థానిక సంస్థలకు సమకూర్చుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్టులో శాఖల వారీగా పంచాయతీరాజ్ విండోను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లయితే నిధుల సమీకరణలోని లోటును భర్తీ చేయవచ్చును. ఈ విధానం ఇప్పటికే కేరళ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో అమలులో ఉన్నది. కేరళ రాష్ట్రంలో రాష్ట్ర బడ్జెట్‌లో సుమారు 30 శాతం నిధులను, కర్ణాటక రాష్ట్రంలో సుమారు 40 శాతం నిధులను పంచాయితీ రాజ్ సంస్థలకు కేటాయిస్తున్నారు. ఈ విధానాన్ని మన రాష్ట్రంలో కూడా అమలు చేసినట్లయితే స్థానిక సమస్యల సాధనకు ఎల్లవేళలా ప్రభుత్వం వైపు చూడనవసరం ఉండదు.

## సమాంతర వ్యవస్థలు

జిల్లా ప్రణాళికా కమిటీ చట్టాన్ననుసరించి జిల్లా అభివృద్ధి ప్రణాళికా రూపకల్పనతో పాటుగా, మొత్తం జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు, నగర పంచాయతీలు, మునిసిపాలిటీల ప్రణాళికలు సకాలంలో తమ ప్రణాళికలను రూపొందించుకొనేలా చూడవల్సిన బాధ్యత జిల్లా ప్రణాళికా కమిటీలపై ఉన్నది. జిల్లాలో అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులను దృష్టిలో ఉంచుకొని రూపొందించుకొన్న అభివృద్ధి ప్రణాళికల అమలును, నిర్దేశించుకొన్న భౌతిక, ఆర్థిక లక్ష్యాలను ఏమేరకు సాధించామన్న సమీక్షను కూడా జిల్లా ప్రణాళికా కమిటీలు నిర్వహించవల్సి ఉన్నది.

ఐతే ప్రస్తుతం జిల్లాలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అధ్యక్షతన పనిచేసే జిల్లా సమీక్షా కమిటీ (డి.ఆర్.సి) పార్లమెంటు సభ్యుని అధ్యక్షతన నిర్వహించబడే జిల్లా విజిలెన్సు, మానిటరింగు కమిటీ (డి.వి.ఎం.సి)లు వివిధ పథకాల క్రింద సాధించిన ప్రగతిని సమీక్షించటానికి ఏర్పాటు చేసినప్పటికీ, ఈ కమిటీలు తరచుగా సమావేశం కాకపోవటం, ఈ కమిటీలకు రాజకీయ ప్రాధాన్యత ఏర్పడటం వల్ల ప్రజా సమస్యలను చర్చించి తగు నిర్ణయాలను తీసుకొనటానికి వేదికగా ఉపయోగపడటంలేదు. కానీ ఈ డి.ఆర్.సి, డి.వి.ఎం.సిలకు ప్రభుత్వంలో ఉన్నత పదవులు నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు అధ్యక్షత వహిస్తుండటంతో జిల్లా ప్రణాళికా కమిటీ సమావేశాలకన్న ఈ రెండు కమిటీల సమావేశాలకే అధికారులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.

రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన జిల్లా ప్రణాళికా కమిటీలు ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా పనిచేస్తున్న డి.ఆర్.సి, డి.వి.ఎం.సి. ల వంటి ఇతర సమాంతర కమిటీల వల్ల తమ అస్థిత్వాన్ని చాటుకోలేక పోతున్నాయి. జిల్లా ప్రణాళికా కమిటీ సమావేశాలు నిర్వహించుకోవటానికి జిల్లా ప్రణాళికా కమిటీ అధ్యక్షుని అనుమతి సరిపోయినప్పటికీ, జిల్లా మంత్రివర్యుల అనుమతి కోసం ఎదురు చూస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లా ప్రణాళికా కమిటీ చట్టం అమలులోకి తీసుకొని వచ్చే సమయంలో ప్రభుత్వ స్థాయిలో జిల్లా ప్రణాళికా కమిటీకి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని అధ్యక్షునిగా చేయాలని ప్రభుత్వ భావించినప్పటికీ ఈ చర్య 74వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి విఘాతం కల్గిస్తున్నదనే ఉద్దేశ్యంతో చివరికి ఆంధ్రప్రదేశ్ జిల్లా ప్రణాళికా కమిటీ చట్టం 2005 ద్వారా జిల్లా పరిషత్తు ఛైర్మన్ జిల్లా ప్రణాళికా కమిటి అధ్యక్షునిగా ప్రకటించడం జరిగింది.

**ఆర్థిక సంస్కరణల అనంతర పరిస్థితులలో రాష్ట్ర ఆర్థికవృద్ధి గణనీయమైన రీతిలో పెరిగి రాష్ట్ర వార్షిక బడ్జెట్టు లక్ష కోట్లు చేరుకున్న ప్రస్తుత పరిస్థితులలో ప్రణాళికా బోర్డు ఇచ్చే సలహాలు, సూచనలకు విలువ పెరుగుతోంది. అంతేగాక ప్రస్తుత తరుణంలో జిల్లా స్థాయిలో కూడా జిల్లా ప్రణాళికా కమిటీలు ఏర్పడినందున రాష్ట్ర, ప్రాంతీయ, జిల్లా ప్రణాళికా కమిటీల మధ్య వ్యవస్థాగత సంబంధాలను ఏర్పరచి ఒకదానితో మరొకటి సమన్వయంతో వ్యవహరించుకుంటూ అట్టడుగు స్థాయి నుండి ప్రణాళికల రూపకల్పనకు ఈ సంస్థలన్నీ కృషి చేసే విధంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.**

స్థానిక ప్రభుత్వ భావనను బలపరుస్తూ జిల్లా స్థాయిలోనే ప్రణాళికా రచనకు జిల్లా పరిషత్తు అధ్యక్షునినే జిల్లా ప్రణాళికా కమిటీకి పదవిరీత్యా అధ్యక్షునిగా ప్రకటిస్తూ ప్రగతిశీల చర్యను చేపట్టిన ప్రభుత్వం ఈ సమాంతర వ్యవస్థల వల్ల రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగే అవకాశం ఉన్నందున ఈ సమాంతర వ్యవస్థల ప్రాధాన్యతలను కాలానుగుణంగా తగ్గించటమో లేక ఇట్టి సంస్థలను రద్దు చేయటమో చెయ్యాలి.

## రాష్ట్ర ప్రణాళికా సంఘం / ప్రాంతీయ ప్రణాళికా బోర్డులు

రాష్ట్ర స్థాయిలో ప్రణాళికా రచనకు గాను ముఖ్యమంత్రి, ఇతర మంత్రులతో పాటు మరికొంతమంది నిపుణులతో రాష్ట్ర ప్రణాళికా బోర్డును 1974 వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రణాళికల స్థూల ధ్యేయాలను ఈ బోర్డు రూపొందించటమే కాక ప్రణాళికా రచనలో ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందచేస్తుంది. ప్రణాళికల అమలు కూడా పర్యవేక్షిస్తుంది. కానీ ఆచరణలో మాత్రం రాష్ట్ర పంచవర్ష ప్రణాళికల ఆమోదానికి మాత్రమే పరిమితమైపోయింది. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధిని పరచాలనే ఉద్దేశ్యంతో 1974 సంవత్సరంలో ఆంధ్రా, రాయలసీమ, కోస్తా ప్రాంతాలకు గాను 3 ప్రాంతీయ ప్లానింగు బోర్డులను ఏర్పాటుచేసింది. ఈ బోర్డులు 1974-79 సంవత్సరాల మధ్యకాలంలో బాగానే పనిచేసినప్పటికీ, తదనంతర పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వం నుండి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కొరకు ప్రత్యేక నిధులు విడుదల కానందున కార్యశీలతను ప్రదర్శించలేకపోయాయి. అందువల్ల ఈ సంఘాలను 1983లో ప్రభుత్వం రద్దుపరుస్తూ, అన్ని అభివృద్ధి అంశాలలో ప్రభుత్వానికి సలహాలు సూచనలు చేయటానికి ముఖ్యమంత్రి అధ్యక్షునిగా, ఆర్థిక ప్రణాళికా శాఖకు చెందిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సభ్య కార్యదర్శిగానూ రాష్ట్ర అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేశారు.

ఈ బోర్డు రాష్ట్ర ప్రణాళికా రచనలోను, జిల్లా స్థాయిలో ప్రణాళికా రచనకు వ్యవస్థాగత ఏర్పాట్లను చేయటంలోనూ ప్రశంసనీయమైన సేవలను అందచేసినదని చెప్పవచ్చు. ఐతే కాలక్రమేణా ఈ బోర్డు కూడా కార్యశీలతను కోల్పోయిందనే చెప్పవచ్చును. మరల రాష్ట్ర స్థాయిలోని ప్రణాళికా బోర్డును చేతనావస్థలోనికి తీసుకొనిరావటానికి ప్రభుత్వం 2004లో మరల చర్యలు

చేపట్టి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఆర్థిక రంగంలోని నిపుణుని ఉపాధ్యక్షునిగా నియామకం చేస్తూ, వివిధ సామాజిక, ఆర్థిక పరిపాలనా రంగాలలో నిపుణులతో రాష్ట్ర ప్రణాళికా బోర్డును ఏర్పాటు చేసింది. అంతేగాక వేర్పాటు వాదం, రాష్ట్ర విభజన వంటి సమస్యలను ఎదుర్కోవటానికి, వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి పరచటం, అన్ని ప్రాంతాల సంతులిత అభివృద్ధికి సలహాలు, సూచనలు అందచేయటానికి గాను 1) తెలంగాణా 2) రాయల సీమ 3) దక్షిణ కోస్తా ఆంధ్ర 4) ఉత్తర కోస్తాంధ్ర ప్రాంతాలకు గాను నాలుగు ప్రాంతీయ ప్రణాళిక మరియు అభివృద్ధి బోర్డులను 2007 సంవత్సరంలో ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ఈ ప్రాంతీయ బోర్డులలో తెలంగాణా బోర్డు తప్ప మిగిలిన బోర్డులు ఇంకా పూర్తిస్థాయిలో పనిచేయటం మొదలుకాలేదు.

ఆర్థిక సంస్కరణల అనంతర పరిస్థితులలో రాష్ట్ర ఆర్థికవృద్ధి గణనీయమైన రీతిలో పెరిగి రాష్ట్ర వార్షిక బడ్జెట్టు లక్ష కోట్లు చేరుకున్న ప్రస్తుత పరిస్థితులలో ప్రణాళికా బోర్డు ఇచ్చే సలహాలు, సూచనలకు విలువ పెరుగుతోంది. అంతేగాక ప్రస్తుత తరుణంలో జిల్లా స్థాయిలో కూడా జిల్లా ప్రణాళికా కమిటీలు ఏర్పడినందున రాష్ట్ర, ప్రాంతీయ, జిల్లా ప్రణాళికా కమిటీల మధ్య వ్యవస్థాగత సంబంధాలను ఏర్పరచి ఒకదానితో మరొకటి సమన్వయంతో వ్యవహరించుకొంటూ అట్టడుగు స్థాయి నుండి ప్రణాళికల రూపకల్పనకు ఈ సంస్థలన్నీ కృషి చేసే విధంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. జిల్లా ప్రణాళికా కమిటీకి రాష్ట్ర ప్లానింగు బోర్డు, ప్రాంతీయ ప్రణాళిక, అభివృద్ధి బోర్డుల అధ్యక్షులకు ప్రత్యేక శాశ్వత ఆహ్వానితులుగా హోదా కల్పించాల్సి ఉంటుంది.

## రాష్ట్ర ప్రణాళిక, ఆర్థికశాఖల పాత్ర

జిల్లా ప్రణాళికా రూపకల్పన సజావుగా జరగాలంటే రాష్ట్ర స్థాయిలో ప్రణాళికా విభాగం, ఆర్థిక శాఖలు జిల్లా యంత్రాంగాలకు ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేయటం, రాష్ట్ర స్థాయిలో అందుబాటులో ఉన్న సమాచారాన్ని జిల్లాలకు ఎప్పటికప్పుడు లభ్యమయ్యేటట్లు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న ప్రణాళికా రచనా ప్రక్రియను పంచాయతీ రాజ్ శాఖ మాత్రమే సమన్వయ పరుస్తోంది. ప్రణాళికా రూపకల్పనా మార్గనిర్దేశాలు (ప్రభుత్వ ఉత్తర్వులు, పంచాయతీరాజ్ శాఖ నం. 354, 448, 449, 450 మరియు 142) అన్నీ కూడా కేవలం పంచాయతీరాజ్ శాఖ జారీచేయటంతో ఇతర శాఖల అధికారులు జిల్లా స్థాయిలో ఈ ఆదేశాల ప్రకారం నడుచుకోవటానికి సంసిద్ధత చూపటంలేదు. జిల్లా ప్రణాళికల రూపకల్పన, జిల్లా ప్రణాళికా కమిటీలను పరిపుష్టి చేయటం ఒక్క పంచాయతీరాజ్ శాఖదేనన్న భావన సర్వత్రా నెలకొని ఉన్నది.

**జిల్లా ప్రణాళికల రూపకల్పనను 2007-08 ఆర్థిక సంవత్సరంలో కేవలం బి.ఆర్.జి.ఎఫ్ నిధులు పొందటానికి 13 జిల్లాలో ప్రారంభించినప్పటికీ, ఆగష్టు 2006లో ప్లానింగు కమీషను జారీచేసిన మార్గదర్శక నియమాల ప్రకారం అన్ని జిల్లాలోనూ ఈ ప్రక్రియ ప్రారంభం కావలసి ఉన్నది. కానీ 2008-09 ఆర్థిక సంవత్సరంలో కూడా ఈ ప్రక్రియ 13 జిల్లాలకే పరిమితం అయ్యిందని చెప్పవచ్చు. అన్ని జిల్లాలలో జిల్లా ప్రణాళికా ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షించటానికి బి.ఆర్.జి.ఎఫ్ ఉన్నత కమిటీ తరహాలో రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన, వివిధ శాఖాధిపతులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పరచవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.**

రాష్ట్ర ప్రణాళికలో జిల్లా ప్రణాళికలు అంతర్భాగమయ్యే వివిధ శాఖలకు ప్రభుత్వమే తగు సూచనలు జారీచేస్తే తప్ప పరిస్థితులు గాడినపడే అవకాశం కానరావటం లేదు. జిల్లా ప్రణాళికల రూపకల్పనను 2007-08 ఆర్థిక సంవత్సరంలో కేవలం బి.ఆర్.జి.ఎఫ్ నిధులు పొందటానికి 13 జిల్లాలో ప్రారంభించినప్పటికీ, ఆగష్టు 2006లో ప్లానింగు కమీషను జారీచేసిన మార్గదర్శక నియమాల ప్రకారం అన్ని జిల్లాలోనూ ఈ ప్రక్రియ ప్రారంభం కావలసి ఉన్నది. కానీ 2008-09 ఆర్థిక సంవత్సరంలో కూడా ఈ ప్రక్రియ 13 జిల్లాలకే పరిమితం అయ్యిందని చెప్పవచ్చు. అన్ని జిల్లాలలో జిల్లా ప్రణాళికా ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షించటానికి బి.ఆర్.జి.ఎఫ్ ఉన్నత కమిటీ తరహాలో రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన, వివిధ శాఖాధిపతులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పరచవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

## ప్రణాళికా క్యాలండర్

ప్లానింగ్ కమీషన్ మార్గదర్శక నియమాల ప్రకారం 11వ పంచవర్ష ప్రణాళికా కాలంలో జిల్లా ప్రణాళికా ప్రక్రియను ప్రజా భాగస్వామ్య పద్ధతిలో చేపట్టాలి. 11వ పంచవర్ష ప్రణాళికా డాక్యుమెంటుననురించి జిల్లా ప్రణాళికా రచన అన్ని జిల్లాలలో తప్పనిసరి గనుక పంచవర్ష ప్రణాళికా అవధిలో తయారు చేసే వార్షిక ప్రణాళికల రూపకల్పనలో భాగంగా జిల్లాప్రణాళికలు రూపొందించటానికి కర్ణాటక రాష్ట్రం తరహాలో ప్రణాళికా క్యాలండర్‌ను రాష్ట్ర స్థాయిలో రూపొందించాలి. ఈ నిర్ణీత కాలవ్యవధిలో అన్ని జిల్లా ప్రణాళికా కమిటీలు తమ జిల్లా ప్రణాళికలను ప్రజా భాగస్వామ్యంతో రూపొందించేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి. జిల్లా విజను రూపకల్పన మొదలుకొని ప్రజల అవసరాలను గ్రామ సభలలో గుర్తించటం, ప్రాధాన్యీకరించటం, ప్రాధాన్యీకరించిన అవసరాలకు అందుబాటులో ఉన్న నిధులను జోడించటం, ప్రణాళికలకుగ్రామ పంచాయతీ/మండల పరిషత్తు/మునిసిపాలిటీలలో ఆమోదం పొందటం, జిల్లా ప్రణాళికా కమిటీలో చర్చించి ఆమోదించటం వంటి కార్యకలాపాలకు రాష్ట్ర స్థాయిలో స్థిరమైన క్యాలండర్‌ను రూపొందించాలి.

## పట్టణ ప్రాంతాల ప్రణాళికలు


గ్రామీణ ప్రాంతాలలో ప్రణాళికలను రూపొందించిన పద్ధతిలోనే పట్టణ ప్రాంతాలలో కూడా భాగస్వామ్య పద్ధతిలో వార్డు సభల నిర్వహణల ద్వారా ప్రజావసరాలను గుర్తించటం, ప్రాధాన్యీకరించటం, ప్రణాళికలను మునిసిపాలిటీలలో ఆమోదించి జిల్లా ప్రణాళికా కమిటీకి సమర్పించటం వంటి ప్రక్రియలను చేపట్టాలి. మునిసిపాలిటీల ప్రణాళికలను

రూపొందించటానికి మునిసిపల్ పరిపాలనా శాఖ కూడా మార్గ నిర్దేశకాలను ఇంకా పూర్తిస్థాయిలో జారీ చేయవలసి ఉన్నది. గ్రామీణ పట్టణ ప్రాంతాల మధ్య ఫార్వార్డు, బ్యాక్‌వార్డ్ లింకేజిలతో కూడిన ప్రణాళికల రూపకల్పనకు ఇప్పటి వరకూ లేని వ్యవస్థాగత ఏర్పాటు కూడా డి.పి.సి.ల ద్వారా కల్గిందని చెప్పవచ్చు. 1951 సంవత్సరంలో రాష్ట్ర జనాభాలో 17.42 శాతంగా ఉన్న పట్టణ ప్రాంత జనాభా 2001 నాటికి 27.08 శాతానికి పెరిగింది. పట్టణ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మారి పోవటం, పల్లెలు పట్టణాలుగా రూపాంతరం చెందటం వల్ల వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరిస్తునాయి. పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో గ్రామీణ-పట్టణ ప్రాంతాలలో తలెత్తే వ్యర్థపదార్థాల నిర్వహణ, త్రాగునీటి సరఫరా, డ్రైనేజ్ వ్యవస్థల నిర్వహణ, కోల్డ్ స్టోరేజ్, మార్కెటింగు సదుపాయాలు, విద్య, వైద్యం, ఉపాధికల్పన వంటి సమస్యలను పరిష్కరించుకోవటానికి, సమగ్రమైన స్పేషియల్ ప్రణాళికలు రూపొందించటానికి జిల్లా ప్రణాళికా కమిటీని ఒక చక్కని వేదికగా మలచవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

## జిల్లా ప్రణాళికా కమిటీల సామర్థ్యాల పెంపుదల

ఈ విషయాన్ని చివరన చర్చించినా అత్యంత ప్రధానమైన అంశంగా పరిగణించాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా ప్రణాళికా కమిటీలు ఏర్పడి దాదాపు సంవత్సరం కావస్తున్నా జిల్లాలో తమదైన ముద్ర వేయలేక పోయాయనే చెప్పవచ్చు. సభ్యులు జిల్లా ప్రణాళికా కమిటీ సమావేశాలను, జిల్లా పరిషత్తు సమావేశాలకు భిన్నంగా పరిగణించటం లేదంటే అతిశయోక్తి గాదు. జిల్లా పరిషత్తు ఉండగా జిల్లా ప్రణాళికా కమిటీలు ఎందుకు అన్న సందేహాలు కూడా సభ్యులు లేవనెత్తుతున్నారు. జిల్లా ప్రణాళికా కమిటి సమావేశాలను తూతూ మంత్రంగా జిల్లాపరిషత్తు సమావేశాల రోజునే ఒక గంట లేదా అంతకంటే తక్కువ సేపు నిర్వహించటం కూడా జరుగుతోంది. జిల్లా ప్రణాళికా రచనా ప్రక్రియను కొంతవరకూ బి.ఆర్.జి.ఎఫ్ కార్యక్రమం అమలులో ఉన్న 13 జిల్లాలలోని డి.పి.సిలు మాత్రమే చేపట్టాయి. మిగిలిన 9 జిల్లాల్లో డి.పి.సి.లు జిల్లాప్రణాళికా రచనపై దృష్టి సారించవలసి ఉంది. బి.ఆర్.జి.ఎఫ్. జిల్లాలలోని జిల్లా ప్రణాళికా కమిటీ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ ఇప్పటికే ఒక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. కానీ బి.ఆర్.జి.ఎఫ్ కార్యక్రమం అమలులోలేని 9 జిల్లాలలోని జిల్లా ప్రణాళికా కమిటీ సభ్యులకు తమ బాధ్యతలు, విధులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్గించవలసిన అవసరం ఉన్నది.

జిల్లా ప్రణాళికా కమిటీ సభ్యులు జిల్లాలో జరుగుతున్న సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించాలంటే వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యాలపై, ప్రణాళికల ఆవశ్యకతపై పూర్తిస్థాయి అవగాహన కల్పించే శిక్షణను నిరంతర ప్రాతిపదికన అందచేయాలి. అంతేగాక డి.పి.సి సమావేశాలను ఒక నిర్మాణాత్మక వేదికగా మలచుకొని వివిధ సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలను వెతికే సాధనంగా మలచుకోవటానికి అవసరమైన శిక్షణను సభ్యులకు అందచేయాలి. అదేవిధంగా అధికార సిబ్బందికి కూడా ప్రజాప్రతినిధులతో కలసి సమన్వయంగా పనిచేయటం, తమ శాఖల అభివృద్ధి లక్ష్యాలను




సాధించటంలో ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యులను చేయటంపై తగు శిక్షణ అందచేయాలి.

1992 సం.లో చేయబడిన భారత రాజ్యాంగపు 74 వ సవరణలోని ఆర్టికల్ 243 జడ్.డి. ననుసరించి జిల్లా ప్రణాళికా కమిటీలను అన్ని జిల్లాలలో ఏర్పాటు చేయవలసినదిగా సూచించినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ 2008 జనవరి వరకూ ఈ కమిటీలను ఏర్పరచలేదు. జిల్లా ప్రణాళికా కమిటీలు ఏర్పడి సంవత్సరం కావస్తున్నా వీటి పనితీరు ఆశాజనకంగా లేదు. 11 వ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఆశిస్తున్న సమ్మిళిత అభివృద్ధి సాధించాలంటే వికేంద్రీకృత ప్రణాళికల తయారీ అనివార్యం. జిల్లాలో అందుబాటులో ఉన్న మానవ వనరులు, సహజవనరులు, ఆర్థిక వనరుల ను అభిలషనీయమైన స్థాయిలో వినియోగించుకొనటానికి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చటానికి జిల్లా ప్రణాళికలు ఎంతగానో ఉపయోగపడతాయి.

జిల్లా ప్రణాళికా కమిటీల ద్వారా ప్రజాభాగస్వామ్యంతో ప్రణాళికల రూపకల్పన జరగాలంటే పైన చర్చించిన అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి. పంచాయతీ రాజ్/నగర పాలక సంస్థలలో పూర్తిస్థాయిలో అధికార వికేంద్రీకరణను జరపాలి. జిల్లా ప్రణాళికా కమిటీలకు జిల్లాలో ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తూ తగిన మంత్రిత్వ సిబ్బందిని, ప్రణాళికా నిపుణుల ను అందుబాటులో ఉంచి పరిపుష్టి చెయ్యాలి. వివిధ పథకాల క్రింద జిల్లాకు విడుదల అయ్యే నిధుల వివరాలను ముందస్తుగానే జిల్లా ప్రణాళికా కమిటీలకు, స్థానిక సంస్థలకు అందచేసేందుకు గాను ప్రణాళికా/ఆర్థిక శాఖలు తగు చర్యలు తీసుకోవాలి. జిల్లా ప్రణాళికా రచనకు పెద్దమొత్తంలో నిబంధితం కాని నిధులను అందుబాటులో ఉంచాలి.

జిల్లా ప్రణాళికా రచనా ప్రక్రియను బి.ఆర్.జి.ఎఫ్ కార్యక్రమం అమలులోలేని 9 జిల్లాలలోని జిల్లా ప్రణాళికా కమిటీలచే ప్రారంభింప చేయాలి. పంచాయతీ రాజ్ సంస్థల ప్రజాప్రతినిధులకు, అధికారులకు ప్రణాళికా రచనలో సామర్థ్యాల పెంపుదలకు నిరంతర ప్రాతిపదికన శిక్షణ అందచేయాలి. రాష్ట్ర ప్రణాళికా బోర్డు, ప్రాంతీయ ప్రణాళిక, అభివృద్ధి బోర్డుల మధ్య వ్యవస్థాగత సంబంధాలు పెంపొందించాలి. ఈ చర్యలు చేపట్టినట్లయితే ఆశించిన సమ్మిళిత అభివృద్ధి లక్ష్యాలను త్వరితగితన సాధించటానికి జిల్లా ప్రణాళికా కమిటీలు ఒక మంచి సాధనంగా ఉపయోగపడుతాయి.

*– డా॥ వి. శివశంకర్ ప్రసాద్, జూనియర్ ఫ్యాకల్టీ, అపార్డ్*



# తెల్ల గుర్రం

-డా॥ వి.ఆర్. రాసాని

**"పెండ్లికి యిద్దరూ కచ్చితంగా రావాలబ్బా.**
**మంగళరం గురిదేవర. బుదోరం పక్కాకు**
**శాస్త్రం, గురోరం పెండ్లి"**
**చిన్నోడి పెండ్లి వారముండాదనంగా**
**మాయన్నా వదినా,**
**మా యించికొచ్చి, ఆకూ వక్కా యిచ్చి, మా**
**ఆవిడ ముఖాన బొట్టుబెట్టి మరీ పిలిచారు.**

ఇంట్లో ఎందరు మగపిల్లలున్నా, పెద్ద కొడుక్కిగానీ, లేదా చిన్న కొడుక్కి గానీ, పెండ్లికి ముందు గురివి దేవర చేసే ఆచారం చాలా శూద్రకులాల్లో వుంది.

ఆ రోజు తెల్లవారితే గురివిదేవర.

మంగళవారం మధ్యాహ్నమే నేను భార్యా బిడ్డల్తో బయలుదేరి, పొద్దుగుంకే లోపే ఊరు చేరుకున్నాను. అప్పటికే చుట్టాలందరూ వచ్చేసి వున్నారు.

ఇంటి ముందర టెంకాయకీతుల్తో, నేరేడు మండల్తో పచ్చటి పందిరి వేసి వుంది. ఆ పందిరికీ, ఇంటి ద్వార బంధాలకు మామిడాకుల తోరణాలు కట్టబడి వున్నాయి. అందరికీ స్వాగతాలు చెబుతున్నట్లుగా అవి గాలికి ఊగుతూ కనిపిస్తున్నాయి. ఇల్లూ, వాకిలీ ఆరిపోయిన కల్లాపి వేనీళ్ళతో శుభ్రంగా కనిపిస్తోంది. వెల్లవేసిన ఇంటిగోడలు నిగనిగ మెరుస్తున్నాయి. ఇండ్ల ముందర ముగ్గుపిండితో వేసిన ముగ్గులు, వాటి మధ్య గీసిన ఎఱ్ఱమన్ను గిఱ్ఱల్తో ఆ ప్రాంతానికి కొత్త శోభను తెలుస్తున్నాయి.

చుట్టాలతో, పిల్లల్తో ఇల్లంతా వగటే సందడి. మమ్మల్ని చూసేసరికి, మా వాళ్ళు సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయారు. పందిరి గుంజలకు బిగించి వున్న లవుడ్ స్పీకర్లో సినిమా పాటలు 'ఓ' అని జమాయించేస్తున్నాయి. పెళ్ళి పందిట్లో పిల్లల ఆట్లాటలు, అరుపులు. ఆ యిల్లేగాక ఆ వీధి వీధంతా గుమ్మెత్తి పోతోంది. ఆ శబ్దాల మోతకు, యింటివెనక, పెరట్లో కట్టివేయబడి వున్న ఒక కొమ్ములు తిరిగి వున్న నల్లటి పొటలు ఎగిరెగిరి పడుతోంది.

"పెండ్లంటే యింత ఆగింతమూ, ఆగడాలు వుండాల్నా సామీ?" అంటూ నా శ్రీమతి రమ విచిత్రంగా ముఖం పెట్టి అడిగింది. ఎంతయినా రమ పట్నంలో పుట్టిన బిడ్డగదా. ఈ పల్లెల్లో పెండ్లిండ్ల గురించి ఆమెకేం తెలుసు?


రాత్రి ఎనిమిదికంతా గురివి దేవర గంప రెడీ అయిపోయింది. ఆ గంపలో కాయా కర్పూరం, వేట కొడవలి, మొగిలిరేకుల జత, నీళ్ళ చెంబు, వీబూదుండలు అన్నీ అమర్చబడి వున్నాయి.

అప్పటికే యింటికో మనిషి లెక్కన వచ్చేశారు. ఇంటి ముందర వొగ ప్రక్క ముక్కలమురగా సారా తాగి వున్న వారు పలకలు పగిలిపోయేటట్టుగా అదేపనిగా 'జజ్జనక జజ్జనక' వాయిస్తున్నారు. కొందరు చెక్కభజన వేస్తుంటే, యింకొందరు పెద్ద పెద్ద తాళాలు వాయిస్తూ, నెమలి కుచ్చుల పిల్లన గ్రోవులు వాయిస్తూ నృత్యం చేస్తున్నారు. చాకలి ఓ బన్న నూనె దివిటీ పట్టింది. పట్టిందిగానే వున్నాడు. కులపెద్ద పెద్దగౌడు గంగప్ప గంపను

ఎలబారదీసినాడు. అందరికంటే ముందర మా వదిన నెత్తిన గురివిదేవర గంపను పెట్టుకొని, దివిటీ వెలుతురులో ముందుకు నడుస్తుంటే, ఆమె వెనకన నల్ల పొట్టేలిని పట్టుకొని మా అన్న నడవసాగాడు. వాళ్ళ వెనక చుట్టాలు, ఊరి జనం నడుస్తున్నారు.

గురివిదేవరగంప, గురివిదేవర పొట్టేలి పటాటోపంగా ఊరేగుతూ ఊరి ముందర కూతవేటు దూరంలో ఉన్న గురప్ప దేవుడున్న చిగర చెట్టుకాడికి చూరుకున్నాయి. చెట్టు మొగదల గంపను దించి, పొట్టేలిని పక్కనే వున్న కంప చెట్టుకు కట్టేశారు.

కొందరు చిదుగులు తెచ్చి, ఆ చెట్టుకి కొంతదూరంలో మంట రాజేసారు. యింకొందరు పొట్టేలిని దేవుడి దగ్గరకు ఈడ్చుకొచ్చి, దాని ముఖానికి, ముందరి కాళ్ళకి పసుపు పూసి, కుంకుమబొట్లు బెట్టారు. మదేలు ఓ బన్న యాటకొడవలితో సిద్ధమైపోయాడు. మరికొందరు 'గోవిందా ! గోవిందా! గురువు దేవరా!' అంటూ పొట్టేలిని చిగర చెట్టు చుట్టూ మూడుసార్లు తిప్పి, గురప్పదేవుడి శిలముందర నిలబెట్టారు. మాయన్న పొట్టేలి మెడకున్న తలుగుతో, దాని తలను ముందుకు ఈడ్చి పట్టుకున్నాడు. మరొకతను పొట్టేలి వెనక కాళ్ళు కదలకుండా పట్టుకున్నాడు.




పెద్దగౌడు గంగప్ప గురివిదేవర పని ఆరంభించాడు. ముందుగా చిగరచెట్టు మొదట్లో చెట్టుకానించి వున్న నల్లటి గుర్రప్ప శిలను చేతుల్లోకి తీసుకుని, దాన్ని సుబ్బరంగా నీళ్ళతో కడిగి విబూది రేఖలు దిద్ది, ఆ రాయిని మళ్ళీ యధాస్థానంలో పెట్టాడు. ఆ తర్వాత దాన్ని ఫలపుష్పాలతోను, మొగిలి రేకులతోను అలంకరించి, అదే మాదిరిగా ఎదురు శిలను కూడా నిలిపి "రేయ్. యింక పొట్టేలిని గావియ్యండ్రా" అంటూ అరిచాడు.

ఆ మాటతో అక్కడుండే జనం ఎవరికివారు కల్పించుకొని తలా వొకపని చేయడం ప్రారంభించారు.

"ఓబన్నా ! యింక కానీ!" అంటూ ఆర్డరేశాడు కులపెద్ద గంగప్ప.

ఓబన్న 'కిళిలో కిళిలో' అంటూ ఒక్కసారి కిళారించి, ఒకే వేటుకు పొట్టేలి మెడ నరికేశాడు.

తెగిపడిన తలను శిలముందు పెట్టి వేప ఆకు మీదుగా, దాని మూతిపైన నీళ్ళు పోస్తూ "పిల్లా జల్లా, గొడ్డూ గోదా సల్లంగుండాల. పలుకు సామీ పలుకు" అంటూ పలికించాడు. మొండం గిలగిల తన్నుకొని నిశ్చలంగా వుండిపోయింది.

ఓబన్న మొలతాడుకు కట్టివున్న చాకుతీసి, దాంతో పొట్టేలి డొక్కన చర్మం కోసి గుండెకాయను తీసి, అందులోని ఒక ముక్కను కోసి,

చిదుగులపైన వేసి కాల్చి, ఆ ముక్కను ఒక సన్న కమ్మికి గుచ్చి 'కిళిలో' అంటూ ఆకాశానికి వదిలాడు. మిగిలిన కాలేయాన్ని తీసి కాల్చి, ముక్కలు చేసి ఒక ముక్కను పెండ్లికొడుకు చేత తినిపించి, మిగిలినవి తలా ఒకటి చొప్పున పంచాడు. ఆ తర్వాత అన్నీ గంపకెత్తుకొని, పొట్టేలితో సహా వెనక్కి తిరిగి చూడకుండా యింటికి వచ్చేశారు.

యింటికి తెచ్చిన పొట్టేలికి చర్మం దీసి, దట్టాన్ని కండకండలుగా కోసి మసాలా వేసి వండుకుని యింటిల్లిపాదీ తిన్నారు. పల్లెలో వాళ్ళూ యింటికో మనిసి చొప్పున వచ్చి తినిపోయారు. మాకు మిద్దింటి హాలులో భోజనాలు ఏర్పాటు చేశారు. మా మిద్దెలో వున్న అరలో కొందరు యువకులు, మరికొందరు నడివయస్కులు కూర్చొని ఆత్రంగా అన్నాలు తింటున్నారు. వాళ్ళ ముందర భోజనాలతో బాటు సారా సీసాలు కూడా వున్నాయి. పొట్టేలి మాంసం నంజుకుంటూ పీకల్దాకా మందుతోబాటు భోజనాలు ముగించారు. మా చిన్నవ్వ గుడ్లు మిణకరిస్తూ, మరోపక్క కూర్చొని మావైపు చూస్తూనే తినడం ముగించింది. ఈ మధ్యలో మా చిన్నోడు ఒక్కసారి అక్కడికి వచ్చి తొంగిచూసిపోయాడు. ఒకతను ఒక గ్లాసులో మందు తెచ్చి "అబ్బోడా ! వొగదరామేసుకో" అంటూ అందివ్వబోయాడు.

"వద్దులేవయ్యా సామీ" అంటూ సున్నితంగానే తిరస్కరించి "ఈ మందు యావ పల్లెలకూ పెరిగిందా!" అనుకుంటూ వుండిపోయాను. ఆ అరలో వున్న వారంతా తాగేసి వొకరి మీద వొకరు పడి తిట్టుకుంటూ, అరచుకుంటూ వొకటే ఆగింతం చేస్తున్నారు. కానీ అక్కడెక్కడా మా చిన్నోడు కనిపించడం లేదు.

"ఊర్లో పిలకాయలంతా తాగి చస్తూంటే మా చిన్నోడు మాత్రం ఈ పక్కకే రాలా. వాడు చాలా బుద్ధిమంతుడు" అనుకున్నాను.

ఇలా ఆ రోజు సందేళకంతా భోజనాలు ముగించేసి, బోకులన్నీ శుభ్రంగా కడిగేసి, పెండ్లి జనం బయలుదేరారు. అప్పటికే వీధిలో లారీ రెడీగా వుంది. మేము అక్కడికి వచ్చేసరికి, జనాలు గబగబా లారీలో ఎక్కి కూర్చుంటున్నారు. చూస్తుండగానే లారీ కిటకిటలాడిపోయింది. కొందరు క్యాబిన్‌పైన కూడా ఎక్కి కూర్చున్నారు. నా శ్రీమతీ, నేను క్యాబిన్లో కూర్చున్నాము. పెండ్లికొడుకు, వాడి స్నేహితులు ఆ క్యాబిన్లోనే, వొకరి మీదొకరుగా కూర్చుని, వొకర్నొకరు ఎగతాళి చేసుకుంటూ ముద్దుగా కొడకా, నీయమ్మా, నీ యక్కా, బామ్మర్దీ, మచ్చా అంటూ రకరకాలుగా సంభోదించుకుంటూ, తిట్టుకుంటూ, అర్చుకుంటూ సంతోషంగా కేరింతలు కొడుతూన్నారు. పెండ్లికొడుకైన మా చిన్నోడు మాత్రం చాలా బుద్ధిగా కూర్చోనున్నాడు.

ఇలాంటి ఆనందమయమైన వాతావరణంతోనే లారీ బయలుదేరి అరగంటలో కల్లూరు చేరుకుంది. కొంతసేపు అక్కడే లారీ ఆగింది. లారీ అలా ఆగిందో లేదో క్యాబిన్లో వున్న వాళ్ళు, లారీలో వున్న వాళ్ళు కొంతమంది దిగి గబగబా ఎటో వెళ్ళిపోయారు. మరి కొందరేమో గుసగుసలాడుకుంటూ చెవులు కొరుక్కుంటున్నారు. బహుశా ఆ విషయాలు మాకు వినిపించకూడదని కాబోలు. మా చిన్నవ్వా లారీ దిగి రోడ్డు ప్రక్కన ఒక సందులోకి పరిగెత్తింది. వాళ్ళు అలా ఎక్కడికి వెళుతున్నారో, ఎందుకు వెళుతున్నారో నాకేమీ అంతుబట్టలేదు. అయినా నాకేదో అనుమానం. మెల్లగా నేనూ లారీ దిగి వాళ్ళు వెళ్ళినవైపు రెండడుగులు వేసి అలాగే ఆగిపోయాను. అక్కడ చిన్నవ్వకెళ్ళిన సందులో నుంచీ కొందరు యువకులు చొక్కా బనీన్లలోను, ఫ్యాంటు జేబుల్లోనూ ఏదో దోపుకుంటూ వచ్చారు. యింకొందరు గుడ్లు మిటకరిస్తూ రాసాగారు. కొంతసేపటికి చిన్నవ్వ కూడా కండ్లు చిటకరించుకుంటూ వచ్చింది.

తిరిగి అందరూ లారీ ఎక్కారు. నేనూ ఎక్కి నా స్థానంలో కూర్చున్నాను. కొంతసేపటికి లారీ డ్రైవర్ కూడా కండ్లు మిటకరిస్తూ వచ్చి తన స్థానంలో కూర్చొని స్టీరింగ్‌పైన చేతులు వేసి హారన్ నొక్కి లారీ స్టార్ట్ చేశాడు. తిరిగి లారీ కదిలింది.

అలా బయలుదేరిన లారీ పెండ్లిగుండ్లపల్లె చేరేసరికి రాత్రి ఎనిమిదయింది. పెండ్లికూతురు వాళ్ళు నిమ్మకాయ నీరు, మజ్జిగ యిచ్చి మర్యాదలు చేసి, విడిదిల్లు చూపించి, అక్కడే అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. నా శ్రీమతి మరో యింట్లో వచ్చిన ఆడవాళ్ళతో బాటు పడుకోవడానికి వెళ్ళిపోయింది. భోజనం అయ్యాక మరో మిద్దింటిలో నాకు పడక ఏర్పాటు చేసి వెళ్ళారు. అక్కడ మా ఊరి వాళ్ళే వున్నారు. వాళ్ళలో సగం మంది యువకులే వున్నారు. అందరి చేతుల్లోనూ మందు గ్లాసులున్నాయి. వాళ్ళ మధ్యలో రెండు మూడు బ్రాందీసీసాలు, నంజుకోవడానికి అనుపానాలూ వున్నాయి. నవ్వుతూ, మందు చప్పరిస్తూ వాళ్ళ ఆనందంలో వాళ్ళున్నారు. వాళ్ళకు నేనొకణ్ణి అక్కడే వున్నానన్న స్పృహ కూడా లేకుండా మందు కొడుతున్నారు. వాళ్ళని చూస్తుంటే కల్లూర్లో లారీ ఆగినప్పుడు బనీన్లలో, ఫ్యాంటు జేబుల్లో ఏం దాచి పెట్టుకుని వచ్చారో, సందులో నుంచీ గుడ్లు మిటకరిస్తూ ఎందుకొచ్చారో, చిన్నవ్వతో బాటు, లారీ డ్రైవరూ కళ్ళు చిటకరిస్తూ ఎందుకు కనిపించారో అప్పుడు కానీ నాకు అర్థం కాలేదు. ఆ పరిస్థితిలో వాళ్ళలా చూసేసరికి నా వళ్ళంతా చీమలు ప్రాకినట్లయింది. శరీరమంతా చరచరలాడిపోయింది.

'ఏమిటీ జనం? మందే ప్రపంచంగా వుందే వీళ్ళకి. సిగ్గులేని నా కొడుకులు' అనుకుంటూ, పడక ఏర్పాటు చేసి వెళ్ళిన వ్యక్తిని ఎలాగో వెతికి పట్టుకొని, అతని బ్రతిమాలి నాకు మరో చోట పడక ఏర్పాటు చేసికొని అక్కడి నుంచీ వెళ్ళిపోయాను.

అది కూడా ఒక పాత మిద్దిల్లే. అది ఎండాకాలం కావడం చేత చాలా

**"ఓబన్నా ! యింక కానీ!" అంటూ ఆర్డరేశాడు కులపెద్ద గంగప్ప.**
**ఓబన్న 'కిళిలో కిళిలో' అంటూ ఒక్కసారి కిళారించి,**
**ఒకే వేటుకు పొట్టేలి మెడ నరికేశాడు.**

**ఆ మిద్దె మీద చివరన నేనుంటే, మరో చివరన కొందరు గుంపుగా కూర్చోమన్నారు.**
**వాళ్ళు ఆ ఊరివాళ్ళుగానే వున్నారు.**
**అక్కడా గ్లాసుల గలగలలే. సీసాల సరసరలే.**
**తాగి ఒకర్నొకరు తిట్టుకుంటూ అర్చుకుంటున్నారు.**

ఉక్కగా వుండడంతో, చాపా దిండు చేతబట్టుకొని మెటికెలెక్కి, మిద్దెపైకి వెళ్ళి పడుకున్నాను. లారీ ప్రయాణంతో అలసిపోయిన ప్రాణం కదా ! అలా నడుం వాల్చానో లేదో నిద్దరముంచుకొచ్చేసింది. అలా ఎంతసేపు నిద్దరపోయానో నాకే తెలీదు. కానీ ఏదో అలికిడయితే నిద్రాభంగమైంది. కండ్లు తెరచి అలికిడయిన వైపు చూశాను. ఏముంది? ఆ మిద్దె మీద చివరన నేనుంటే, మరో చివరన కొందరు గుంపుగా కూర్చోనున్నారు. వాళ్ళు ఆ ఊరివాళ్ళుగానే వున్నారు. అక్కడా గ్లాసుల గలగలలే. సీసాల సరసరలే. తాగి ఒకర్నొకరు తిట్టుకుంటూ అర్చుకుంటున్నారు. వొకతను కైపు తలకెక్కి పాట పాడుతూ అడుగులేస్తూ, వంటిపైనున్న పంచ జారి పోతున్నా గమనించకోవడం లేదు. ఆతని నృత్యం చూస్తున్న మిగిలిన వాళ్ళు నవ్వుకుంటున్నారు.

ఇదేమిట్రా భగవంతుడా ! ఇక్కడా జనం తాగి చస్తున్నారు. అన్ని ఊర్లల్లోను యింతేనా, ఈ ప్రపంచం పూర్తిగా చెడిపోయింది' అనుకుంటూ లేచి నిలబడ్డాను. అయినా వాళ్ళు నా పొడ గమనించే స్థితిలో లేరు. మిద్దెపై నుంచీ చుట్టూ చూశాను. చంద్రుడు లోకంపైన వెన్నెల పిండిని నిర్విరామంగా రాల్చుతున్నాడు. ఒక్క పెండ్లోళ్ళ యిల్లు మాత్రం సీరియల్ లైట్లతో ధగధగా మెరిసిపోతోంది. మిగిలిన యిండ్లన్నీ వెన్నెలను తాగి రాత్రివడిలో మత్తుగా జోగుతున్నట్లుగా కనిపిస్తున్నాయి. కానీ, అక్కడక్కడా వున్న మిద్దెలపైనా యిదే యావ. మందు యావ. ఊరి ముందరవైపుకు చూశాను. అది మొలకల పౌర్ణిమ మాసం. అక్కడ ఊరి జనం ఏవేవో ఆటలు ఆడుకుంటున్నారు.

'సరే వంటికన్నా పోదాం' అనుకుంటూ మెటికలు దిగి వీధిలోకొచ్చాను. వీధిలో జన సంచారం లేదు. కానీ పెండ్లి వారింట్లో కొందరు వ్యక్తులు తచ్చాడుతూ కనిపిస్తున్నారు. మెల్లగా నడుచుకుంటూ ఊరి ముందరికొచ్చాను.

అప్పటికే దుక్కి దున్ని వున్న ఊరి ముందరి చేన్లో ఆ ఊరి యువతీయువకులు చేరిపోయి ఏవేవో ఆటలు ఆడుకుంటున్నారు. ఆడవాళ్ళు 'ఉప్పర బట్టెలు', ఆడుకుంటుంటే, మగవాళ్ళు 'బలిగూడు' కూస్తున్నారు. కొందరు పిల్లలు 'గుండుప్పరబట్టె'లు ఆడుకుంటున్నారు. ఎవరి ఆటల్లో వాళ్ళుగా, ఎవరి ఆనందం వాళ్ళదిగా వుంది.

'ఉస్సబ్బ' అనుకుంటూ వెళ్లి చేని గెనింమీద కూర్చుని వాళ్ళ ఆటలు చూడసాగాను. నేను పోయిన కొంతసేపటికి ఊర్లోనుంచీ మరికొందరు యువకులు వచ్చి, అక్కడ ఆడుకుంటున్న ఆడవాళ్ళపైన ఏవేవో జోకులు విసుర్తూ ఆకతాయిగా మాట్లాడసాగారు. వాళ్ళూ మందేసుకుని వచ్చినట్టుంది. వాళ్ళు వచ్చిన కొంతసేపటికి పెండ్లికి వచ్చిన మా ఊరి పిలకాయలూ కొందరు వచ్చారు. వీళ్ళను చూడంగానే అక్కడే వున్న ఆ యువకులు "వొరె పులిచెర్లోళ్ళు వచ్చిండారు. వాళ్ళతో బలి చిప్లాంగుడు ఆడదామా" అంటూ వీళ్ళను పిలిచారు. వీళ్ళు సై అంటే వోళ్ళు డబుల్ సై అన్నారు. అంతే. రెండు జట్లుగా చేరి చెడుగుడు కూయసాగారు. అందులో చాలామంది మందు కొట్టి వుండడం వల్లా వాళ్ళకు కిందా మీద ఏమీ తెలీడం లేదు. ఒకర్ని మించి ఒకరు ఆడారు.

వాళ్ళకు కొంతదూరంలోనే కొందరు ఆడవాళ్ళు దుమ్ములో పట్టెలు గీచుకుని 'సాదుప్పరబట్టె' ఆడుతున్నారు. చెడుగుడులో అవుటైన వాళ్ళంతా ఆ ఆడవాళ్ళను చూస్తూ హాస్యాలాడసాగారు.

అక్కడ మీసం మొలిచిన ప్రతి మగవాడూ ఆడవాళ్ళను చూస్తూ లొట్టలేస్తూ అరుస్తుంటే, ఆడే ఆడవాళ్ళకూ ఉత్సాహంగానే వున్నట్టుంది. అక్కడ తమాసాలు ఎక్కువైపోయాయి. ఆ తమాసే అమావాశయై కూర్చుంది.

ఆ తమాసాలో ఒక పులిచెర్ల యువకుడు హాస్యాలాడుతుంటే, వెనక నుంచీ ఎవరో అతన్ని ఆడవాళ్ళ మధ్యలోకి తోశారు. ఆ తోపుడికి ఆ వ్యక్తి వెళ్ళి ఒక అమ్మాయిపైన పడ్డాడు. అంతే. అదిచూసి ఆ ఊరి వ్యక్తి ఒకతను అశ్లీలంగా తిడుతూ అతన్ని రెండు దెబ్బలేసేశాడు. అది అవమానంగా భావించి పులిచెర్ల యువకులు ఏకమైపోయి, ఆ కొట్టిన వ్యక్తిని నాలుగు తన్నారు. అది ఆ ఊరి వాళ్ళకు ప్రిస్టేజి విషయమైపోయింది. యింకేముంది ! ఇరువర్గాల వాళ్ళు కొట్టుకున్నారు. తన్నుకున్నారు. సారాయి మత్తు వదిలే దాకా తన్నుకున్నారు.

ఈ సంగతి ఎలాగో ఊర్లో వాళ్ళకు తెలిసింది.

"యిదేమిటీ ఇలా అయింది. ఈ సంగతి బయటూర్ల వాళ్ళకు తెలిస్తే . . . యింకేమన్నా బరముంటుందా? ఉప్పురాతికి తరమైతామా? నీళ్ళకంటే పల్చనైపోమా? ఆ మీద మనమంటే ఎవరికి పంకింపుంటుంది?" అనుకుంటూ ఆ ఊరి పెద్ద మనుషులు, పెద్ద గౌడు లింగప్ప అందరూ వచ్చి యిరువర్గాల వాళ్ళని విడదీశారు. అందరికీ పెట్టాల్సిన గడ్డిపెట్టి సర్దిచెప్పారు. ఆ పంచాయితీలో గలాటాకు మూలమైన వాళ్ళకు తప్పులేసి దండించారు. అలా ఆ పంచాయితీ ముగిసే సరికి రాత్రి మూడయింది. ముహూర్తం నాలుగ్గంటలకే. అప్పటికే పెండ్లి కూతురికి నలుగులు ఆరంభించారు. యింకో ప్రక్కన పెండ్లి కొడుకును నలుక్కి పిల్చారు. కానీ పెండ్లి కొడుకు ఎక్కడా కనిపించడం లేదు. దాంతో పెండ్లి కొడుకు కోసరం వెతుకులాట ప్రారంభమైంది. ఎంత వెదికినా పెండ్లి కొడుకు జాడ లేదు.

'ఇదేమిట్రా భగవంతుడా?' అనుకుంటూ నేనూ వెతుకులాట్లో పడ్డాను. అయినా నాకేదో అనుమానంగానే ఉంది. చివరికి ఆ అనుమానమే నిజమైంది.

చిన్నోడు వాడి స్నేహితులు ఊరి చివర వున్న ఒక కడ యింట్లో పడుకోనున్నారని తెలిసింది. గబగబ ఆ యింటి దగ్గరకు వెళ్ళి తలుపు తలుపు తడితే, ఎవ్వరూ తలుపు తియ్యలేదు. తలుపు గట్టిగా తోశాను.



గడియ పెట్టినట్లు లేదు. తోయగానే తలుపు తెరచుకుంది. లోపలికి ఒకడుగు వేసి "చిన్నోడా! చిన్నోడా" అని పిలిచాను.

నా పిలుపుకి ఎవరో లైటు వేశారు. ఆ వెలుతుర్లో చూస్తే ఏడెనిమిది మంది అడ్డదిడ్డంగా పడి నిద్రపోతున్నారు. వాళ్ళను చూస్తూనే, వాళ్ళా రాత్రంతా మందుకొట్టి పడుకున్నట్లుగా చెప్పకనే తెలుస్తోంది. వాళ్ళల్లో మా చిన్నోడిని చూసి గుండె నీరైపోయింది.

నిన్నటి నుంచీ ఎంతో వినయంగా, బుద్ధిమంతుడిలా కనిపించిన వాడిని అలా చూసేసరికి నా మనసు వికలమై పోయింది. దగ్గరకు వెళ్ళి లేపాను. ఉహూ లేచే పరిస్థితిలో లేడు. గబగబా ఆ యింటి పెరట్లోకి వెళ్ళి, అక్కడే వున్న చెంబుతో నీళ్ళ తొట్టిలో నీళ్ళు ముంచుకొని వచ్చి ముఖాన చల్లి లేపాను. పెండ్లింటిలో నుంచీ మజ్జిగ తెప్పించి తాపించాను. దాంతో కాస్తా మత్తు దిగినట్లై, కళ్ళెత్తి నన్ను చూసి అవమానంగా ఫీలయ్యాడు. ఈ విషయం తెలుసుకుని మా అన్నా వదిన అక్కడికి వచ్చేశారు. వాన్ని చూసి మా వదిన భోరున ఏడ్చింది. ఆమెను సముదాయించి ఎవరికీ చెప్పొద్దంటూ అక్కడ వున్న వాళ్ళ దగ్గర మాట తీసుకుని, వాన్ని మెల్లగా పెరట్లోకి తీసుకెళ్ళి చన్నీటితోనే స్నానం చేయించాము. ఆ తర్వాత విడిదింటికి తీసుకు వచ్చి, పట్టుబట్టలు చుట్టి తలకి బాసికం కట్టి, మెడలో పూలమాల వేయించి పెళ్ళి కొడుకుని చేసి, ఎలాగో ఓలాగు పెళ్ళి పందిరికి తీసుకెళ్ళాము. అంత జేసినా ఆతనికి మత్తు పూర్తిగా తగ్గడం లేదు. తూలుతూనే వున్నాడు. మత్తులో జోగుతూనే వున్నాడు. పెళ్ళి కొడుకు, పెళ్ళి కూతురిని పెళ్ళి పీటలపైన కూర్చోబెట్టారు. వీధిలో బ్యాండు మేళాలు, భజాబజంత్రీలు అవిరామంగా మ్రోగుతున్నాయి. పెళ్ళిపందిరి పెళ్ళిజనంతో కిటకిటలాడుతోంది.

'ఎట్లోవొగట్ల పెండ్లి కూతురి మెడలో మూడుముళ్ళు వేసేదాకానైనా బాగుంటే చాలు' అని మా అన్నావదినలతో బాటు నేనూ అనుకున్నాను.

పూజారి ఇద్దరి చేతులకీ కంకణాల కట్టాడు. ఎదురెదురుగా కూర్చొబెట్టి, మధ్యన తెరపట్టించి, జిలకరా బెల్లం వొకరి నెత్తిన వొకరు పెట్టేట్లుగా చేశాడు.

'వీడెక్కడ తూలిపడతాడో, పెండ్లి ఎక్కడ ఆగిపోతుందో'నని ఒకటే టెన్షన్‌గా వుంది.

ఆ తర్వాత పూజారి యిద్దర్నీ మళ్ళీ ప్రక్కప్రక్కన కూర్చోబెట్టి వధూవరుల తల్లిదండ్రుల నుంచీ కొత్త బట్టలు పెట్టించాడు.

వాయిద్యాలు మ్రోగుతూనే ఆ ప్రాంతాన్ని గుమ్మెత్తిస్తున్నాయి. చివరన పూజారి వధూవరులను లేచి నిలబడమన్నాడు. పెళ్ళికూతురు బాగానే లేచి నిలబడింది. కానీ మా అన్నా వదినలు ఎంత జాగ్రత్త తీసుకున్నా తూలుతూనే పైకి లేచాడు చిన్నోడు. పెళ్ళికూతురు చాలా తెలివిమంతురాలుగా వుంది. అంతా ఓర కళ్ళతోనే గమనిస్తోంది. ఆమె ముఖంలో అప్పుడప్పుడూ అసహనం కూడా కనిపించి మాయమవుతూనే వుంది.

మాకు ఎప్పుడేమి జరుగుతుందోనని భయం భయంగానే వుంది.

పూజారి వధూవరుల చేతికి పూలమాలలిచ్చి పూలమాలలు మార్చుకోమన్నాడు. వాళ్ళు అలాగే చేశారు.

కంచు పళ్ళెంలో కొబ్బరి బొండానికి చుట్టివున్న తాళిని తీసి, పెళ్ళి కొడుక్కిచ్చి మంత్రాలు చదువుతూనే "పెళ్ళి కూతురి ఎడమ కాలి బొటన

**ఆ కేక విని పందిరి ఒక్కసారి ఉలిక్కి పడింది. మాతోపాటు పెళ్ళికూతురి తల్లిదండ్రులు ఎగిరిపడ్డారు.**

వ్రేలిని నీ కుడి కాలితో తొక్కి తాళికట్టు నాయనా" అన్నాడు.

చిన్నోడు "సరే" నని ఒక్కసారి అటూ ఇటూ తూలి వధువు కాలు తొక్కి, తాళికట్టబోయాడు. పెళ్ళికూతురు ఇక భరించలేకపోయింది.

"ఆగు" అంటూ గట్టిగా కేక పెట్టింది.

ఆ కేక విని పెళ్ళి పందిరి ఒక్కసారి ఉలిక్కిపడింది. మాతోబాటు పెళ్ళికూతురి తల్లిదండ్రులు ఎగిరిపడ్డారు.

"ఏమైందమ్మా?" అంటూ కంగారుగా అడిగారు వధువు తల్లిదండ్రులు.

"ఈ పెళ్ళి కొడకు నాకొద్దు" ఆవేశంగా ఊగిపోతూ అంది వధువు.

"ఎందుకు?" అన్నారెవరో.

ఒక్క క్షణం ఆమె మౌనంగా వుండిపోయింది.

వీధిలో వాద్యాలు ఆగిపోయాయి. పెళ్ళి పందిట్లో జనాలు నోటమాట రాక నిశ్శబ్దంగా వుండిపోయారు. ఒక్క క్షణం కాలం స్తంభించి పోయినట్లనిపించింది.



"ఏందమ్మా యిదీ . . . ఏం జరిగింది?" వధువు తల్లిదండ్రులు మళ్ళీ ప్రశ్నించారు.

"ఈ పెళ్ళి కొడుకు నాకొద్దు" మళ్ళీ అదే మాటంది.

ఆమె ఎందుకు వద్దంటుందో మాకు తెలుసు కాబట్టి తేలు కుట్టిన దొంగల్లా మౌనంగా వుండిపోయాం.

"ఎందుకొద్దు?" ఎవరో గట్టిగా అరిచాడు.

"వీడు . . . వీడు . . . తెల్ల గుఱ్ఱమెక్కాడు'' గట్టిగా అరిచి చెప్పింది పెండ్లికూతురు.

ఆ మాట విన్న పెళ్ళి జనం గుసగుసలు ప్రారంభించారు.

మాకు తల తీసేసినట్టయింది.

"తెల్ల గుఱ్ఱమంటే?'' ఎవడో అమాయకంగా అడిగాడు.

''మందు కొట్టడం'' ఎవరో సమాధానంగా అంటున్నారు.

పెళ్ళికూతురు చిన్నోడి చేతిలోని తాళిని లాక్కొని, వాడి ముఖాన కొట్టి "తాళికట్టడానికే తాగొచ్చినోడు రేపు నన్ను బతకనిస్తాడా? తూ" అంటూ విసవిసా పెళ్ళి పందిరిలో నుంచీ యింట్లోకి వెళ్ళిపోయింది.

'ఛత్' అంటూ అవమాన భారంతో నా శ్రీమతిని తీసుకుని నేనూ అక్కడినుంచీ వచ్చేశాను. ◆



– జువ్వల పాలెం గ్రామ ఆదర్శం

# సమిష్టి కృషితో సంపూర్ణ పారిశుధ్యం

**ప్రకృతి వలయంలో జీవరాశులన్నీ తమ మనుగడకు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి. స్వార్థపు ఆలోచనలతో మానవుడు అవలంబించే మనుగడ విధానాల వల్లే స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు దుర్లభమైపోతున్నాయి. తనకు ఇష్టమయిన వాటిని ఉపయోగించుకొని మిగతా వాటిని పారవేసే ప్రవృత్తే పారిశుద్ధ్య లోపానికి ముఖ్య కారణం.**

మానవులకు వచ్చే రోగాలు నూటికి 80 శాతం రక్షిత మంచినీటి సదుపాయం లేకపోవడం, అపరిశుభ్ర పరిసరాల వల్ల వస్తున్నాయి. ఎక్కువ మంది చిన్న పిల్లలు జబ్బులతో మరణించడానికి కారణం జబ్బులు కలగజేసే సూక్ష్మ క్రిములు నీటిద్వారా శరీరంలోకి ప్రవేశించడమే, అమ్మవారు, తడపర, పొంగు, తట్టు, సుఖవ్యాధులు, గొంతు నొప్పి, దగ్గు, జలుబు, కంఠవాపు, కోరింత దగ్గు, క్షయం, ఇన్‌ఫ్లుయంజా, గవద బిళ్ళలు



వంటివి. కలరా, టైఫాయిడ్, నీళ్ళ విరోచనాలు, బంక విరోచనాలు, చంటి పిల్లల వాతం, పచ్చకామెరలు, నార కురుపు, నలికపాముల వంటి అనేక రోగాలు అపరిశుభ్ర వాతావరణం, పరిసరాలు, కలుషితమైన నీటి వలన వస్తాయి.

మన గ్రామ ప్రాంతాలలో ఎక్కువగా త్రాగే నీటిని బావుల నుండి, చెరువుల నుండి, కాలువలు, వాగుల నుండి తెచ్చుకుని ఉపయోగించుకుంటూ

ఉంటాము. ఈ నీరు శుభ్రంగా ఉన్నట్టు కనబడినా సూక్ష్మక్రిములను కలిగి ఉంటాయి. ఈ క్రిముల ద్వారానే మనకు రోగాలు వస్తున్నాయి. కనుక శుభ్రమైన నీటిని వాడటం వలన జబ్బులను నివారించవచ్చు. గొట్టపు బావులు, బోరింగులు, చేతిపంపులు, కుళాయిలు వాడే వారికి పరిశుభ్రమైన నీటి సరఫరా ఉంటుంది. జబ్బులు తక్కువగా వస్తాయి. కనుక ప్రతి గ్రామంలో రక్షిత మంచినీటి సదుపాయాలను ఏర్పరచి ప్రజలను అనేక మరణాపాయ రోగాల నుండి రక్షించవచ్చు.



**నీటిని శుభ్రంగా ఉంచడానికి కింది చర్యలు తీసుకోవాలి.**

- బావులపై మూతలు ఉంచాలి.
- బావులకు, తాగేనీటికి, స్నానాల గదులకు, అంట్లు తోమే ప్రాంతాలకు దూరంగా మలం, మురికినీటిని ఉంచాలి.
- ఆ ప్రాంతాలలో పశువులను, పిల్లలను మలవిసర్జన చేయకుండా చూడాలి. బట్టలు ఈ ప్రాంతాలలో ఉతకకుండా ఉండేలా చూడాలి.
- పశువుల పాకలను ఇళ్ళకు, మంచినీటి బావులకు దగ్గరగా ఉంచకూడదు.
- నీరు తోడటానికి వాడే బక్కెట్లు, తాడు, కుండ మొదలైనవి శుభ్రంగా ఉంచాలి.
- జంతువులను తాగేనీటి దగ్గరకు రానీయకుండా చూడాలి.
- వారానికి ఒకసారైనా లేదా పదిహేను రోజులకు ఒకసారైనా బావులలో క్లోరిన్ లేదా బ్లీచింగ్ పౌడర్‌ను చల్లేటట్లు చర్యలు తీసుకోవాలి.
- ఇక ఇంటిలో వాడేటప్పుడు శుభ్రమైన మూతలున్న పాత్రలలో నీరు ఉంచాలి. కుండలలోని నీటిని శుభ్రమైన గరిటె ద్వారా తీసుకోవాలి.
- చేతులు ముంచడం, గ్లాస్‌తో ముంచుకు తాగడం చేయనివ్వకూడదు.
- జంతువులను ఇంటిలోనికి రానీయకూడదు.
- శుభ్రమైన బావులు, వంపులు





అందుబాటులో లేనిచో నీటిని కాచి, చల్లార్చి తాగితే జబ్బులను నివారించవచ్చు.

## పారిశుద్ధ్యం

వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటిలోపల, ఇంటి బయట, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవటాన్ని పారిశుద్ధ్యం అంటారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడమే కాక, ఇంటిలో ఇంటి చుట్టూ పరిసరాలలో అంతే కాకుండా గ్రామమంతటిలో పారిశుద్ధ్యం ఏర్పరచడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించితే గ్రామం, అందులోని వ్యక్తులు ఆరోగ్యంగా ఉంటారు. మన గ్రామాన్ని ఆరోగ్యవంతమైన గ్రామంగా తీర్చిదిద్దాలంటే వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటి పరిశుభ్రత, ఇంటి చుట్టూ పరిశుభ్రత మెరుగుపరుచుకోవాలి.

## అందుకోసం క్రింది అంశాలుపై జాగ్రత్త వహించాలి

- మురికి నీటి విసర్జన
- మల మూత్రాదుల విసర్జన
- పశువులపేడ, చెత్త విసర్జన
- గృహ పారిశుద్ధ్యం, ఆహార శుభ్రత
- వ్యక్తిగత శుభ్రత
- గ్రామ పారిశుద్ధ్యం

## మురికి నీటి విసర్జన

ఇళ్ళల్లో మనం స్నానాలు చేసిన నీటిని మరియు మురికి నీటిని, కాలువలు గుండా పోయేటట్లు చూడాలి. అలా వీలు కాని పక్షంలో పెరటి తోటలను పెంచి, వాటిలోకి ఈ నీరు ప్రవహించునట్లు చేసి, మొక్కలను





పెంచవచ్చు. గ్రామంలో ఉన్న ఇండ్లముందు కాలువలను ఏర్పాటు చేసి వాటిని గ్రామంలో పనికిరాని భూమిగా పడి ఉన్న వైపుకి మళ్ళించాలి. ఈ మిగులు భూముల్లో మనం అనేక రకాలయిన చెట్లను పెంచడం వల్ల మురికి నీటిని ఉపయోగించాలి. ఆ గ్రామానికి ఆ చెట్ల నుండి ఆదాయం వచ్చేలా చూసుకోవచ్చు.

### మల మూత్రాదుల విసర్జన

గ్రామాల్లో మలమూత్రాదుల విసర్జనకు సరియైన వసతులు లేవు. తక్కువ ఖర్చుతో లెట్రిన్‌లు కట్టడాన్ని ప్రోత్సహించాలి. స్థలం లేనప్పుడు, సామూహిక మరుగుదొడ్లను ఏర్పాటు చెయ్యాలి. లేకపోయి నట్లయితే స్త్రీలు చాలా ఇబ్బందికి గురి అవుతారు. సామూహిక మరుగుదొడ్లును ఏర్పాటు చేసినపుడు వాటిని శుభ్రం చేయవలసిన బాధ్యత, నిర్వహణ సరిగ్గా జరిగేలాగా చూడాలి. గ్రామంలో ఒక ఒక్కరు వాటిని ఉపయోగించేలా వారికి వాటిపై అవగాహన కల్పించాలి.



### పశువుల పేడ, చెత్త విసర్జన

పశువులు వేసే పేడను నిల్వ చేసి వాటి నుండి ఎరువులకు తయారు చేసే విధానాన్ని ప్రోత్సహించాలి. పేడ నుండి బయోగ్యాస్ తయారు చేసి, దాన్ని ఉపయోగించేలా చూడాలి. పేడను చెత్త కుండీల్లో వేయరాదు. అలా వేసినందువల్ల దానిలో ధనుర్వాతాన్ని కలుగజేసే క్రిములు పుడతాయి. కాబట్టి కనీసం ఆ పేడను గ్రామంలో పనికిరాని భూమి ఏదయితే ఉంటుందో అక్కడ వేయించడం వల్ల ఆ భూమిని పనికి వచ్చే విధంగా మార్చుకునే అవకాశం ఉంది. లేదా ఆ పేడ ద్వారా, ఆ గ్రామంలోని పొలాలకు ఉపయోగపడే ఎరువును తయారు చేసుకొనవచ్చును. చెత్తను ప్రోగుచేసి ఒక గుంటలో వేసి, పనికిరాని



కాగితాలను వేసి, దాని నుండి వానపాములను పెంచడాన్ని ప్రోత్సహించవచ్చు.

### గృహ పారిశుధ్యం, ఆహార శుభ్రత

ఇది చాలా ముఖ్యమైనది. ప్రతిరోజు ఇంటిని శుభ్రపరుచు కొనవలెను. ఇంటిలోని చెత్తా, చెదారాలను, ఇంటిలోని ఒక మూల గుంట త్రవ్వి అందులో వేసి, వారానికి ఒకసారి దానిని మున్సిపాలిటీ వారు శుభ్రపరిచేటట్లు చూడాలి. అట్లా చేయడానికి వీలు లేనపుడు, గ్రామంలో ప్రతి వీధికి రెండు చెత్త కుండీలను ఏర్పాటు చేసి అందులో వేయమని ప్రజలను ప్రోత్సహించాలి. ఎప్పటికప్పుడు దానిని ఖాళీ చేసి శుభ్రం చేయించాలి. ద్రవ పదార్థాలను విడిగా, ఘనపదార్థాలను విడిగా వేయాలి. రెండూ కలిపి వేస్తుండటం వలన కుళ్ళు వాసన వచ్చి, శ్వాసకోశ సంబంధమయిన వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

ఇంటిలో వండిన పదార్థాలపై మూతలు ఉంచవలెను. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తినరాదు. ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోనవలెను.

### వ్యక్తిగత శుభ్రత

ప్రతిరోజు స్నానం చేయవలెను. ముఖ్యంగా చిన్నపిల్లలకు వ్యక్తిగత శుభ్రత గురించి తెలియనివ్వాలి.

### గ్రామ పారిశుధ్యం

మన యిండ్లను మనము ఎట్లా శుభ్రంగా ఉంచుకుంటామో అలాగే మన పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవటమనేది మన అందరి బాధ్యత, ఎవరయినా పరిసరాలను అపరిశుభ్రం చేసినపుడు వాళ్ళ మీద చర్య తీసుకోవడం ద్వారా ఆ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచగలం. దాని ద్వారా మన గ్రామాన్ని మనం అనారోగ్య పరిస్థితుల నుండి కాపాడుకొనగలము.

### పర్యావరణం

పర్యావరణ కాలుష్యం అణుబాంబు కన్నా ప్రమాదకరమైనది. కాలుష్యం వల్ల అరుదైన వన్యప్రాణులు, వృక్షజాతులు అంతరించి పోతున్నాయి. స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు దుర్లభమైపోతున్నాయి. పర్యావరణ కాలుష్యం ఏర్పడటానికి మానవుడే ముఖ్యకారకుడు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మనం కొన్ని పనులు చేసి ఈ ధరిత్రిని, మానవాళిని, పరిసరాలను కాపాడుకుందాం.

- ఇంధనం, కరెంటుని ఆదా చేయాలి
- చెత్తని తడి / పొడి చెత్తగా వేరుచేసి తడి చెత్తని పశుగ్రాసంగా మార్చాలి
- మొక్కల్ని పెంచి, పరిరక్షించుకోవాలి
- నీటిని పొదుపు చేయాలి, మురుగునీరు నిలువ ఉండకుండా చూడాలి



- వాననీటిని వృధాపోకుండా ఇంకుడు గుంటలకు చేర్చాలి
- ప్లాస్టిక్ కవర్లు వాడకూడదు. బట్ట సంచి వాడాలి
- ప్రకృతి పట్ల ప్రేమగా మెలగాలి. జంతువుల హక్కులను రక్షించాలి, మొక్కలను ఇతర జీవరాశులను రక్షించాలి
- ఆసుపత్రిలో వచ్చిన వ్యర్థాలను నాశనం చేసే పరికరాలు వాడాలి

### 'నిర్మల్ గ్రామ్' పురస్కారం – జువ్వలపాలెం గ్రామ ఆదర్శం

వ్యక్తిగతంగా అయినా సరే, సమాజపరంగా సరే అభివృద్ధి సాధించడం అంటే మాటలు కాదు. అందుకు ఎన్నో రకాల వనరులు అవసరమవుతాయి. ఎలాగైనా సరే పరిస్థితులను మార్చుకోవాలన్న తపన, పట్టుదల ఉండాలి. వీటిని గుర్తించి 'మీరు సాధించగలర'ంటూ వెన్నుతట్టి ప్రోత్సహించే వారుండాలి. చక్కటి మార్గదర్శకత్వం వహిస్తూ లక్ష్య సాధన దిశగా అవసరమైన సహాయ సహకారాలు అందించే వారుండాలి. ఈ వనరులన్నిటి ఆసరాతో, స్వయంగా పైకి ఎదగాలన్న ప్రగాఢకాంక్ష అనుక్షణం రగులుతూ ఉండాలి. అందుకు తగిన నిరంతర కృషి ఉండాలి. ఇవన్నీ ఏకమైనప్పుడే 'ఉన్న' స్థితి నుంచి 'ఉన్నత' స్థితికి చేరుకోవడం సాధ్యమవుతుంది. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలానికి చెందిన జువ్వలపాలెం ఇందుకు ఓ సజీవ సాక్ష్యం. మేజర్ పంచాయితీ నుంచి విడిపోయిన తర్వాత, అభివృద్ధి ప్రస్థానంలో ఓనమాలు





దిద్దుకునే స్థాయి నుంచి నలుగురూ తన గురించి చెప్పుకుని ఓ 'ఆదర్శగ్రామ' స్థాయికి ఎదిగింది జువ్వలపాలెం.

ప్రగతిశీల దృక్పథంతో కృషి చేస్తూ, వివిధ రంగాలలో ప్రశంసనీయ ప్రగతిని నమోదు చేసి, కేంద్ర ప్రభుత్వం నుంచి 'నిర్మల్ గ్రామ్ పురస్కారం' పొందిన ఈ గ్రామం గురించి తెలుసుకుందాం.

సంపూర్ణ పారిశుధ్యం, సురక్షితమైన త్రాగునీరు, అక్షరాస్యత, పరిశుభ్రత తదితర అంశాలలో ఆదర్శవంతమైన పద్ధతులు ఆచరిస్తూ, జువ్వలపాలెం గ్రామం అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'నిర్మల్‌గ్రామ్' పురస్కారం అందుకుంది.

భీమవరానికి సరిగ్గా 18 కిమీ దూరంలో ఉన్న జువ్వలపాలెం ఒకప్పుడు ఏలూరుపాడు గ్రామపంచాయితీకి శివారు గ్రామంగా ఉండేది. 1959లో ఈ గ్రామం ప్రత్యేక పంచాయితీగా విడిపోయింది. అప్పటి నుండి మొదలుకొని ఈ నాలుగు దశాబ్దాల కాలంలో గ్రామస్థులందరి సమిష్టి కృషితో ఈ గ్రామం అంచెలంచెలుగా అభివృద్ధి సాధించింది.

మూడు వేల ఏడు వందల మంది జనాభా కలిగిన ఈ గ్రామ పంచాయతీకి మొదట్లో ఆదాయం అంతగా ఉండేది కాదు. అయితే షాపింగ్ కాంప్లెక్సుల నిర్మాణం వంటి సృజనాత్మకత ఆలోచనలతో, ప్రణాళికలతో జువ్వలపాలెం పంచాయితీ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోగల్గింది. 2001లో బైర్రాజు ఫౌండేషన్ ఈ గ్రామాన్ని దత్తత తీసుకుంది. గ్రామ వికాస సమితి సభ్యుల అంకిత భావం, ప్రవాస గ్రామస్థుల సహకారం ఈ రెండూ కలిసి వికాస రథాన్ని శరవేగంతో ముందుకు నెడుతున్నాయి.

ఫౌండేషన్ సహకారం, గ్రామస్థాయి నాయకత్వం కార్యదక్షత, ప్రభుత్వ అధికారుల ప్రోత్సాహం, మార్గదర్శకత్వం వెరసి అందరి సమిష్టి కృషితోనే ఈ పురస్కారాన్ని అందుకోగలిగామంటారు జువ్వలపాలెం గ్రామస్థులు.

ప్రారంభంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి గ్రామస్తులు ముందుకు రాని పరిస్థితులలో వీటి ప్రాముఖ్యం గురించి అవగాహన కలిగించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. బైర్రాజు ఫౌండేషన్ గ్రామవికాస సమితి సభ్యులు, పంచాయితీ ప్రతినిధులు, సంబంధిత ప్రభుత్వ అధికారులు ఉమ్మడిగా కలిసి ఇంటింటికీ వెళ్ళి మరుగుదొడ్ల అవసరం గురించి, పారిశుధ్య వసతులు సక్రమంగా లేకపోయినట్లయితే వచ్చే సమస్యలు, పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాల గురించి గ్రామస్తులకు అర్థమయ్యేలా వివరించారు. చర్చలు సమావేశాలు, ర్యాలీలు చైతన్య యాత్రలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కరపత్రాల ద్వారా దిశగా అవగాహన కల్పించారు. అయితే ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా మార్పు రాని గ్రామస్థులలో ప్రత్యేక పద్ధతుల ద్వారా చైతన్యం తీసుకురావడానికి వీరంతా కృషి చేశారు. వీరందరూ బృందాలుగా ఏర్పడి, రాత్రిళ్లు కాపలా కాసేవారు. రోడ్లు, కాలువగట్లు పక్కన బహిరంగ మల విసర్జన చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించేవారు. ఇలా చేసినప్పటికీ మార్పు రాని వారి విషయంలో పోలీసుల సహకారం తీసుకోవడం, వారి రేషన్ సరుకులు ఆపెయ్యడం, క్షమాపణ పత్రం రాయించుకోవడం, జరిమానా విధించడం మొదలైన చర్యలు తీసుకున్నారు.

వీటన్నిటి ఫలితంగా క్రమేపీ ప్రజల్లో కొంతవరకు చైతన్యం వచ్చి మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారు. ఆర్థిక సహకారం అందించడంతో పాటు బైర్రాజు ఫౌండేషన్ ఈ గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి సకాలంలో అనుమతి వచ్చేందుకు కృషి చేసింది. అలాగే నిర్మాణ కార్యక్రమాలను పర్యవేక్షించింది. అలా 600 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించబడ్డాయి. ఈ రోజున ఇంటింటికి మరుగుదొడ్డి సౌకర్యంతో బహిరంగ మల విసర్జనను రూపు మాపి సంపూర్ణ (నూరు శాతం) పారిశుధ్యం సాధించగలిగింది ఈ గ్రామం. వ్యక్తిగత మరుగుదొడ్లతో పాటు, గ్రామానికి వచ్చే పరిసర గ్రామాల ప్రజల కోసం, ఇల్లు ఉండి మరుగుదొడ్డి నిర్మాణానికి స్థలం లేని వారి కోసం 20 పబ్లిక్ టాయిలెట్లు నిర్మించడం విశేషం. ఈ టాయిలెట్లకు నీరు, కరెంటు సదుపాయాన్ని సమకూర్చడంతో పాటు నిత్యం వీటిని శుభ్రపరిచేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని కూడా నియమించడం చెప్పుకోదగిన విషయం. ఈ విధంగా సమిష్టి కృషితో సంపూర్ణ పారిశుధ్యం సాధించినందుకు గాను జువ్వలపాలెం 'నిర్మల్‌గ్రామ్ పురస్కారం' అందుకుంది. ఆనాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా గ్రామ సర్పంచి ఎస్. అమ్మన రాజా ఈ అవార్డు అందుకున్నారు.

– జి. సురేఖ

# ఆకాశ దేశాన హాయిగా ...



వాతావరణంలోని ఉష్ణోగ్రతల తేడాల వల్ల మరియు ఆహారపదార్థాల కొరత వల్ల వచ్చే ప్రతికూల పరిస్థితులను తట్టుకోడానికి వివిధ జంతువులు దూర ప్రదేశాలకు వలసపోతాయి. పక్షులలో వలస ఒక క్రమ పద్ధతిలో, ఒక నిర్దిష్ట ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి మరల మొదటి ప్రదేశానికి, నిర్ణీత సమయాల్లో, గడియారం లోని లోలకం చలనం లాగా ఉంటుంది.

దాదాపు 2000 సం॥ క్రితమే అరిస్టాటిల్ ఆఫ్రికాలోని నైలు నది ప్రాంతానికి శీతాకాలంలో కొంగలు వలస రావడం గమనించాడు. పక్షులే కాకుండా కొన్ని జంతువులు – మిడతలు, ఏనుగులు, ఈల్ చేపలు, సాలమాన్ చేపలు, తాబేళ్ళు, జింకలు, సీతాకోకచిలుకలు, తిమింగలాలు, చివరికి మానవులు కూడా వలస పోతునప్పటికీ, పక్షులవలసలో ఉన్న క్రమ పద్ధతి ఏ ఇతర జంతువులలో ఉండదు.

## పక్షుల వలసలో అంతుపట్టని అందాలు







పక్షుల వలసకు ప్రధాన కారణం శీతోష్ణస్థితి ప్రభావం, ఆహార పదార్థాల లభ్యత. వలస పోవడం ద్వారా పక్షులు వాతావరణంలోని ప్రతికూల పరిస్థితులను తప్పించుకోవడమే కాకుండా ఆహారం కూడా సంపాదించుకోగలుగుతాయి, తద్వారా అన్ని రుతువుల్లో అనుకూలమైన జీవనాన్ని అనుభవిస్తాయి. పక్షుల వలసకు వాటి శరీర ధర్మం అనుకూలించబడి ఉంటుంది. ఉష్ణరక్త జీవులు కావడం, వాటి శరీరం ఈకలతో కప్పబడి ఉండటం, చాలాదూరం వరకు ఎగురుతూ పోయే సామర్థ్యం ఉండటం వల్ల పక్షులు తేలిగ్గా సుదూర ప్రాంతాలకు వలస పోగలుగుతాయి.



సాధారణంగా గుడ్లు పెట్టే సమాయానికి ముందుగానీ, పిల్లలు పొదిగిన తరువాత గాని వలస జరుగుతుంది. పక్షులు వలస పోయే మార్గాలు, అవి వివిధ ప్రదేశాలను సరిగ్గా గుర్తించుకొనే విధానం లాంటి విషయాలు ఇప్పటికీ జీవశాస్త్రవేత్తలకు అంతుపట్టకుండా, అర్థంకాకుండా ఉన్నాయి. కాని పక్షుల వలస పద్ధతులపై కొన్ని సిద్ధాంతాలు ప్రతిపాదించబడ్డాయి. వాటి ప్రకారం శీతోష్ణస్థితులలో మార్పులు, గాలిలో తేమ, వర్షపాతం, రేయింబవళ్ల నిడివి, ఆహార లభ్యత, గుడ్లు











పెట్టే సమయం మొదలైన విషయాలు వలసను ప్రభావితం చేస్తాయి. ఇవే కాకుండా పక్షుల్లోని హార్మోన్‌స్రావాలు, జన్యుకారణాలు, అనుకరణ, ప్రాణుల్లో సహజంగా ఉండే జీవ గడియారం మొదలైనవి కూడా వలసకు దోహదం చేయవచ్చునని శాస్త్రవేత్తల భావన.


వలస పోయే మార్గాలు, వివిధ ప్రదేశాలను గుర్తించే పద్ధతిపై కూడా చాలా సిద్ధాంతాలు ఉన్నాయి. ముఖ్యంగా సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలగతి, భూఅయస్కాంత క్షేత్రం, పర్వతాలు, నదులు, సరస్సులు మొదలైన భౌగోళిక అంశాలు ఆధారంగా చేసుకొని, అవి వివిధ మార్గాలను గుర్తించగలుగుతాయని శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు.

పక్షుల్లో వలస సుదూర ప్రాంతాలకు గాని దగ్గరి ప్రదేశాలకు గాని ఉండవచ్చు. ఉదాహరణకు హిమాలయాలకు పైన ఉండే ఉత్తర ఆసియా, ఉత్తర యూరోప్, తూర్పు యూరోప్ ప్రాంతాల నుండి భారత ద్వీపకల్పానికి దాదాపు 350 జాతుల పక్షులు వల స వస్తాయి.










అదే విధంగా మరికొన్ని పక్షులు హిమాలయాల నుంచి ఈశాన్య భారతదేశంలోని ప్రాంతాల్లో నుంచి దక్షిణ భారతదేశానికి, మధ్య భారతదేశానికి వలస వస్తాయి. ఇంకొన్ని పక్షులు చిన్న భౌగోళిక ప్రదేశంలోని కొండలపై నుండి చదునైన ప్రదేశాలకు, ఆహారం దొరికే ప్రదేశాలవైపునకు తక్కువ దూరాలకే వలసపోతాయి.



వలస పోయేటప్పుడు పక్షులు గుంపులుగా ఎగురుతాయి. అవి ఉత్తర దక్షిణాలు గానే ప్రయాణిస్తాయి. కొన్ని జాతులు ముఖ్యంగా పెద్ద పక్షులు (ఉదా॥ గూడ కొంగలు, కొంగలు, గద్దలు మొదలైనవి) పగటి పూట, చిన్న పక్షులు (ఉదా॥ నీటి పక్షులు, ఫ్లై కాచర్‌లు, త్రష్‌లు, వార్‌బ్లర్‌లు, ఓరి యోల్‌లు మొదలైనవి) రాత్రి పూట పయనిస్తాయి. వివిధ జాతులను బట్టి ఎగిరే ప్రదేశాలను బట్టి అవి గంటకు 30 కి.మీ., నుండి 100 కి.మీ. ల వేగంతో ఎగురుతాయి. ఏకధాటిగా రోజుకు 6 నుండి 11 గంటల ప్రయాణం చేయగలవు.

సముద్రాలు దాటేటప్పుడు కొన్ని చిన్న పక్షులు మూడు రోజులు ఏకధాటిగా ప్రయాణం చేస్తాయి. ఒకేసారి 200 నుండి దాదాపు 1000 కి.మీ. ల వరకు ప్రయాణం చేయగలవు. గోల్డెన్‌ప్లవర్, స్నైప్ పక్షులు (ఉల్లంకి







పిట్టలు) సముద్రం మీద ఎగిరేటప్పుడు 300 నుండి 4000 కి.మీ., ఒకేసారి ఎగురగలవు. వివిధ జాతుల పక్షులు 400 నుండి 900 మీటర్ల ఎత్తులో ఎగురుతాయి. స్వాన్ (Swan) అనే జాతి బాతులు సముద్రమట్టానికి 8000 కి.మీ.ల ఎత్తులో −48 డిగ్రీల సెల్సియస్ శీతల వాతావరణంలో కూడా ఎగురగలవు. ఆర్కిటిక్ టర్న్ (Arctic tern) అనే పక్షి అత్యంత దూరానికి వలస పోయే పక్షి. ఇది ఉత్తర ధృవం నుండి దక్షిణ ధృవానికి, అక్కడినుండి ఉత్తర ధృవానికి ఒకే సంవత్సరంలో 25,000 కి.మీ. ప్రయాణం చేస్తుంది. దాదాపు 20 సంవత్సరాలు జీవించే ఈ పక్షి తన జీవితకాలంలో సుమారు 5 లక్షల కి.మీ. దూరం ప్రయాణం చేస్తుంది.

సాధారణంగా పక్షుల వలస కొన్ని నిర్దిష్ట మార్గాల్లో జరుగుతుంది. జలమార్గాల కంటే భూమార్గాలపైనే పయనిస్తాయి. ఒకవేళ సముద్రాలను దాటవలసి వచ్చినపుడు తీరప్రాంతాల వెంబడి లేదా ఎక్కువ దీవులు ఉండే మార్గాల వెంట పయనిస్తాయి.

పక్షుల వలస గురించిన మరిన్ని విషయాలు తెలుసుకోడానికి, అవి పయనించే మార్గాలు, చేరే గమ్యాలు, ఎగిరే ఎత్తులు మొదలైన మిస్టరీల ను ఛేధించడానికి శాస్త్రవేత్తలు వివిధ పద్ధతులను అవలంబిస్తున్నారు.







వీటిలో ప్రధానమైనది రింగింగ్. అంటే గుంపులోని కొన్ని పక్షులను బంధించి వాటి కాలికి ఉంగరాన్ని తొడిగే పద్ధతి. ఈవిధంగా తొడిగిన ఉంగరాలు ఇతర ప్రదేశాల్లో పట్టుబడినప్పుడు వలస గురించి కొన్ని విషయాలు తెలుసుకోవచ్చు. భారతదేశంలో బాంబే నాచురల్ హిస్టరీ సోసైటీ (BNHS) అనే సంస్థ పక్షుల రింగింగ్‌ను 1960 సం॥ నుండి చేపట్టింది. ఇంతవరకు 2 లక్షలకు పైగా పక్షుల రింగింగ్ చేయబడ్డాయి. ఉపగ్రహానికి అనుసంధానించబడిన చిన్న ట్రాన్స్‌మీటర్‌ను పక్షులకు తొడిగి ఉపగ్రహం ద్వారా పక్షులు వలస వెళ్ళే మార్గాలను, అవి ఎగిరే ఎత్తును, చేరే ప్రదేశాల ను ఉపగ్రహ టెలిమెట్రి ద్వారా సులభంగా గుర్తించవచ్చును. కాని ఇది చాలా ఖరీదుతో కూడుకున్న పని.


మనం బయటకి వెళ్లినపుడు పక్షులను పరిశీలించడం అలవాటు చేసుకోవాలి (Bird watching) , వివిధ రకాల పక్షులను గమనించడం, వాటిని గుర్తించడం చాలా వినోదాన్ని, విజ్ఞానాన్ని కలిగిస్తుంది. ఒక బైనాక్యులర్, పక్షులకు సంబంధించిన ఒక పుస్తకం ఉంటే మన పరిసరాల్లోని చిన్న, పెద్ద పక్షులనన్నిటినీ చూసి గుర్తించవచ్చు.


మన రాష్ట్రంలో నేలపట్టు, వెదురుపట్టు, పులికాట్ (నెల్లూరు జిల్లా), తేలినీలాపురం (శ్రీకాకుళం జిల్లా), వీరాపురం (అనంతపురం జిల్లా), కొండకర్ల (విశాఖపట్టణం), బ్రహ్మదేవం (తూర్పుగోదావరి జిల్లా), బద్వేలు (కడప జిల్లా), చింతపల్లి (ఖమ్మం జిల్లా), మేచిరాజుపల్లి (వరంగల్ జిల్లా), కొల్లేరు (పశ్చిమ గోదావరి జిల్లా) మొదలైన ప్రాంతాల్లోని సరస్సులు, చింత తోపులు వలస పక్షులకు నెలవు. ఉదాహరణకు గూడ కొంగలు (Pelicans), కొంకణాయి (Ibis), ఎర్రకాళ్ల కొంగ (Painted stork), చిలక ముక్కు కొంగ (ఫ్లమింగో) మొదలైనవి.

భూమి వాతావరణం వేడెక్కడం వల్ల (Global Warming) వివిధ జీవుల జీవిత చక్రాలు మారుతున్నాయని ఇటీవల శాస్త్రజ్ఞులు జరిపిన సర్వేల్లో బయటపడింది. దీనివల్ల కొన్ని జాతులు అంతరించిపోయే ప్రమాదముంది. ఈ మహా ప్రళయాన్ని ఆపడానికి, జీవజాతులను, వాటి వైవిధ్యాని సంరక్షించుకోడానికి, ఈ భూగోళాన్ని సురక్షితంగా మన ముందు తరాలవారికి అందించడానికి మన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించవలసిన అవసరం ఉంది.

'పక్షులకెన్నడూ పాస్‌పోర్టు లేదు. ఖండాలన్నీ దాటెల్లు' అని ఒక సినీ కవి అన్నట్లుగా పాస్‌పోర్టు, వీసా అక్కర్లేకుండా ఎన్నో ప్రదేశాలు, ఖండాంతరాలు ఎగిరే పక్షుల జాతి నిజంగా అదృష్టవంతమైనది కదా! ఎన్నో శతాబ్దల నుండి అంతుపట్టకుండా ఉన్న పక్షుల వలసను వివిధ ఆధునిక పద్ధతుల ద్వారా శాస్త్రవేత్తలు చేదిస్తారనీ, వలస గురించి అన్ని సంగతులు మనకు త్వరలోనే తెలుస్తాయని ఆశిద్దాం.

***– ఎన్. చంద్రమోహన్ రెడ్డి,*** *ఐ.ఎఫ్.ఎస్,*
*ప్రత్యేక విధి నిర్వాహణాధికారి, బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు,*
*హైదరాబాద్ మెట్రో పాలిటిన్ డెవలప్‌మెంట్ అథారిటీ*
***– శైలేష్,*** *ఫాకల్టీ, ఎం.ఎం.ఆర్., అపార్డ్*



# అసలైన విజయానికి చిహ్నం 'శుభ శుక్రవారం'

**మధ్యాహ్నం నుంచి మూడు గంటల వరకు ఆ దేశమంతటా చీకటి కమ్ముకుంది. 'ఏలీ, ఏలీ, లామా సబక్తానీ' (నా దేవ నా దేవ నన్నెందుకు చెయ్యి విడిచితివి) అని ఓ పెద్ద కేక... దానిని విన్న సైనికుల ఈసడింపుల మధ్యలో మరో కేక. ఆ కేకతో ఏసు పవిత్రాత్మ గాలిలో కలిసిపోయింది. దేవాలయపు తెర పైనుంచి కిందికి రెండుగా చిరిగింది. భూమి వణికింది. బండలు బీటలు వారాయి. సమాధులు తెరుచుకున్నాయి... ఎన్నో అమానుష చర్యలను అనుభవించిన యేసు ఆ రోజు ఇంచుమించు మూడు గంటలప్పుడు శిలువపైన ఒక మామూలు నేరస్తుడిలా ప్రాణం వదిలాడు.**

శిలువ మరణం అనేది చాలా దుర్భరమైన మరణశిక్ష. పరమనీచులకు, కరుడుగట్టిన నేరస్తులకు ఆనాటి రోమా ప్రభుత్వం విధించే మరణశిక్ష అది. రెండు కర్రలను అడ్డంగా పెట్టి, దానిపైన నేరస్తుణ్ణి వేలాడదీస్తారు. కర్రలపై వేలాడేందుకు వీలుగా నేరస్తుణ్ణి వాటికి తాళ్ళతో కడతారు. లేదంటే ఇనుప మేకులతో నేరస్తుణ్ణి కాళ్ళూ చేతులకు దిగ్గొడతారు. మండుటెండలో శిలువకు వేలాడుతున్న నేరస్తుడు చనిపోవడానికి కొన్ని సందర్భాల్లో కొన్ని రోజులు పడుతుంది. అలా వేలాడుతున్న నేరస్తుడు త్వరగా చనిపోకపోతే, రోమా సైనికులు విసిగిపోయి అతని కాళ్ళూ చేతులు

**ఏసుక్రీస్తు తాను చెప్పినట్టే తన ప్రాణాన్ని కూడా పోగొట్టుకోవడానికి సిద్ధపడటం ద్వారా లోకాన్నంతటినీ తన తండ్రి కోసం సంపాదించాడు. అవమానానికి, ఓటమికి, ఎంతో బాధతో కూడిన మరణానికి నిదర్శనమైన ఏసుక్రీస్తు శిలువ మరణం పునరుత్థానానికి కారణంగా, విజయానికి చిహ్నంగా మారింది.**

విరగ్గొట్టి మరీ చంపేస్తారు. మరణం ఎలాగూ తప్పదనుకున్న నేరస్తులు తీవ్రమైన పదజాలంతో కనిపించిన వారినల్లా తిట్టడం పరిపాటి. అందుకే రోమా సైనికులు నేరస్తుడి తిట్లు, శాపనార్థాలు వినడం ఇష్టం లేక శిలువ వేసే ముందు నేరస్తుని నాలుకను కత్తిరించడం సాధారణంగా జరిగే విషయం.

కాని రెండు వేల సంవత్సరాల క్రితం, కల్వరి కొండ పైన వేలాడిన, ఏ నేరమూ ఎరుగని ఏసుక్రీస్తు ప్రవర్తన అందరినీ ఆశ్చర్యపరిచింది. తాను శిలువ మరణాన్ని అనుభవించడం 'తండ్రి చిత్తం' అని ఎరిగిన ఏసుక్రీస్తు తన తండ్రి పట్ల చూపించిన విధేయతను ఆ శిలువతో ప్రపంచానికంతటికీ చాటిచెప్పింది. పరమ తండ్రితో సంబంధాలను తెంచుకున్న మానవాళిని తిరిగి దేవునితో అనుసంధానం చేయడానికి ఆకాశానికి, భూమికి మధ్య, తూర్పు – పడమరలను కలుపుతూ తన చేతులు చాచి వేలాడిన యేసుక్రీస్తు తన శిలువ మరణం ద్వారా అనుసంధానకర్తగా, క్షమాపణ అనే వారధిని నిర్మించాడు. ప్రేమ, త్యాగం, క్షమాపణ, నిత్యత్వం అనే సరికొత్త పదాలకు తన జీవితం అనే అర్థాన్ని జోడించి, మానవ పదకోశంలోకి చేర్పించాడు క్రీస్తు. నేరస్తులంతా తిట్టేది మామూలు సంప్రదాయమైతే, ఏసుక్రీస్తు శిలువలో తన తండ్రిని ఉద్దేశించి చేసిన ప్రార్థన ఆనాడూ ఈనాడూ కూడా ఈ లోకంలోని ప్రతిమూలా ప్రతిధ్వనిస్తూనే ఉంది. 'తండ్రీ, వీళ్ళేం చేస్తున్నారో వీళ్ళకు తెలియదు, వారిని క్షమించు' అన్నది ఏసుక్రీస్తు ప్రార్థన. చుట్టూ ఉన్న వాళ్ళంతా ఆ ప్రార్థన విని ఉలిక్కి పడ్డారు. అనేకులు పశ్చాత్తాపంతో కుమిలిపోయారు. కానీ చరిత్రలో జరగరాని పొరపాటు అప్పటికే జరిగిపోయింది. శిలువ మరణశిక్షనంతటినీ ఒక రోమా సైన్యాధిపతి పర్యవేక్షిస్తున్నాడు. శిలువలో వేలాడుతున్న ఏసుక్రీస్తు ప్రార్థన, నమ్రత, విధేయత ఆ సైన్యాధిపతిని కలచివేస్తోంది. అతనికసలు ఏంచేయాలో అంతుపట్టడం లేదు. ఇలాంటి నిరపరాధిని శిలువ వేయాల్సిరావడం అతనికి మింగుడు పడటం లేదు. చుట్టూ ఉన్న సైనికులది కూడా అదే పరిస్థితి. ఆయన మరణించగానే భూమి కంపించింది. దేవాలయపు తెర అడ్డంగా చిరిగింది. అదంతా గమనిస్తున్న శతాధిపతిగా పిలువబడే ఆ సైన్యాధిపతి 'ఈయన నిజంగా దైవ కుమారుడు' అని సాక్ష్యం చెప్పాడు. (మత్తయి 27:54)

ఏసుప్రభువు మాట్లాడిన మాటలు చాలా తక్కువ. ఒక రోజున ఆయన తన శిష్యులతో ఈ విధంగా అన్నారు...

" ఎవరైనా నన్ను వెంబడించాలనుకుంటే తనకు తాను ఉపేక్షించుకొని, ప్రతి రోజూ తన శిలువను మోస్తూ నన్ను వెంబడించాలి. తన ప్రాణాన్ని రక్షించుకోవాలనుకునేవాడు దాన్ని పోగొట్టుకుంటాడు. నాకోసం తన ప్రాణాన్ని పోగొట్టుకునేవాడు దానిని కాపాడుకుంటాడు. లోకమంతా సంపాదించుకొని తనని తాను పోగొట్టుకున్నా నష్టపర్చుకున్నా ఏమి ప్రయోజనం చెప్పండి? "(లూకా 9:23–25). ఈ మాటలు లోకానికి ఈనాటి వరకూ అర్థం కాలేదనే చెప్పాలి. సంపాదనే లక్ష్యంగా బతికేవారు ఆ క్రమంలో ఏం పోగొట్టుకుంటున్నారో ఒకసారి బేరీజు వేసుకోవాలి. ఆయన అనుచరులుగా పిలువబడాలనుకునేవారి భుజాలమీద వారి శిలువ కనబడాలే కానీ, డబ్బులు, డాలర్ల మూటలు కాదని ఆయన అప్పుడే ఎంతో స్పష్టంగా చెప్పారు. ఎంత వీలైతే అంత 'రాబట్టుకోవడం' అనే ఆర్థిక సూత్రం ఇరుసుగా తిరిగే వ్యాపార ధోరణితో కూడిన లోకానికి, అంతా పోగొట్టుకొవడానికి సిద్ధంగా ఉండటమే అసలైన ఆత్మీయత విజయ సూత్రమని తన జీవితం ద్వారా చాటిచెప్పిన మహనీయుడు క్రీస్తు. ఆయన్ని శిలువ వేయించి చంపించిన ఆనాటి యూదు మతస్తులు, శిలువ వేసిన రోమా ప్రభుత్వం, 'శిలువ వేయండి' అంటూ కేకలు వేసి ఆయన్ని అపహాస్యం చేసిన అమాయక జనం... శిలువ మరణంతో ఆయన చరిత్ర ముగిసిపోయిందని తాత్కాలిక విజయోన్మాదంతో చంకలు గుద్దుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు. ఇది అప్పుడూ ఇప్పుడూ మనముందు జరుగుతున్నదే. కాని ఆయన మూడవ దినం పునరుత్థానుడవడం ఎవరూ ఊహించని విషయం. అనూహ్యమైన ఆయన పునరుత్థానం తరతరాలపాటు ఆయనను సజీవుడుగా నిలబెట్టింది. ఆయనలో మానవాళికంతటికీ నిత్యజీవాన్ని ప్రసాదించి పెట్టింది. మరణాన్ని చూపించి మనుషుల్ని భయపెట్టే సైతానుకు మాటలు దొరక్కుండా చేసింది. మరణానికి మానవుడిపైన పట్టు లేకుండా చేసింది. ఏసుక్రీస్తు తాను చెప్పినట్టే తన ప్రాణాన్ని కూడా పోగొట్టుకోవడానికి సిద్ధపడటం ద్వారా లోకాన్నంతటినీ తన తండ్రి కోసం సంపాదించాడు. అవమానానికి, ఓటమికి, ఎంతో బాధతో కూడిన మరణానికి నిదర్శనమైన ఏసుక్రీస్తు శిలువ మరణం పునరుత్థానానికి కారణంగా, విజయానికి చిహ్నంగా మారింది.


మొలకెత్తడానికి ముందు గోధుమ గింజ భూమిలో పడి చనిపోవడం అనేది, దాని జీవితానికి పరమార్థాన్నిస్తుందని, ఆ ప్రక్రియ ద్వారానే అది లోకానికి ప్రయోజనాన్నందించగలుగుతుందని ఏసుక్రీస్తు ఒకానొక సందర్భంలో బోధించారు. ఆ బోధనను శిలువలో తు.చ. తప్పకుండా అమలుపర్చారు. ఆయన కేవలం బోధలకు పరిమితమైనవాడు కాదు. తాను బోధించిన ప్రతి అంశాన్నీ తన జీవితంలో ఆచరించి మరీ

**మొలకెత్తడానికి ముందు గోధుమ గింజ భూమిలో పడి చనిపోవడం అనేది, దాని జీవితానికి పరమార్థాన్నిస్తుందని, ఆ ప్రక్రియ ద్వారానే అది లోకానికి ప్రయోజనాన్నందించ గలుగుతుందని ఏసుక్రీస్తు ఒకానొక సందర్భంలో బోధించారు. ఆ బోధనను శిలువలో తు.చ. తప్పకుండా అమలుపర్చారు. ఆయన కేవలం బోధలకు పరిమితమైనవాడు కాదు. తాను బోధించిన ప్రతి అంశాన్నీ తన జీవితంలో ఆచరించి మరీ చూపించాడు. ఆయనను పూర్తిగా అర్థం చేసుకున్న వారెవరూ సాధారణ ప్రజలుగా ఉండలేరు. సాధారణ ప్రజలుగా మిగిలిన వారెవరికీ ఆయన ఇంకా పూర్తిగా అర్థం కాలేదనే చెప్పాలి.**

“ఎవరైనా నన్ను వెంబడించాలనుకుంటే తనకు తాను ఉపేక్షించుకొని, ప్రతి రోజూ తన శిలువను మోస్తూ నన్ను వెంబడించాలి. తన ప్రాణాన్ని రక్షించుకోవాలనుకునేవాడు దాన్ని పోగొట్టుకుంటాడు. నాకోసం తన ప్రాణాన్ని పోగొట్టుకునేవాడు దానిని కాపాడుకుంటాడు. లోకమంతా సంపాదించుకొని తనని తాను పోగొట్టుకున్నా నష్టపర్చుకున్నా ఏమి ప్రయోజనం చెప్పండి?” (లూకా 9:23-25). ఈ మాటలు లోకానికి ఈనాటి వరకూ అర్థం కాలేదనే చెప్పాలి. సంపాదనే లక్ష్యంగా బతికేవారు ఆ క్రమంలో ఏం పోగొట్టుకుంటున్నారో ఒకసారి బేరీజు వేసుకోవాలి. ఆయన అనుచరులుగా పిలువబడాలనుకునేవారి భుజాలమీద వారి శిలువ కనబడాలే కానీ, డబ్బులు, డాలర్ల మూటలు కాదని ఆయన అప్పుడే ఎంతో స్పష్టంగా చెప్పారు. ఎంత వీలైతే అంత ‘రాబట్టుకోవడం’ అనే ఆర్థిక సూత్రం ఇరుసుగా తిరిగే వ్యాపార ధోరణితో కూడిన లోకానికి, అంతా పోగొట్టుకొవడానికి సిద్ధంగా ఉండటమే అసలైన ఆత్మీయత విజయ సూత్రమని తన జీవితం ద్వారా చాటిచెప్పిన మహనీయుడు క్రీస్తు.

చూపించాడు. ఆయనను పూర్తిగా అర్థం చేసుకున్న వారెవరూ సాధారణ ప్రజలుగా ఉండలేరు. సాధారణ ప్రజలుగా మిగిలిన వారెవరికీ ఆయన ఇంకా పూర్తిగా అర్థం కాలేదనే చెప్పాలి.

అందుకే చరిత్రలో ఆయనకున్న స్థానం తిరుగులేనిది. పేదవాడిగా



పుట్టి, అత్యంత నిరాడంబరమైన జీవితాన్ని అనుభవించి, ఎంతో సాదాసీదా మాటలతోనే లోతైన ఆత్మీయ భావాలను ప్రజలకు పంచి, నిరపరాధిగా శిలువలో మరణించి, పునరుత్థానుడైన ఏసుక్రీస్తు ఈనాటికీ అందరినీ తనవైపుకు ఆకర్షిస్తూనే ఉన్నాడు.

ఏసు శిలువ మోసిన మార్గంలో ఆయన ఆగిన ప్రతిచోటా ఒక ఆర్చి వంటి నిర్మాణం చేసి ప్రాముఖ్యత లిఖించారు. రక్తసిక్తమైన దేహంతో బలహీనుడైన ప్రభువు శిలువ మోయలేక పడిపోయారు. ఆ ప్రదేశంలో కూడా మరో నిర్మాణం ఉంది. ఆ శిలువ దారిలో ఆయన తల్లిని కలిసిన చోట ఒక ఆర్చిలో, తన కుమారుని చూసి దు:ఖిస్తున్నట్లుగా చక్కటి బొమ్మలు చెక్కారు. వెరోనికా అనే స్త్రీ తన చేతి గుడ్డతో ఆయన ముఖం తుడిచింది. ఆ బట్ట మీద ప్రభువు ముఖం ముద్రించబడింది. దీనిని రోమ్‌లోని సెయింట్ పీటర్స్ చర్చిలో భద్రపరిచారు.

రెండవ సారి పడిపోయిన చోట ఆయన మరణ శాసనం లిఖించబడి ఉంది. తర్వాత ఆయనను గొల్గాత కొండపై శిలువకు మేకులతో చేతులు, పాదాలు కొట్టి శిలువ వేశారు. ఆయనకు శిలువ వేసిన రోజు శుక్రవారం. ఆయన మరణించిన శుక్రవారాన్నే శుభ శుక్రవారంగా ఆచరిస్తున్నాము.

# ప్రపంచమంతా పునరుత్థాన ప్రార్థనలు

*యెరూసలెం నగరం నడిబొడ్డున ‘దమస్కు గుమ్మం’గా పిలిచే పాత పట్టణపు ద్వారాల్లో ఒక ద్వారానికి రెండు మూడు ఫర్లాంగుల దూరంలో ఏసు ప్రభువు సమాధి ఉంది. ఆ స్థలం నిజంగా ఆ పుణ్య దేశంలోని బైబిలు సంబంధిత స్థలాల్లోకెల్లా అత్యంత పవిత్రమైన స్థలం. మూడెకరాల స్థలంలో ఉన్న పచ్చని తోటలోని రాతి గుహలో శిలువ మరణం అనంతరం ఏసుప్రభువు వారి పవిత్ర భౌతిక కాయాన్ని ఉంచారన్న వాస్తవం ఆ ప్రాంతాన్ని సందర్శించే భక్తుల హృదయాల్లో అనిర్వచనీయమైన ఆత్మీయానుభూతుల్ని రేకెత్తిస్తుంది.*

శుభ శుక్రవారం సాయంత్రం అంటే యూదులు ఆచరించే విశ్రాంతి ఆరంభం కాక మునుపే, శిలువ మీద నుంచి ఏసుప్రభువు పార్థివ శరీరాన్ని దించి, అరిమతయియ యోసేపు అనే ధనవంతుడు, రహస్య విశ్వాసి తనకోసం ప్రత్యేకంగా తొలిపించుకున్న ఈ సమాధిలో ఉంచాడు. మరో రహస్య విశ్వాసి నికోదేము దాదాపు నూటాయాభై ఏళ్ళ సుగంధ పరిమళ ద్రవ్యాలను తీసుకువచ్చి ఆయన శరీరానికి పూశాడు. రాజులు చక్రవర్తుల భౌతిక కాయాలకు మాత్రమే ఇంత మొత్తంలో సుగంధ ద్రవ్యాలు పూస్తారు. అంటే ఒక నేరస్తుడిగా ముద్రవేసి యూదులు శిలువ వేసి శిక్షించిన ఏసుక్రీస్తుకు చక్రవర్తులు, సామ్రాజ్యాధిపతులతో సమానంగా అంత్యక్రియలు జరిగాయి.

సాధారణంగా శిలువపై మరణశిక్షకు గురైన నేరస్తుల శరీరాలు అసలు అంత్యక్రియలకే నోచుకోవు. కాని శిలువ మరణానికి గురైన ఏసుప్రభువుకు ఉచితమైన రీతిలో అంత్య సంస్కారం జరిగింది. వాళ్ళిద్దరూ ఆయన



శరీరాన్ని తీసుకువెళ్తూ ఉంటే, ఆయనకు అత్యంత ఆప్తులైన మగ్గలేనే మరియ, సలోమి మొదలైన స్త్రీలు భయంభయంతో వారిని వెంబడించి ఆయన్ను సమాధి చేసిన స్థలాన్ని చూశారు. ఆ వెంటనే విశ్రాంతి దినం గనుక ఏమీ చేయడానికి లేదు. అందువల్ల విశ్రాంతి దినం గడిచిపోయిన తరువాత ఆదివారం తెల్లవారు జామున ఆ స్త్రీలు ఏసుప్రభువు వారి సమాధి స్థలానికి మరికొన్ని సుగంధ ద్రవ్యాలు తీసుకొని వెళ్ళారు. ఆయన సమాధికి అడ్డంగా వారిద్దరూ పెట్టి వెళ్ళిన రాయి అప్పటికే దొర్లించబడి ఉంది. సమాధిలోకి తొంగి చూస్తే ఏసుప్రభువు వారి దేహం ఉండవలసిన స్థలంలో ఒక దేవదూత కనిపించి వారికి ఒక శుభ వర్తమానాన్ని ప్రకటించింది. ఏసుక్రీస్తు మరణాన్ని గెలిచి సజీవుడయ్యాడని ఆ విషయాన్ని ఆయన శిష్యగణానికి చెప్పమని ఆ దూత తెలియజేసింది.

రెండు వేల సంవత్సరాల క్రితం ఖాళీ సమాధి దగ్గర పుణ్య స్త్రీలకు ప్రకటించబడిన ఏసుక్రీస్తు పునరుత్థాన సందేశం ఇంకా ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో ప్రకటించబడుతోంది. అప్పటి పాలస్తీనా (ఇప్పటి ఇజ్రాయిల్) దేశాన్ని బ్రిటిష్ వారు పరిపాలిస్తున్న కాలంలో బ్రిటిష్ సైనికాధికారి మేజర్ జనరల్ చార్లెస్ జార్జిగార్డెన్ 1982లో ఈ స్థలాన్ని కనుగొన్నాడు. ఏసుప్రభువు మృతదేహాన్ని పాతిపెట్టిన సమాధికి సంబంధించి బైబిలులోని నాలుగు సువార్తల్లోనూ ఇవ్వబడిన వివరాలన్నీ ఈ స్థలంతో సరిపోలడంతో బ్రిటన్ దేశానికి చెందిన పలువురు బైబిలు పరిశోధకులు, వేదాంత నిపుణులు అనేక పరిశోధనలు జరిపి చివరికి ఏసుక్రీస్తును సమాధి చేశారని నిర్ధారించారు. ఆ స్థలమంతా ఒకానొక ధనవంతుడిదని చెప్పడానికి చాలా ఆధారాలున్నాయి. ఆ స్థలంలో కొన్ని లక్షల గ్యాలన్ల నీళ్ళు పట్టే నీటితొట్టిని భూగర్భంలో జరిపిన తవ్వకాల్లో కనుగొన్నారు. అప్పట్లో పెద్ద పెద్ద తోటల్లో వాన నీటిని భద్రం చేయడానికి ఇలాంటి భూగర్భపు నీటితొట్లు ఏర్పాటుచేసేవారు. ఏసుప్రభువును 'కపాలం' అనబడిన స్థలంలో శిలువ వేశారని బైబిలు చెబుతోంది. ఈ సమాధి స్థలం పక్కనే ఉండే చిన్న కొండ అచ్చం 'కపాలం'లాగే ఉంటుంది. ఆ కాలంలో నేరస్తులను ఊరికి వెలుపల కూడలి స్థలాల్లో ప్రజలందరికీ కనబడేలాగా ప్రజలకు నేరభీతి కలిగించేలాగ రోమా ప్రభుత్వం శిలువ వేసేది. బైబిలులో కూడా ఏసుప్రభువు శిలువలో వేలాడుతున్న సమయంలో ఆ దారిన వచ్చే పోయేవారు 'తనను తాను రక్షించుకోలేడు కాని మమ్మల్ని రక్షిస్తాడా?' అంటూ ఆయన్ను హేళన చేశారని రాసి ఉంది. ఈ స్థలం కూడా యెరికో నుంచి యెరూషలేము మీదుగా దమస్కు (సిరియా రాజధాని) పట్టణానికి వెళ్ళే ప్రధాన రహదారికి పక్కనే ఇలా బైబిలులో పేర్కొనబడిన అనేక వివరాలు ఈ స్థలంతో పోలుతూ ఉండటంతో ఇదే ఆయన సమాధి స్థలమని, ఇక్కడి నుంచే ఆయన పునరుత్థానుడయ్యాడని నిర్ధారించారు.

ఇంతకు మునుపే చెప్పినట్టుగా, ఆ తోటలోకి ప్రవేశించగానే ఎంతటి వారికైనా భయభక్తులతో కూడిన దైవికానుభూతి కలుగుతుంది. క్రైస్తవ మత విశ్వాసానికి పునాది అయిన ఏసుక్రీస్తు పునరుత్థాన సంఘటన జరిగిన ఆ స్థలంలో పాదం మోపడం, ఆయన భౌతిక కాయాన్ని ఉంచిన స్థలాన్ని కళ్ళారా సందర్శించి చేతులతో స్పర్శించే ఆశీర్వానుభూతిని మాటల్లో వర్ణించడం చేతకాదు.

భక్తుల కోసం 'గార్డెన్ టూంబ్'గా పిలిచే ఆ స్థలంలో అనేక సౌకర్యాలున్నాయి. 20 నుంచి 40 మంది వరకు భక్తులు కూర్చొని ప్రార్థనలు చేసుకోవడానికి వీలైన చిన్నచిన్న ప్రార్థనా మందిరాలు కూడా ఉన్నాయి. ఇజ్రాయిల్‌లో పవిత్ర స్థలాలన్నీ చూడటం ఒక ఎత్తైతే, 'గార్డెన్ టూంబ్'ని దర్శించడం మరొక ఎత్తు. ప్రభువు పునరుత్థానుడైన ప్రదేశంలో 'కమ్యూనియన్' ఆచరించడం నిజంగా ఆనందకరమైన అనుభవం. ఇజ్రాయిల్‌లో ఉండే నాలుగైదు రోజుల్లో అనేక స్థలాలు దర్శించవలసి ఉంటుంది గనుక పవిత్ర స్థలాలను త్వరత్వరగా సందర్శించడం సాధారణంగా జరిగే విషయం. కానీ 'గార్డెన్ టూంబ్'ను ఆ విధంగా దర్శించకుండా, కొంత సావకాశంగా దర్శించే విధంగా పర్యటనలో మార్పులు చేసుకోవడం మంచిది. ఈ స్థలంలో కొంత సమయాన్ని వ్యక్తిగత ప్రార్థన కోసం, ధ్యానం కోసం వెచ్చించడం చాలా ఆశీర్వాదకరం. అందుకే హోలీల్యాండ్ పర్యటనలో 'గార్డెన్ టూంబ్' సందర్శన ఒక ప్రత్యేక ఆకర్షణ! జీవితంలో ఒక్కసారైనా చూసి తరించవలసిన క్రైస్తవ పుణ్యస్థలాల దేశం ఇజ్రాయిల్! ◆



# అందరూ హాయిగా ఉండాలంటే...

పర్యావరణం అంటే మనం. మనం నివసించే ప్రదేశాలలో ఉండే ప్రాంతాన్ని పరిసరాలు అంటారు. పరిసరాలందు వ్యాపించియున్న గాలి వాతావరణం. మన పెద్దల మాటల్లో చెప్పాలంటే పంచ మహాభూతాల్లో ఇమిడి వున్నది పర్యావరణం.

మానవుడు కూడా పర్యావరణంలో ఒక భాగమే. మనిషి జీవితం ప్రకృతి మీద ఆధారపడి ఉంది. ఈ ప్రపంచంలో మానవ మనుగడ కోసం ఎన్నో వనరులు ఉన్నాయి. వీటిలో ప్రకృతిలో కొన్ని సహజంగా లభించేవి. మరికొన్ని మానవుడు తయారు చేసుకునేవి. ప్రకృతిలో సహజంగా లభించే వాటిని సహజ వనరులు అని అంటారు. సహజ వనరుల్లో ఖనిజాలు, భూమి, గాలి, నీరు, అడవులు ముఖ్యమైనవి. వీటి ద్వారా మనకు ఇంధన శక్తి, విద్యుచ్ఛక్తి వంటివి లభిస్తున్నాయి. భూమి లోపలిపొరల నుండి మనకు ఇంధనశక్తి లభిస్తోంది. బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు వీటిలో ముఖ్యమైనవి.

భూమి మీద నున్న జీవరాశికి సహజవనరులతో పాటు ప్రకృతి వనరులు అంటే గుహలు, కొండలు, నదులు, పర్వతాలు, జలపాతాలు కూడా ఎంతో ఉపయోగపడుతున్నాయి. మనిషి సుఖమయ జీవితానికి పర్యావరణం సమతుల్యంగా ఉండటం ఎంతో అవసరం. విజ్ఞానం సంపాదించి క్రొత్త క్రొత్త పద్ధతుల ద్వారా సహజ వనరులను అపరిమితంగా వాడుకోవటం, ప్రకృతి వనరులను నాశనం చేయడం అంటే కొండలు త్రవ్వడం, చెట్లు కొట్టివేయడం వల్ల అవి త్వరగా అంతరించిపోవడమో, పనికి రాకుండా పోవడమో జరుగుతుంది. మానవుడి అదుపు తప్పిన అవసరాలతో సహజ వనరులు. ప్రకృతి వనరులు, మందు తరాలకు కనపడకుండా తరిగిపోవచ్చు.

ప్రకృతి సిద్ధ కారణాల వల్ల లేదా మానవ కార్యకలాపాలవల్ల పర్యావరణంలో జరిగే మార్పులను కాలుష్యం అంటారు. ఇంకో మాటలో చెప్పాలంటే పర్యావరణం సహజ స్థాయిలో చెడు ప్రభావం చూపే మార్పులను కూడా కాలుష్యం అనొచ్చు. భారత పర్యావరణ రక్షణ చట్టం (1986) ప్రకారం పర్యావరణంలో జీవులకు హాని కలిగే స్థాయిలో వున్న ఏదైనా ఘన, ద్రవ, వాయు పదార్థాలను కాలుష్యకారకాలు అంటారు. కాలుష్యాన్ని నివారించడానికి అంతార్జాతీయంగా పరస్పరం సహకరించుకోవటం అవసరం. సహజ కాలుష్యం ప్రకృతి సంబంధిత అడవి మంటలు, అగ్ని పర్వత పేలుళ్ళు, పుప్పొడి రేణువుల వల్ల జరుగుతుంది. కృత్రిమ కాలుష్యం వాహనాల పొగ, మురికినీరు వంటి మానవ కార్యకలాపాలవల్ల కలిగేది.

మానవుని జీవితంపై పరిసరాల కాలుష్య ప్రభావం ఉంటుంది. అనారోగ్యానికి కారణం అవుతుంది. గాలి, నీరు, ఆహారం కలుషితమైతే భూమిపై ప్రాణికోటి స్వల్పకాలమే బ్రతుకుతుంది. నివాసానికి, ఆహార ఉత్పత్తికి నేల, ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు గాలి, ప్రాణాధారం, దాహం కోసం, నీరు, వెలుతురు కోసం నిప్పు, గ్రహనక్షత్రాదుల చలనానికి నింగి సహకరించినప్పుడే ప్రాణులు చక్కగా జీవిస్తాయి. వీటిల్లో ఏ ఒక్కటి చెడిపోయినా, అంటే కలుషితమైనతే, అది ప్రాణాంతకమే అవుతుంది.

మానవుడు తన జీవితాన్ని సుఖంగా గడుపుకోవడానికి ముందు కూడు, గుడ్డ, గూడు కోరుకుంటాడు. తర్వాత ఇంకా సుఖంగా ఉండడానికి ఏవేవో వస్తువులు ఉంటే బాగుంటుందని కోరుకుంటాడు. ఖండాంతరాలలో శాస్త్రవేత్తలు నిర్విరామ కృషితో పరిశోధనలు చేస్తున్నారు. వివిధ శాఖలలో జరిపిన పరిశోధనల ఫలితాలను నేడు మనం అనుభవిస్తున్నాం. సైకిళ్ళు, స్కూటర్లు, మోటారు వాహనాలు, కార్లు, విమానాలు, ఓడలు, పడవలు ఇలా రకరకాల ప్రయాణసాధనాలు తయారు చేసుకోగల్గుతున్నాం. వార్తా పత్రికలతో ప్రారంభమై రేడియో, టెలివిజన్, టెలిఫోన్, టెలిగ్రాఫ్, సినిమా, ఫ్యాక్స్ మొదలైన సాధనాల ద్వారా వార్తలు ఎప్పటికప్పుడు తెలుసుకోగల్గుతున్నాం. ఫ్యాన్లు, ఎయిర్‌కూలర్లు, ఏ.సి.లు, హీటర్ల వల్ల మానవుడు సుఖంగా బ్రతుకుతూ జీవితాన్ని స్వర్గం చేసుకున్నాడు.

అణ్వాయుధాలు తయారు చేసి ఆధిపత్యానికి పోరాడుతున్నాడు. గ్రహాంతర యానం చేస్తున్నాడు. గుండెమార్పిడి, నేత్రాల అమరిక వంటి క్రొత్త వైద్య విజ్ఞానం వల్ల ఆయువు పెంచుకున్నాడు మానవుడు.

ఏదైనా హద్దులు మీరితే నష్టాన్ని, బాధను కల్గిస్తుంది. అణ్వస్త్రప్రయోగంతో దేశాలు నశిస్తున్నాయి. కర్మాగారాలు ఎక్కువయి వాతావరణ కాలుష్యం ఏర్పడుతోంది. ప్రాణుల మనుగడకు నష్టం వాటిల్లుతుంది. క్లోరోఫ్లోరా కార్బన్ వాయువును కనుగొని ఫ్రిజ్‌లు తయారుచేసి వాడుకోవడం వల్ల వాతావరణంలోని ఓజోన్ పొర చిల్లులు పడి, సూర్యుని నుండి వచ్చే అతినీలలోహిత కిరణాలు భూమిని చేరుకోవడం వల్ల కాన్సర్ లాంటి చర్మ వ్యాధులు పంటల నష్టం జరుగుతుంది. అలాగే రసాయనిక ఎరువులు, మందుల వల్ల అధిక పంటదిగుబడి వచ్చినా నేల నిస్సారమైపోయి, రసాయన నిరోధకంగా తయారయి, తర్వాత పంటలు పండించుకోవడానికి అవకాశాలు తక్కువవుతాయి.

ఎన్ని ప్రయోగాలు చేసినా కుష్టువ్యాధిని కొంతవరకు రూపుమాపగల్గినా క్షయలాంటి వ్యాధులు మళ్ళీ మళ్ళీ మానవుడి మీద ఆధిపత్యం

**సముద్రాలలో జరిగే త్రవ్వకాల వల్ల కూడా సముద్రపు నీరు కాలుష్య భరితమవుతుంది. ఆయిల్ నిక్షేపాల త్రవ్వకాల వల్ల మానవుని సుఖమయ అవసరాలకు ఉపయోగపడినా, అది మనకు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఉపయోగపడినా, పర్యావరణానికి పెను ప్రమాదం కల్గిస్తుంది.**

కొనసాగిస్తున్నాయి. క్రొత్తకొత్త వ్యాధులు విజృంభించి మానవుడి మేధస్సుకి పరీక్ష పెడ్తున్నాయి. విజ్ఞానశాస్త్రం దినదినాభివృద్ధి చెందవచ్చు. దాని ఫలితాలు మానవ వినాశనానికి, వాతావరణ కాలుష్యానికి కారణం కాకూడదు. వాతావరణం కలుషితమైతే భూమిపై ప్రాణికోటి స్వల్పకాలమే బ్రతకగల్గుతుంది.

**మనకు ప్రమాదాన్నిచ్చే కాలుష్యం నాలుగు రకాలుగా ఉంటాయి అవి :**

- నీటి కాలుష్యం
- శబ్దకాలుష్యం
- గాలి కాలుష్యం
- నీటి కాలుష్యం

ప్రాణాధారమైనది నీరు. నీటిలో కలుషిత పదార్థాలైన చెత్తా, చెదారం, దుమ్ము చేరి అది పాడవుతుంది. చెరువులో బట్టలు ఉతకడం, పశువుల్ని కడగడం, స్నానాలు చేయడం వంటి పనుల వల్ల జలకాలుష్యం ఏర్పడి ఆ నీటిని త్రాగడం వల్ల అనారోగ్యమేర్పడుతుంది. చెడు నీటిలో ఫ్లోరిన్ ఎక్కువై, త్రాగిన వారికి శ్వాసకోసవ్యాధులు, అంగవైకల్యం వంటి వ్యాధులు వస్తాయి. కర్మాగారాలు వదిలే రసాయన నీరు కాలువల్లోకి వదలడం కూడా నష్టమే. మంచినీటి పైపులు దెబ్బతిని వాటిలోకి మురుగు నీరు చేరి కలిసిపోయి ఆ నీరు త్రాగినవారికి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది.

**శబ్ద కాలుష్యం**

దీనికి మనమే సృష్టించుకొంటున్నాం. ఆనందం కోసం టి.వి., టేప్, మైక్‌సెట్లు, రేడియో ఎక్కువ ధ్వనితో వాడడం వల్ల మనకి తెలియకుండానే కొంత కాలానికి వినికిడి శక్తిని కోల్పోతాం. ఫ్యాక్టరీలో యంత్రాల చప్పుళ్ళు, వాహనాలు వ్యర్థమైన గాలిని వదిలే శబ్దం, బాణసంచా వంటివి కూడా ధ్వని కాలుష్యం సృష్టిస్తున్నాయి. దీనివల్ల గుండెదడ, అజీర్తి, అసహనం, విసుగు, కోపం ఎక్కువై ఆరోగ్యాన్ని పాడు చేస్తాయి.

**గాలి కాలుష్యం**

చెట్లు బొగ్గు పులుసు వాయువును పీల్చుకొని ప్రాణవాయువును వదిలి మనల్ని బ్రతికిస్తున్నాయి. నిత్యావసరాలకు చెట్లను విరివిగా నరికివేయడంతో ప్రాణవాయువు శాతం తగ్గిపోతున్నది. పెరుగుతున్న వాహనాలు వదిలే



వ్యర్ధవాయువు గాలిలో కలిసి వాతావరణం కలుషితమవుతుంది. కర్మాగారాలు, పిండిమరలు వదిలే వాయువు వల్ల వాతావరణం కలుషితమవుతుంది. ఇప్పటి వరకూ మానవ కార్యకలాపాల వల్ల పర్యావరణంలో జరిగే మార్పులు పరిశీలించాం కదా. ఇక ఇప్పుడు ప్రకృతి సిద్ధంగా జరిగే కారణాల వల్ల పర్యావరణంలో జరిగే మార్పులను చూద్దాం. భూకంపాలు, అగ్నిపర్వతాలు బ్రద్ధలవడం మొదలైన విపత్తుల వల్ల కూడా వాతావరణం కాలుష్యమై పర్యావరణానికి నష్టం జరుగుతుంది.



**అగ్ని పర్వతం**

ఇది ఒక రకమైన పర్వతం. పర్వతం అంటే కొండ. దీని మధ్యలో చాలా ఎక్కువ ఉష్ణోగ్రతలో లావాద్రవం ఉంటుంది. అందువల్ల వీటని అగ్ని పర్వతాలు అంటారు. ఇవి అప్పుడప్పుడు పగిలి ఈ లావా బయటికి ప్రవహిస్తుంది. దట్టమైన పొగ, విపరీతమైన వేడి, మంటలు వస్తాయి. ఇవి సుదూరప్రాంతాలకు కూడా విస్తరించి అధిక ప్రాణనష్టం, వాతావరణంలో కాలుష్యం ఏర్పడుతుంది. ఇది పర్యావరణానికి ఎంతో నష్టం కలిగిస్తుంది.

**భూకంపాలు**

భూమి లోపల జరిగే మార్పుల వలన, తీవ్రమైన వత్తిడిని భూమి బయటకు పంపే స్థితిలో భూకంపాలు ఏర్పడతాయి. భూకంపాల వల్ల పెద్ద పెద్ద భవనాలు, వంతెనలు, నిర్మాణాలు, ఇళ్లు కూలిపోతాయి. ప్రాణ నష్టం కలిగిస్తాయి. వాయు కాలుష్యం ఏర్పడుతుంది.

**చమురు కోసం**

సముద్రాలలో జరిగే త్రవ్వకాల వల్ల కూడా సముద్రపు నీరు కాలుష్య భరితమవుతుంది. ఆయిల్ నిక్షేపాల త్రవ్వకాల వల్ల మానవుని సుఖమయ అవసరాలకు ఉపయోగపడినా, అది మనకు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఉపయోగపడినా పర్యావరణానికి పెను ప్రమాదం కల్గిస్తుంది.

పర్యావరణ కాలుష్యం ఎంత ప్రమాదం కలుగచేస్తుందో తెలుసుకున్నాం కదా. కాలుష్యాన్ని అదుపులో పెట్టడానికి (తగ్గించడానికి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 1975లో నీటి చట్టాన్ని శాసనసభలో ప్రవేశపెట్టింది. తరువాత 1976 జులై 22న నీటి కాలుష్య నియంత్రణ మండలి ప్రారంభించింది. ప్రభుత్వం 1984 లో ఈ మండలికి గాలిలోని కాలుష్యాన్ని నియంత్రించే బాధ్యతను కూడా అప్పగించింది. ఆ తరువాత బోర్డు పేరు 'ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి' గా మారింది.

మన రాష్ట్రంలో అన్ని రకాల కాలుష్యాన్ని నియంత్రించడమే ఈ సంస్థ ధ్యేయం.

ఆంధ్రప్రదేశ్ పర్యావరణ రక్షణ, శిక్షణ, పరిశోధనా సంస్థ, ఆంధ్రప్రదేశ్ కాలుష్యనియంత్రణ మండలి 1999లో మన రాష్ట్రంలో పర్యావరణ పరిస్థితులను అధ్యయనం చేసి ఒక నివేదిక ప్రచురించాయి. నివేదికలో కొన్ని అంశాలను సంక్షిప్తంగా పరిశీలిద్దాం. ఈ నివేదికలో ప్రకృతి వనరుల గురించి కూడా తెలియచేశారు. మానవ కార్యకలాపాలు మరియు ఇతర కారణాల వల్ల ప్రకృతి వనరులకు జరిగే నష్టం, దీన్ని నివారించటానికి ప్రతిపౌరుడు, ప్రభుత్వం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఉన్నాయి.

నిర్ణీతకాలంలో పరిశీలన జరుపుతూ పరిస్థితులలో మార్పులు ఏమైనా జరిగినా కాలుష్యాన్ని నియంత్రించ గల్గుతున్నామా లేదా మన చేయి దాటిపోతుందా అని చూసుకోవాలి. ఈ నివేదికలు రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలు, గ్రామస్థాయిల్లో విస్తృతంగా అందుబాటు కావాలి.

నీటి వనరులు, అడవులు, కోస్తాతీరప్రాంతాలలో పరిస్థితులు గాలి,



శబ్దకాలుష్యం, ఆరోగ్యం, రవాణా, పర్యటన, గనులలో పర్యావరణం, కర్మాగారాలు, భూగర్భంలోని పరిస్థితులు, వనరులు, సముద్రాలు, పర్యావరణం, చెత్తా, చెదారం మొదలైన అంశాల ఆధారంగా నివేదిక రూపొందించారు. కొన్ని ముఖ్యమైన విషయాలను అంశాల వారిగా పరిశీలిద్దాం.

భూమి లోపల జరిగే అనేక మార్పుల వల్ల భూమి పైన వత్తిడి పెరుగుతుంది. కొండలు త్రవ్వడం వల్ల, అడవులు నరికివేయడం వల్ల వ్యవసాయ భూములను నివాస ప్రదేశాలుగా మార్చడం వల్ల, భూమి తన అస్థిత్వాన్ని కోల్పోతుంది. నగరాలు నానాటికీ విస్తరిస్తూ, వ్యవసాయ భూములు తరిగిపోతున్నాయి. ఈ కారణాల వల్ల భూవాతారణం దెబ్బతింటుంది. దీనికి తగు జాగ్రత్తలు ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలు, ప్రజలు తీసుకోవాలి.

రాను రాను సాంప్రదాయ ఎరువుల వాడకం తగ్గిపోయి పొలాల్లో రసాయనిక మందులు, రసాయనిక ఎరువుల వాడకం వల్ల పొలాల్లో నీటి సాంద్రత తగ్గి, పంటల దిగుబడి తగ్గుతుంది. ఇలా ఉత్పత్తి అయిన ఆహారధాన్యాలు తినడం వల్ల జంతువులకు, మనుషులకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఇది చాలా బాధాకరమైన విషయం. వ్యవసాయ రంగంలో పరిశోధనా సంస్థలైన ఇక్రిశాట్, క్రిడా, వ్యవసాయ విశ్వవిద్యాలయం కొత్త కొత్త పద్ధతులు, కొత్త పంటలు, మొక్కలు కనుగొంటాయి. వీటిని ప్రజలకు తెలియచేసేందుకు ప్రయత్నించాలి.

నదులు, కాలువలలోని నీరు కర్మాగారాలు వదిలే రసాయనిక పదార్థాలు నగర పారిశుధ్య నీరు, పొలాల్లో నుండి వచ్చే రసాయనిక ఎరువుల వల్ల కలుషితమై పోతుంది. ప్రపంచం నలువైపుల నుండి రకరకాల పక్షులు వచ్చి విడిది చేసే కొల్లేరు సరస్సు నేడు కలుషితమైపోయింది. హైదరాబాదు సిటీ నడిబొడ్డున వున్న హుస్సేన్‌సాగర్ ఎంత కలుషితమై పోయిందో వేరే చెప్పనక్కరలేదు. భారీ నీటి ప్రాజెక్టుల గురించి ప్రయత్నిస్తున్నారు. కానీ, గ్రామాల్లో నీళ్ళ ట్యాంకులు, చిన్నతరహా ప్రాజెక్టులు కూడా చాలా అవసరం. రాను రాను భూగర్భనీరు తరిగిపోయి ముందు తరాలకు నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది.

గాలి కాలుష్యం వల్ల మానవులకు శ్వాసకోశ వ్యాధులొస్తాయి. మానవుడు చేసే పనులు వల్ల అంటే నగరాలు పెరిగిపోవడం, కర్మాగారాలు ఎక్కువగా స్థాపించడం రోజు రోజుకు పెరుగుతుంది. వాహనాల వల్ల వచ్చే పొగ ఈ వాయుకాలుష్యానికి ప్రధాన కారణం. ప్రణాళికాబద్ధంగా లేని కట్టడాల వల్ల ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. శబ్ద కాలుష్యం పెరుగుతుంది. రవాణా సంస్థలకు, కర్మాగారాలకు వారు తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి కాలుష్య నియంత్రణ మండలి పర్యవేక్షణ, తనిఖీలు ఉండాలి.

నగరాలు పెరిగిపోవడం వల్ల మురికివాడలు పెరిగిపోతున్నాయి. దీనిలో నివసించే ప్రజలు కనీస శుభ్రత పాటించలేక పోతున్నారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి బహిర్భూమిని ఉపయోగిస్తారు. ఈ పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో కూడా కన్పిస్తుంది.

1996లో ఇ.పి.టి.ఆర్.ఐ ప్రచురించిన ఎస్.ఒ.ఎ నివేదిక హైదరాబాద్‌లో ఉన్న ఎన్నో సమస్యలను బయటపెట్టింది. ప్రజలకు నీటి వసతి చాలినంత లేదు. ప్రణాళికా బద్ధంగా ఇళ్ళు నిర్మించుకోవడం, మొక్కల పెంపకం, ప్రభుత్వ రవాణా వ్యవస్థను ఎక్కువగా వాడుకోవడం, చారిత్రక కట్టడాలను సంరక్షించు కోవడం, కాలువలు, నదులు పరీవాహక ప్రాంతంలో ఆక్రమణలు తొలగించడం, ఇక ముందు కట్టకుండా ఆపడం వంటి చర్యల్ని ఈ నివేదిక సూచించింది.

కర్మాగారాలు, పరిశ్రమలు పారవేసే వ్యర్థపదార్థాలు పర్యావరణానికి చాలా ముప్పు కలిగిస్తాయి. వీటిని నియంత్రించాలి. ఎ.పి.పి.సి.బి. కొన్ని చర్యలను సూచించింది. వాటిలో ఒకటి కర్మాగారాలు, పరిశ్రమలు వాటి వ్యర్థాలను మున్సిపాలిటీల ద్వారా తరలించాలి. ప్లాస్టిక్ సంచుల వల్ల ప్రకృతికి చాలా ముప్పు కలుగుతుంది. వీటి వాడకాన్ని నియంత్రించాలి.

వ్యర్థపదార్థాలు గాలి, నీరును కూడా కలుషితం చేస్తాయి. వీటి వల్ల మానవుడిని ఆరోగ్య సమస్యలు బాధిస్తున్నాయి. పరిసరాలలో గాలి, నీటి కాలుష్యం, వ్యవసాయం, పరిశ్రమలలో రసాయన కాలుష్యం మనిషి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. నీటిని శుభ్రపరచడం, ఆరోగ్యకర పరిస్థితులు కల్పించడంలో బాధ్యతాయుతంగా మసలుకోవాలి.

రవాణా, పర్యాటక రంగం కూడా గాలి కలుషితం కావటానికి కారణమవుతున్నాయి.

గనుల త్రవ్వకాల వల్ల పర్యావరణం దెబ్బతింటుంది. అధిక సంఖ్యలో అవసరానికి మించి గనులు త్రవ్వకాల వల్ల గాలి కాలుష్యం అవడంవల్ల అక్కడున్న గిరిజనుల సాధారణ జీవనం గడపలేరు.

1999లో ఎస్.ఒ.ఎ. నివేదిక తర్వాత వచ్చిన 2003 ఎస్.ఒ.ఎ., నివేదిక ప్రభుత్వం, ప్రజలు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా చర్చించింది. కోస్తా తీర ప్రాంతాల్లో, ముఖ్యంగా విశాఖపట్టణం, కాకినాడలలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇది ఆయా పట్టణాల నుండి వచ్చే వ్యర్థపదార్థాల వల్ల జరుగుతుందని గమనించారు.

**నదులు (నదీజలాలు)**

నేల, నీరు అడవులు, ఖనిజసంపద వంటివి ప్రకృతి ప్రసాదాలు. వ్యవసాయం ప్రధాన వృత్తిగా గల భారత దేశంలో గంగ, గోదావరి, కృష్ణా వంటి ఎన్నో నదులున్నాయి. దేశంలోని నదీజలాలలో సుమారు 15 శాతం మన రాష్ట్రంలో వున్నాయి. దేశంలోని నదీ జలాలు కలుషితం కాకుండా, వ్యర్థం కాకుండా కాపాడటం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చు.

నదీ జలాలను కాలువల ద్వారా మళ్ళించి వ్యవసాయానికి వాడుతున్నారు. పట్టణాలలో పల్లెలో మంచినీటికి నదీజలాలే అవసరం. వర్షాకాలంలో కురిసిన నీరు నదుల నుండి సముద్రాలకు చేరుతుంది. అంటే మనదేశంలో 80 శాతం నదీజలాలు సముద్రం పాలవుతున్నాయి. నదుల ద్వారా కొట్టుకు వచ్చే ఇసుక, ఒండ్రు మట్టి కలిసిన నేలలు ఒండ్రు మృత్తికలు అని పిలవబడతాయి. కృష్ణా, గోదావరి, పెన్నా నదీ డెల్టాలోని ఈ నేలలు చాలా సారవంతమైనవి కాగా, అతివృష్టి వలన నదులకు వచ్చే వరదల వల్ల సారవంతమైన నేలలు నిస్సారంగా మారుతున్నాయి. నదులు వరదలు కారణంగా పల్లపు ప్రాంతాలు మునిగిపోతున్నాయి. పంటలు నాశనమవుతున్నాయి. రవాణా సౌకర్యాలు దెబ్బతింటాయి. నదీజలాలను క్రమపద్ధతిలో కాలువల ద్వారా మళ్ళించి కరకట్టలకు ఎప్పటికప్పుడు

అవసరాన్ని బట్టి మరమత్తులు చేస్తూంటే వరదల వల్ల కలిగే నష్టాన్ని అరికట్టవచ్చు.

నగరాల చుట్టూ పరిశ్రమలు విస్తరించడం వల్ల, ఒకేచోట ఉండటం వల్ల ఆ ప్రాంతంలో వాయు కాలుష్యం ఎక్కువైపోతుంది. ఎక్కడికక్కడ కాలుష్యాన్ని శుద్ధిచేసి బయటకు పంపడం వల్ల పర్యావరణం మెరుగవుతుంది. ప్రతి పరిశ్రమలోను వ్యర్థపదార్థాలను శుద్ధి చేసే ప్లాంట్లను నెలకొల్పాలి.

మున్సిపాలిటీలు, పంచాయితీలు చెత్తను బహిరంగ ప్రదేశాలలో పారపోయకుండా వాటిని నేలలో పాతిపెట్టాలి. ఎస్.ఒ.ఎ నివేదికలో రూపొందిన జాగ్రత్తలు తీసుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి.

## పర్యావరణ పరిరక్షణకు మార్గాలు

**పర్యావరణం ఎంత ప్రమాదంలో పడిందో గమనించాం కదా! దీని పరిరక్షణకు మన వంతు సాయం చేద్దాం. నేను ఏం చేయగలను అనుకోకుండా ప్రతి ఒక్కరూ వీలయినంత వరకు చేయవలసిన పనులు యిలా వుంటాయి.**

1. ఇళ్ళలో వాడే ఇంధనాన్ని తగ్గించి, దానికి ప్రత్యామ్నాయంగా గోబర్‌గ్యాస్, సూర్యకిరణశక్తి వాడటం.
2. బట్టలను వాషింగ్ మిషన్‌లలో ఉతకడం వల్ల కార్బన్‌డైయాక్సైడ్ తయారయి వాతావరణంలో కలుస్తుంది. దానికన్నా నీటిలో ఉతికి ఎండలో ఆరవేడం వల్ల మంచి జరుగుతుంది.
3. సాధారణ బల్బులు ఇంట్లో వేడిని పెంచుతాయి. వాటి స్థానంలో ప్రస్తుతం వస్తున్న సి.ఎఫ్.ఎల్ బల్బులు వాడాలి. తక్కువ వేడి వస్తుంది.
4. బయోప్యూయల్ వాడకాన్ని పెంచాలి. మొక్కజున్న, సోయాబీన్, ఇతర ఆర్గానిక్ పదార్థాల నుండి తయారైన ఇంధనం అతి తక్కువ కార్బన్‌లను విడుదల చేస్తుంది.
5. సాధ్యమైనంత వరకు ఆఫీసు, ఇల్లు దగ్గరవుండేటట్లు చూసుకోవాలి. ప్రయాణాల వల్ల పర్యావరణానికి ప్రమాదం.
6. ప్రైవేటు వాహనాల వల్ల, వ్యక్తిగత వాహనాల వల్ల పర్యావరణంలోకి కార్బన్‌డయాక్సైడ్ అధికంగా విడుదలవుతుంది. భారీ వాహనం ఒకటి వదిలే కాలుష్య పదార్థాలను రెండు చిన్న వాహనాలు వదిలే కాలుష్యంతో సమానం. కాబట్టి వీలయినంతవరకు బస్సుల్లో ప్రయాణించడం ఉత్తమం.
7. మరీ ముఖ్యంగా ప్లాస్టిక్ వస్తువులకు వాడటం నిషేధించాలి.
8. ఇంటి చుట్టంతా, బాల్కనీలో చెట్లను పెంచాలి. ◆



ప్రతి సంవత్సరం మే 5వ తేదీన పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు.

వాతావరణం చక్కగా పరిశుభ్రంగా వుంచటానికి మానవ ప్రయత్నాలు పూర్తి స్థాయిలో చేయాలి. మన ఇల్లే వైకుంఠం, మన వాకిలే కైలాసం అనుకొని మన ఇంటిలోని చెత్తా చెదారాలను పక్క వాళ్ళింట్లో పడేసి ఏమీ ఎరగనట్లు వుండటం సబబుకాదు. భవనాల నిర్మాణం కోసం చెట్లు కొట్టేస్తారు. రోడ్లు వెడల్పు చేయడానికి చెట్లు కొట్టేస్తారు. ఎలక్ట్రిక్ తీగకు అడ్డు వస్తాయని చెట్లు కొట్టేస్తారు. తాజా గాలి, చల్లటినీడ మనకి, పక్షులకు కరువైపోతున్నాయి. మనకి అవసరం లేదు అనగానే ఎక్కడపడితే అక్కడ ఆ వస్తువును పారవేయడంలో వెనకాడరు. అరటిపండు తొక్కలు, కాగితాలు, ప్లాస్టిక్ సంచులు రోడ్ల మీద విహారం చేస్తుంటాయి. చీకట్లో తిరిగేటప్పుడు అవే ప్రమాదం కలిగిస్తాయి.

మన కాళ్ళు, చేతులు పనిచేస్తున్నంతకాలం మన పని మనమే చేసుకోవాలి అనుకుంటే శుభ్రత అలవాటవుతుంది. ఇంట్లో వున్న వాళ్లందరూ ఈ ఇల్లు మనది. దీన్ని శుభ్రంగా వుంచుకోవాలి అనుకోవాలి. బడికి వెడితే బడి మనది, పార్కుకి వెడితే ఈ పార్కు మనదే అని అనుకుంటూ సేదతీరుతాం. గుడికి వెళ్ళినా, సినిమాహాలుకి వెళ్ళినా అదే భావంతో వుండి మన పిల్లలకి కూడా అదే నేర్పించాలి. ఈ మధ్య ఓ పత్రికలో చూచాను ఓ ప్రాంతంలో పర్యావరణ పరిశుభ్రత గూర్చి జాగ్రత్తలు చెబుతూ, ప్లాస్టిక్ సంచులు తింటే పశువులకు వ్యాధులొస్తాయని చెపితే అక్కడ నివసిస్తున్న ఒకావిడ పొలాలలో వున్న అన్ని ప్లాస్టిక్ సంచులు ఏరుకొచ్చి దిండులా కుట్టిందట. ఇలా ఎవరికి వారే చైతన్యవంతమై తమంతటతాము తమ పనులు సక్రమంగా నిర్వహిస్తే ఒక్కొక్క అంశానికి ఒక్కో రోజు నిర్ణయిస్తూ మానవుడి చెవిలో బాకా వూదే శ్రమ తగ్గుతుంది.

### పర్యావరణ పరిరక్షణ

పర్యావరణ పరిరక్షణ అంటే మనం మనల్ని, మన పరిసరాలని, చెట్టు, పుట్టా, గాలి, నీరు, కొండాకోన, వాగు వంకా ముఖ్యంగా మన రేపును, భవిష్యత్తును సంరక్షించుకునేందుకు నిరంతరం చేయాల్సిన ఒక వ్రతం. అందరూ చల్లగా వుండాలనే చల్లని భావనే పర్యావరణం పరిరక్షణకు దోహదపడుతుంది.

ప్రపంచ పర్యావరణంలో విచిత్రమైన మార్పులు జరుగుతున్నాయి. సముద్రాలలో నీటి మట్టం పెరిగిపోతోంది. ఆస్ట్రేలియా దేశంలో కరువు పరిస్థితి ఎంత తీవ్రంగా వుందంటే ఓవైపు ఎడారి ఒంటెలు దాహం కోసం అల్లాడుతున్నాయి. ఇంకోవైపున పెద్దఎత్తున అడవులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. దీనితో ఎండతీవ్రత విపరీతంగా పెరిగిపోయింది. హిమాలయాల్లోని హిమానీ నదులు కరిగిపోతున్నాయి. చలికాలం రాగానే మంచుతో కప్పబడి వుండే పర్వతాలు ఇంకా పచ్చటి గడ్డితోనే కన్పిస్తున్నాయి. తీరప్రాంతాలను తాకే తుపానుల వేగం పెరుగుతోంది. ఒక ప్రక్క తుఫానుల తీవ్రత పెరుగుతూ, మరో ప్రక్క త్రాగునీరు లభించక కటకట లాడుతున్నాయి. పర్యావరణం ఈ రకంగా అతి భయంకరంగా మారటం వెనుక మానవుడు ప్రకృతితో చెలగాటమాడటం కారణం. అనేక సంస్థలు స్వచ్ఛందంగా పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నాయి. నిస్వార్థంగా పర్యావరణం కోసం చేస్తున్న ప్రయత్నాలకు తోడు ప్రభుత్వాలపై కూడా ఒత్తిడి తెస్తున్నాయి.

**– ఆర్. రాజమణి** (అనువాదం : టి. నర్మద)



భారత రాజ్యాంగ నిర్మాతగా, అణగారిన వర్గాల నాయకుడిగా, రాజనీతి కోవిదుడుగా, న్యాయశాస్త్ర పారంగతుడుగా ప్రజాభిమానాన్ని చూరగొన్న మహామనిషి డాక్టర్. బాబా సాహెబ్ అంబేద్కర్. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాల మేలు కలయికగా ఉండే సమాజం అంబేద్కర్ లక్ష్యం.

14 ఏప్రిల్ 1891 నాడు మధ్యభారతంలోని 'మవూ' అనే గ్రామంలో రాంజీసక్‌పాల్, భీమాభాయి దంపతులకు పుట్టిన బిడ్డ అంబేద్కర్. అంబేద్కర్ అసలు పేరు భీంరావ్. ఇంటిపేరు, తండ్రిపేరు కలిసి భీంరావ్ రాంజీ అంబావాడేకర్ అయ్యింది. హైస్కూల్ విద్యను అభ్యసిస్తున్నపుడు వారిని బాగా ఇష్టపడే ఒక బ్రాహ్మణ ఉపాధ్యాయుని ఇంటిపేరైన 'అంబేద్కర్'ను అంబావాడేకర్‌కు ప్రత్యామ్నాయంగా భీంరావ్ పేరుకు చేర్చారు.


# సామాజిక న్యాయ పితామహుడు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్

బొంబాయిలోనే అంబేద్కర్ బి.ఎ వరకు చదివారు. మొదటి నుంచి ఆత్మవిశ్వాసంతో పెరిగిన అంబేద్కర్ 1913 జూన్‌లో బరోడా మహరాజు సహాయంతో అమెరికాలోని కొలంబియా యూనివర్శిటీలో ఉన్నత విద్యను పూర్తి చేశారు. భారతదేశపు రూపాయి ప్రాంతీయ ద్రవ్య వ్యవస్థ, ద్రవ్యంపై ఈయన చేసిన అధ్యయనం ప్రామాణికమైనది.

మహారాష్ట్రలోని అంటరాని కులంగా పరిగణించే "మహర్" కులంలో పుట్టడం వలన అస్పృశ్యత వారికి స్వీయ అనుభవం. అంటరానితనం రూపాలు వాటివల్ల కలిగే బాధలు, అవమానాలు వారు ప్రత్యక్షంగా అనుభవించారు. భారతీయ సమాజంపై అంబేద్కర్ రచించిన అనేక గ్రంథాలు శూద్రుల సమస్యలను, అస్పృశ్యుల సమస్యలను విశ్లేషించాయి. వీరి రచనలు చారిత్రక యదార్థాలను వెలికితీయడంతో పాటు, హిందూ సమాజం నిమ్న వర్గాల ప్రజల పట్ల ప్రదర్శిస్తున్న క్రూరత్వానికి మూలమైన మను ధర్మశాస్త్రాన్ని సహేతుకంగా విమర్శించాయి.

భారతదేశంలోని ప్రజలను నిలువునా చీల్చి ప్రజలను జీవచ్ఛవాలుగా, నిర్వీర్యులుగా, ఎందుకూ పనికిరాని వారుగా తయారు చేసి తీవ్ర అంతరాలను సృష్టించిన చాతుర్వర్ణ వ్యవస్థను అంబేద్కర్ నిర్దాక్షిణ్యంగా విమర్శించాడు. ప్రపంచంలో అన్ని మార్పులు వచ్చాయి. కానీ భారతదేశంలో సాంఘిక మార్పు ఆవిర్భావం లేదు. దీనికి కారణం కులవ్యవస్థే. పీడిత వర్గాలు సమైక్యమై మానవత్వం కోసం, ఆర్థిక సమానత్వం ద్వారా గౌరవప్రదమైన జీవనం కోసం, రాజకీయ చైతన్యం ద్వారా మానవ విలువలను పరిరక్షిస్తూ సాధించుకోవాలి అని అన్నారు.

అస్పృశ్యుల సమస్యలు సానుభూతితో పరిశీలించడం ద్వారా కానీ, కొన్ని సంస్కరణలు ప్రతిపాదించడం ద్వారా కాని పరిష్కారం కావని, ఒక సమూలమైన సామాజిక పరివర్తన రావాలని సూచిస్తూ ద్విముఖ పోరాట సిద్ధాంతాన్ని సాంఘికంగా, రాజకీయంగా ప్రబోధించాడు. అస్పృశ్యతకు మూలకారణం కులవ్యవస్థ పునాదులపై ఆధారపడిన హిందూ భూస్వామ్య సమాజం అని విశ్లేషించాడు. అందుకే అనేక సందర్భాలలో బ్రిటిష్ వ్యతిరేక పోరాటం కన్నా సవర్ణ హిందూవ్యవస్థపై నిమ్నవర్గాల పోరాటమే ముఖ్యం. ఈ పోరాటం కుల దురహంకారానికి, కులవ్యవస్థకు వ్యతిరేకమైనదని, అంతేకాని ఏ ఒక్క నిర్దిష్టమైన కులానికో, జాతికో వ్యతిరేకమైనది కాదని అంబేద్కర్ స్పష్టపరిచారు.




నిమ్నవర్గాల ప్రజల ఆర్థిక స్థితుగతులు అధ్వానంగా ఉండటానికి ప్రధాన కారణం వారు గ్రామ ప్రజలపై ఆర్థికంగా ఆధారపడి ఉండటమే. కాబట్టి నిమ్న వర్గాలు తమ సంప్రదాయ సిద్ధమైన వృత్తిని వదులుకొని నగరాలలో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను అన్వేషించి ఆర్థిక స్వయం ప్రతిపత్తిని సంపాదించుకోవాలి. అమెరికాలోని నీగ్రో జాతి ప్రజలు ఆర్థిక స్వయం సమృద్ధిని సాధించుకున్న క్రమాన్ని, స్వతంత్రులౌతున్న విధానాన్ని ఉదాహరణగా తీసుకోవాలన్నాడు. ప్రభుత్వ మిగులు భూములను అస్పృశ్య జాతులకు ప్రభుత్వం పంచిపెట్టాలని అంబేద్కర్ విజ్ఞప్తి చేశారు.



నిమ్నవర్గాల సామాజిక ప్రతిఘటన క్రమంగా రాజకీయ ప్రతిఘటనగా రూపాంతరం చెందుతుందన్న వాస్తవాన్ని అంబేద్కర్ గుర్తించాడు. ఈ ప్రతిఘటనను నిరోధించడమే అప్పటి ప్రభుత్వం ఉద్దేశ్యం. అంతేకాక బ్రిటిష్ ప్రభుత్వం సవర్ణ హిందువులను సంతృప్తి పరచటానికిగాను, అస్పృశ్యులకు మానవ హక్కులను ఇవ్వలేకపోయినది.

బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగానే కాక, సవర్ణ హిందు దురహంకారానికి వ్యతిరేకంగా నిమ్న వర్గాలు పోరాడవలసి వచ్చింది. జాతీయ రాజకీయ రంగంలో 1885 నాటికే ఏర్పడ్డ కాంగ్రెస్ అనేక రాజకీయ సంస్కరణలను సాధించగలిగింది. కానీ అస్పృశ్యుల ప్రయోజనాల కోసం కృషి చేయకపోగా ముస్లింలను సంతృప్తి పరచడానికి సర్వదా ప్రయత్నించింది.

1909లో మరియు 1919లో రాజకీయ సంస్కరణల ద్వారా ముస్లింలకు ప్రత్యేక నియోజక వర్గాలను ప్రతిపాదించారు. కానీ నిమ్న వర్గాలకు ప్రయోజనం కల్గించే ప్రతిపాదన ఏదీ లేదు అంబేద్కర్ అభిప్రాయ పడ్డాడు.


సైమన్ కమిషన్ మన దేశాన్ని సందర్శించినపుడు అత్యధిక రాజకీయ పార్టీలు ఆ కమిషన్ బహిష్కరణకు పిలుపునిచ్చాయి. కానీ అంబేద్కర్ ఉద్దేశ్యపూర్వకంగా కమిషన్ ముందు హాజరవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. కుల విద్వేషం వలన సాధారణ నియోజక వర్గాల నుండి అస్పృశ్యులకు 'ప్రత్యేక' నియోజక వర్గాలు కావాలని సైమన్ కమిషన్ ముందు అంబేద్కర్ వాదించారు.

నూతన రాజ్యాంగంలో అందరికీ సమానమైన రాజకీయ ప్రాతినిధ్యం కల్గించాలని, నిమ్నవర్గాలకు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం ఉండాలని అంబేద్కర్ స్పష్టంగా చెప్పారు. ఏ అస్పృశ్యుడైనా మిశ్రమ నియోజకవర్గం నుండి ఎన్నిక కావడం అసాధ్యం కనుక అస్పృశ్యులకు ప్రత్యేక నియోజక వర్గాలు కావాలని అంబేద్కర్ ప్రతిపాదించాడు.

**1930 తరువాత కాలంలో కేవలం సాంఘిక ప్రతిఘటన సమస్యలను పరిష్కరించజాలదని, సమస్యలను రాజకీయం చేయడం అవసరం అని అంబేద్కర్ గ్రహించాడు. క్రమంగా భారత రాజకీయాల్లో క్రియాశీలంగా పాల్గొంటూ నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం ప్రాతినిధ్యం వహించసాగాడు. 1931లో రెండవ రౌండ్ టేబుల్ సమావేశంలో నిమ్న వర్గాల హక్కులతో పాటు స్వరాజ్య సాధన కూడా తమ లక్ష్యంగా అంబేద్కర్ ప్రకటించి తన దేశభక్తిని ప్రదర్శించాడు. బ్రిటిష్ ప్రభుత్వం అణగారిన ప్రజలకు సరైన రాజ్యాంగ రక్షణ కల్పించాలన్నాడు.**

కేవలం సమిష్టి నియోజక వర్గాలు ఉండడం వల్ల సవర్ణ హిందువులే లాభపడి నిమ్నవర్గాల ఉద్యమానికి విఘాతం కలుగుతుందని ఆయన అనేక సందర్భాలలో చెప్పాడు. ఆయన దృష్టిలో కొన్ని రాజకీయ హక్కులు సాధించుకోవడం కన్నా నిమ్న వర్గాలు తమ మౌలిక మానవ హక్కులు సాధించుకోవడమే అత్యంత ప్రధానం.

ఈ దృష్టి కలవాడు కాబట్టే గాంధీజీ నడుపుతున్న జాతీయోద్యమాన్ని అంబేద్కర్ పూర్తిగా బలపరచ లేకపోయాడు. అనేక విమర్శలకు గురయ్యాడు. అస్పృశ్యులకు కూడా హిందూ భూస్వామ్య నిర్మాణాల ప్రభావం నుండి స్వరాజ్యం కావాలని, రానున్న స్వరాజ్యంలో ప్రజలందరికి సమానమైన మానవ హక్కులు, గౌరవం ఉండాలని అంబేద్కర్ ఆకాంక్షించాడు. అస్పృశ్యులు రెండు రంగాలలో పోరాడవలసి ఉన్నది. ఒకవైపు సవర్ణ హిందువులతోను, మరోవైపు ప్రభుత్వంతో వారి పోరాటం.




ప్రప్రథమంగా అస్పృశ్యులకు కనీస మానవహక్కులు నిరాకరించిన వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాన్ని బలోపేతం చేయాల్సి ఉంది. అందుకోసం తాత్కాలికంగా ప్రభుత్వ వ్యతిరేక పోరాటాన్ని విరమించవలసి వస్తున్నదని అంబేద్కర్ రాశారు.

అంబేద్కర్ సాంఘిక పోరాటానికి ప్రధానంగా మూడు లక్ష్యాలు ఉన్నాయి. ఒకటి – నిమ్న ప్రజలలో చైతన్యం కల్గించడం. రెండు – వారిని



పోరాటయోధులుగా మలచడం. మూడు – తమ డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొనిరావడం. తను ప్రారంభించిన 'మహద్' ఉద్యమ లక్ష్యం కేవలం చౌదరా చెరువును నిమ్న వర్గాల కోసం తెరిపించడానికి పరిమితమైనది కాదు, నిమ్న జనానికి వాళ్ళ హక్కుల విషయమై చైతన్యపరచడం అతని ప్రధాన ధ్యేయం. తద్వారా బలహీన వర్గాల్లో అనేక సమస్యల మీద భవిష్యత్తులో బలమైన పోరాటాలు నిర్వహించేందుకు నిమ్న జాతి ప్రజలను జాగృతం చేయడం.

1930 తరువాత కాలంలో కేవలం సాంఘిక ప్రతిఘటన సమస్యలను పరిష్కరించజాలదని, సమస్యలను రాజకీయం చేయడం అవసరం అని అంబేద్కర్ గ్రహించాడు. క్రమంగా భారత రాజకీయాల్లో క్రియాశీలంగా పాల్గొంటూ నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం ప్రాతినిధ్యం వహించసాగాడు. 1931లో రెండవ రౌండ్ టేబుల్ సమావేశంలో నిమ్న వర్గాల హక్కులతో పాటు స్వరాజ్య సాధన కూడా తమ లక్ష్యంగా అంబేద్కర్ ప్రకటించి తన దేశభక్తిని ప్రదర్శించాడు. బ్రిటిష్ ప్రభుత్వం అణగారిన ప్రజలకు సరైన

రాజ్యాంగ రక్షణ కల్పించాలన్నారు.

అస్పృశ్యుల ప్రయోజనాల పట్ల నిర్లక్ష్యం చూపుతున్న కాంగ్రెస్ పార్టీని, గాంధీ జీ విధానాలను అంబేద్కర్ విమర్శించారు. అందుకే కాంగ్రెస్ వెలపల ఉంటూ పనిచేయాలని సంకల్పించాడు. క్రమంగా అస్పృశ్యులకు రాజకీయ అధికారం సిద్ధించాలన్న ఆశయంతో ఒక విలక్షణమైన రాజకీయ వ్యూహాన్ని రూపొందించడం జరిగింది. ఇందుకోసం అస్పృశ్యులకు ప్రత్యేక నియోజకవర్గాల డిమాండ్‌ను తెచ్చి దాన్ని సాధించుకున్నాడు. ప్రభుత్వం ప్రకటించిన కమ్యూనల్ అవార్డ్ సవర్ణ హిందువులకు సమ్మతి కాలేదు. దీనికి వ్యతిరేకంగా గాంధీజీ ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. ఫలితంగా విధిలేని పరిస్థితుల్లో అంబేద్కర్ గాంధీజీతో చర్చలు జరిపి 'పూనా ఒప్పందం'పై సంతకం చేయవలసి వచ్చింది.

అస్పృశ్యులకు ప్రత్యేక నియోజకవర్గాలకు బదులుగా 'రిజర్వుడు మిశ్రమ' నియోజక వర్గాలను ఈ ఒప్పందం ద్వారా అంగీకరించవలసి వచ్చింది. ఒకవైపు అణగారిన ప్రజలకు అధికారంలో భాగస్వామ్యాన్ని అంబేద్కర్ సాధించుకోగా, గాంధీజీ నిమ్న వర్గాలను హిందూ ప్రధాన స్రవంతిలో కలిపి ఉంచగలిగారు.

నిమ్నజాతుల లక్ష్యాలను సాధించుకోవడానికి తమకంటూ ఒక రాజకీయ పార్టీ ఉండాలన్న ఆవశ్యకతను ఆయన గుర్తించాడు. దీని ఫలితంగా ఆయన స్వతంత్ర కార్మిక పార్టీని స్థాపించాడు. అణగారిన ప్రజలందరినీ ఏకం చేయడానికి కృషి చేశాడు. షెడ్యూల్డ్ కులాల సమాఖ్యను స్థాపించాడు. రాజకీయ అధికార మార్పిడి జరుగుతున్న క్లిష్ట సమయంలో వారి ప్రయోజనాలను సంరక్షించుకోవడమే ఈ రాజకీయపార్టీ ప్రధాన లక్ష్యం.

అస్పృశ్యుల సాంఘిక, రాజకీయ, ఆర్థిక హక్కులు సంరక్షింపబడాలని





డా. అంబేద్కర్ ఆకాంక్షించారు. నిమ్న జాతుల వెనుకుబాటు తనానికి నిరక్షరాశ్యతే కారణమని నమ్మినవ్యక్తి. షెడ్యూల్డ్ కులాలవారికి, మధ్యతరగతి వారికి ఉన్నత విద్యావకాశాలు కల్పించడానికి 1946 జూన్ 20న పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ తరపున ఒక ఆదర్శ కాలేజిని స్థాపించారు. నిమ్న వర్గప్రజల జనాభాను, అవసరాల ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర రాష్ట్ర చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులలో రిజర్వేషన్ ప్రాతిపదికన ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేయడం జరిగింది. వీటి పర్యవసానంగానే స్వాతంత్ర్యానంతరం రూపొందిన భారత రాజ్యాంగంలో ఈ ఈ అంశాన్ని పొందుపరచడంలో అంబేద్కర్ కీలకపాత్ర నిర్వహించారు.

1951లో భారతదేశ ప్రథమ న్యాయశాఖ మంత్రిగా అంబేద్కర్ ప్రతిపాదించిన హిందూకోడ్ బిల్లులో మహిళలకు ఆస్తిహక్కు, కుమార్తెలకు ఆస్తిలో సమానవాటా, విడాకుల హక్కు ఉండాలని దత్తత విషయంలో భార్య సమ్మతి ఉండాలని మహోన్నతమైన అంశాలను చేర్చడం జరిగింది. కానీ ఈ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంతో ఆయన రాజీనామా చేశారు.

అంబేద్కర్ సమకాలీన సమగ్ర సామాజిక ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సామాజిక వ్యవస్థను తలక్రిందులు చేయడం ద్వారా దేశంలో ప్రజాస్వామిక విప్లవాన్ని తేవాలని అంబేద్కర్ ఆకాంక్షించాడు. తన జీవితం అంతా దళిత, పీడిత వర్గాల అభ్యున్నతి కోసమే పలు మార్గాలను అన్వేషిస్తూ అన్ని రంగాలలో తనదైన అభిప్రాయాన్ని నిష్కర్షగా చెప్పిన అంబేద్కర్ 1956 డిసెంబర్ ఆరో తేదీన పరమపదించారు. బడుగు వర్గాల ఆశాజ్యోతి అయిన అంబేద్కర్ చూపిన మార్గామే దేశ పరిపాలనకు, సామాజిక న్యాయం సాధించటానికి ఆచరణ యోగ్యంగా ఉంది.

*– యం. సుధీర్, ఫ్యాకల్టీ, ఎ.ఎం.ఆర్, అపార్డ్*



# పంచాయితీ రాజ్ సంస్థల్లో 'నూతన అకౌంటింగ్' విధానం

పంచాయితీ రాజ్ సంస్థల్లో రూపకల్పన, ఆర్థిక ఖాతాల నిర్వహణకు తగిన విధి విధానాలను రూపొందించాల్సిందిగా దేశ కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్‌కి పదకొండో ఫైనాన్స్ కమీషన్ సిఫార్సు చేసింది. దీంతో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ 16 నమూనా రిజిష్టర్లను రూపొందించారు. ఆర్థిక పరిగణనలోని లావాదేవీల వర్గీకరణకై ఓ విధానాన్ని 'కాగ్' సూచించింది. ఈ వర్గీకరణ పంచాయితీరాజ్ సంస్థల్లోని కార్యక్రమ విధి విధానాల కనువుగా ఇతర ప్రభుత్వ శాఖల్లోని ఆర్థిక ఖాతాల నిర్వహణ మాదిరిగా అన్ని స్థాయిల్లోని పాలనా విధానాల్లోనూ, అంటే కేంద్ర, రాష్ట్ర, స్థానిక స్థాయిల్లో ఏకత్వాన్ని, సారూప్యతను కలిగి వుండేలా రూపొందించడం జరిగింది. కంప్యూటరీకరణకు అనువుగా ఓ కొత్త కోడింగ్ విధానాన్ని సూచించారు. ఈ విధి విధానంలో మరో ముఖ్య ప్రాముఖ్యతాంశం ఏంటంటే, అకౌంటింగ్ –బడ్జెటింగ్‌ల మధ్య సమన్వయం కలిగేలా చూశారు. అంటే "బడ్జెటింగ్‌ను అనుసరిస్తూ 'అకౌంటింగ్' ఉండేలా.

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు నెం. 36119/అకౌంట్స్-1/2000-14, పిఆర్ & ఆర్.డి., తేదీ 15-2-2005 ను అనుసరించి, ఓ కమిటీని ఏర్పాటు చేసి, పంచాయితీ రాజ్ శాఖలోని ప్రతీ అంచెలోనూ జరిగే ఆర్థిక పాలనా వ్యవహారాలోని ప్రధాన నియమాలకు అనువుగా ఈ విధివిధాన నమూనాలు (ఫార్మెట్స్) ఉన్నాయా? లేదా? అన్న విషయాన్ని తుది నిర్ణయం చేయాల్సిందిగా ఆదేశించింది. దీని ప్రకారం ఆ కమిటీ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్‌ని సంప్రదించి, చర్చించిన మీదటే ఈ విధి విధానాలను ఖరారు చేసింది. కమిటీ సూచనల ఆధారంగా ఈ 'నూతన అకౌంటింగ్' విధివిధానాన్ని అమలు పర్చాల్సిందిగా ప్రభుత్వ ఉత్తర్వు ఎమ్మెస్ నెం. 172 పిర్ & ఆర్.డి శాఖ, తేదీ 15.5.2005న రాష్ట్ర పంచాయితీ రాజ్ సంస్థలకు ఆదేశించడమైంది.

పెద్ద పెద్ద మొత్తాలను గ్రాంట్లుగా పంచాయితీ రాజ్ సంస్థలకు విడుదల చేస్తున్నందున, అకౌంట్ల సక్రమ నిర్వహణ అత్యంత ఆవశ్యకమని నొక్కిచెప్పడం జరిగింది. ప్రతీ పంచాయితీ రాజ్ సంస్థ " అకౌంటింగ్" అస్తిత్వాన్ని కలిగి వున్నందున, సక్రమ చెల్లింపులకు కాలానుగుణ మదింపులు, ఖాతాలను (అకౌంట్ల) రూపొందించేందుకు బాధ్యత వహించాల్సి ఉంది.

ఈ వ్యాసం పంచాయితీ రాజ్ సంస్థల్లోని 'ఆకౌంటింగ్' విధానాల పట్ల అప్రమత్తతను కలిగించేందుకై రూపొందించడం జరిగింది. నెలవారీ – సంవత్సర వారీ అకౌంట్లను రూపొందించేందుకు అవసరమైన, పలు విధానాలను సూచించడం జరిగింది. అకౌంటింగ్ విధానాలు, సాధారణంగా పంచాయితీ రాజ్ సంస్థల్లో అనుసరించే ఆచరణలను ఇక్కడ సూక్ష్మంగా చర్చించడం జరిగింది.

**పదకొండో ఆర్థిక సంఘం (ఫైనాన్స్ కమీషన్) సూచనలు**

రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగా స్థానిక సంస్థలకు ఏఏ నిధులు ఏఏ మేజర్ హెడ్స్ క్రింద విడుదల అవుతున్నాయో సమీక్షించాల్సిందిగా పదకొండో ఆర్థిక సంఘం సూచించింది. ప్రతీ మేజర్ హెడ్, ఉపసబ్ మేజర్ హెడ్ క్రింద ఒక మైనర్ హెడ్‌ను తప్పక సూచించాలని కోరింది. దీంతో స్థానిక సంస్థలకు ఏ స్థాయిల్లో ఎంతెంత మొత్తాలను బదలీ చేసింది తేట తెల్లమౌతుంది – సులభంగా అవగతమవుతుంది. దీనికి అనువుగా ప్రభుత్వ "బడ్జెట్ల"లో ప్రత్యేక డిమాండ్ శీర్షికలను రూపొందించుకుంటూ, ఈ స్థానిక సంస్థల కేటాయింపులు లేదా బదిలీలను వివరంగా రూపొందించుకోవచ్చు.

పదకొండో ఆర్థిక సంఘం, కాగ్ వారి సూచనలను అనుసరణగా ప్రభుత్వ సంబంధిత నిధి మొత్తాలను పంచాయితీ రాజ్ సంస్థల బదిలీకి అనువుగా క్రింది అల్ప శీర్షికలను (మైనర్ హెడ్స్) ప్రారంభించింది.

1. జిల్లా పరిషత్‌లకు సహాయ నిధి – 196
2. మండల్ పరిషత్‌లకు సహాయ నిధి – 197
3. గ్రామ పంచాయితీలకు సహాయ నిధి – 198

**అకౌంటింగ్ ఆచరణ (అకౌంటింగ్ ప్రాక్టీసెస్)**

పంచాయితీ రాజ్ సంస్థల్లో చేపట్టే 'అకౌంటింగ్' అచరణలు ''సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వ శాఖల విధి విధానాలనే పోలి ఉంటాయి. రాజ్యాంగపు 73వ సవరణ అనుసరించి రాష్ట్ర పంచాయితీ రాజ్ చట్టం 1994 రూపొం దించింది. ఈ చట్టం ప్రకారం పంచాయితీ రాజ్ సంస్థల ఆర్థిక వ్యవహారాల నిర్వహణా విధివిధానాల మేరకు జిల్లాపరిషత్ / మండల్





పరిషత్ / గ్రామ పంచాయితీలు స్వతంత్ర్య అస్తిత్వాన్ని కలిగి వున్నాయి. ఈ సంస్థలు ఏటా – వార్షిక నివేదికలను (ఏన్యువల్ రిపోర్ట్స్), ఆ సంవత్సరంలో చోటు చేసుకున్న జమలు (రిసీ ప్ట్స్) చెల్లింపుల (పేమెంట్స్) వివరణలతో రూపొందించాల్సి ఉంది. ఈ వార్షిక నివేదిక ప్రధానంగా ఆయా సంస్థల గత సంవత్సర పాలనా నిర్వహణతో, ప్రస్తుత సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్ అంచనాలతో ఆవోదం పొందేందుకు, సరిపోల్చటానికి అనువుగా ఉంటుంది.

ఈ అకౌంటింగ్‌కు, బడ్జెటింగ్‌కు మధ్య విడ దీయరాని అనుబంధం ఉంటుంది. సక్రమ అకౌంటింగ్ విధానం – సముచిత ముందస్తు అంచనాల నియంత్రణకు ప్రాతిపదిక గానూ ఉంటుంది. ఈ నూతన అకౌంటింగ్ విధానంలో, పంచాయితీ రాజ్ సంస్థలు తమ బాలెన్స్ షీట్‌ను తయారు చేయవలసిన అవసరంలేదు. కాని సమకూర్చుకొన్న ఆస్తుల వివరాలు వేరే రిజిష్టర్లలో తప్పక వ్రాయాల్సి ఉంటుంది. ఈ సంస్థల వార్షిక లెక్కలు, రాబడులు, చెల్లింపులు, మూల పెట్టుబడులు, డిపాజిట్లు, అప్పులు, అడ్వాన్స్‌లను మదింపు చేస్తూ రూపొందించాల్సి ఉంది. వీటన్నింటినీ సక్రమంగా నిర్వహించేందుకు అనువైనంత సులభ రీతిన విధి విధాన నమూనాలను రూపొందించడం ఇక్కడ జరిగింది.

## నగదు ఆధారిత ఖాతాలు ( కేష్ బేసిస్ ఆఫ్ అకౌంట్స్)

లావాదేవీలను ఎప్పుడు నమోదు చేయాలో అకౌంటింగ్ విధివిధానానికి ప్రధాన ప్రాతిపదిక. పంచాయితీ రాజ్ సంస్థలు ఎప్పుడూ నగదు ఆధారిత ఖాతాల నిర్వహణనే అనుసరిస్తాయి.

ఈ అకౌంట్స్ (ఖాతాలు) నగదు ప్రాతిపదికనే రూపొందుతూ ఉంటాయి. అంటే నగదు జమ అయినప్పుడు లేదా చెల్లించినపుడు జరిపే నమోదు ప్రాతిపదికనే సవివరంగా పరిశీలించినప్పుడు, సరుకుల కొనుగోళ్ళు జరిపినప్పుడు, వెనువెంటనే చెల్లింపులు జరగకపోవచ్చు. అప్పుడు ఈ నగదు ఆధారిత ఖాతాల నిర్వహణలో కొనుగోళ్ళ బిల్లుల చెల్లింపులు జరిపిన తదనంతరమే పరిగణనలోకి తీసుకోబడతాయి. ఇందుకు సరుకులను పొందడంతో గాని వాని వినియోగంలో గానీ ప్రమేయం ఉండదు. ఈ లావాదేవీలు ఆయా ఆర్థిక సంవత్సరంలో జరిగిన నగదు జమ–చెల్లింపులనే వెల్లడిస్తాయి. తత్ఫలితంగా సంస్థలు తమకు బాకీ ఉన్న మొత్తాలను గాని, తాము ఇంకనూ చెల్లించాల్సిన మొత్తాలను గాని ఆర్థిక పట్టికలో చూపించనక్కర్లేదు. కానీ ఇవి అన్ని సంస్థల ఇతర రికార్డుల్లో నమోదై ఉండాలి. దీంతో నగదు ఆధారిత సమాచారం సాధ్యమైనంత అనుకూలతతో, వెనువెంటనే సరిచూసుకునేందుకు నిరూపణీయంగా వుంటుంది.

## అకౌంట్స్ కాలపరిమితి (పీరియడ్ అఫ్ అకౌంట్స్)

ఆర్థిక సంవత్సరమే అకౌంట్స్‌కు కాలపరిమితి. ఆర్థిక సంవత్సరంగా మార్చి 31తో అంతమయ్యే 12 నెలల కాలం నిర్వచింపబడింది. అంటే ఈ ఆర్థిక సంవత్సర కాలంలో ఏప్రిల్ ఒకటి నుంచి మొదలై మార్చి 31తో అంతమయ్యే నాటి ఆర్థిక పట్టికలన్నీ నమోదై ఉండాలి.

## ఆర్థిక నివేదన (ఫైనాన్షియల్ రిపోర్టింగ్)

పంచాయితీ రాజ్ సంస్థలు ప్రజల పట్ల జవాబు దారీతనం వహించే, బృహత్తర బాధ్యతాయుత విధి నిర్వహణకు ఈ ఆర్థిక నివేదనలు దోహదపడతాయి. 'బడ్జెట్' పత్రాల్లో పొందుపర్చిన ముందస్తు అంచనాలకు అనుగుణంగా వనరులను వినియోగించుకోవడంతో పాటు ఇతర చట్టపర ఆర్థిక అవసరాలను అమలుపర్చేందుకు ఈ ఆర్థిక నివేదనలు రుజువుగా నిలుస్తాయి. వార్షిక జమా, చెల్లింపులు నమోదై వుంటాయి. కాలానుగుణంగా పొందిన మొత్తాలను చెల్లింపులను నమోదు చేస్తూ, అకౌంటు చివరి తేదీ నాటికి ప్రారంభపు తుల్యతను వెల్లడిస్తుంది. జమా చెల్లింపు ఖాతాలో పరిమిత కాల పరిధిలో వినిమయాలపై వెచ్చించిన మొత్తాలను విశదీకరిస్తూ, వార్షిక బడ్జెట్‌లో ఇందు నిమిత్తం కేటాయించిన మొత్తాలలో సరిపోలుస్తూ, హెచ్చు – తగ్గుల అంతరాలను నివేదించడం జరుగుతుంది. వార్షిక – బడ్జెట్ అంచనాలతో జమా – చెల్లింపులను మదింపు చేస్తూ, అభివృద్ధికర వినియోగతను ఆ సంవత్సరానికి గానూ వివరించడం సాధ్యమౌతుంది. ప్రతీ పంచాయితీ రాజ్ సంస్థ నెలవారీ జమ – చెల్లింపుల ఖాతాలను ప్రధాన శీర్షిక (మేజర్ హెడ్) మేరకు నిర్వహిస్తూ నెలవారీ బ్యాంకు స్టేట్‌మెంట్‌తో సరిచూడాల్సి ఉంటుంది.

## అదనపు వివరణలు (అడిషనల్ స్టేట్ మెంట్స్)

ఈ అదనపు వివరణలు, వార్షిక అకౌంట్లకు అనుబంధంగా పంచాయితీ రాజ్ సంస్థల్లోని మూడంచెలలోను సాధారణంగా వస్తాయి. నిర్ణీత నమూనాల్లో, అనుబంధ రికార్డులుగా వర్తిస్తాయి. జమా చెల్లింపుల వార్షిక నివేదికలతో పాటు ఈ క్రింది వివరణలను రూపొందించాల్సి ఉంటుంది.

1. మూల ధన వ్యయ వివరణ, పథకాల వారీగా అర్థిక సంవత్సర కాలంలో అభివృద్ధి పనులపై ఖర్చు చేసిన మొత్తాన్ని చూపాలి.

2. ఆర్థిక సంవత్సర కాలానికి చేయవలసిన వసూళ్ళను ఇంకను చేయవలసిన చెల్లింపులను సవివరంగా చూపే వివరణ.

3. వివిధ డిపాజిట్ అకౌంట్ల తుల్యతలను ఆ సంవత్సరంతానికి వివరించే వివరణ.

4. పంచాయితీ రాజ్ సంస్థల యాజమాన్యం భవిష్యత్ నిధి (ప్రావిడెంట్ ఫండ్) ఖాతాలను నిర్వహించిన పక్షంలో సంవత్సరాంతానికి వాటి వివరణలను రూపొందించాలి.

## నిధుల బదిలీలు (ట్రాన్స్‌ఫర్ అఫ్ పండ్స్)

పంచాయితీ రాజ్ సంస్థలకు 'నిధుల బదిలీల' కు అనువుగా రాష్ట్ర బడ్జెటులో కొత్త అల్ప శీర్షికలను (మైనర్ హెడ్స్)ను నిర్దేశించడం జరిగింది. కాని జిల్లా పరిషత్ సంస్థ నుంచి మండల పరిషత్ లేదా గ్రామ పంచాయితీ సంస్థలకు వివిధ పథకాల అమలు నిమిత్తం నిధులను బదిలీ చేయాల్సి వస్తే, జిల్లా పరిషత్ జమ – చెల్లింపుల ఖాతాలో అట్టి బదిలీలను ఆర్థిక సహాయక ఖాతా (గ్రాంట్–ఇన్–హెడ్)లో తగ్గింపులుగా చూపాల్సి ఉంటుంది.

## అదాయం – మూల పెట్టుబడి వర్గీకరణ (క్లాసిఫికేషన్ ఆఫ్ రెవెన్యూ ఫండ్ కాపిటల్)

జమ – చెల్లింపులు ఖాతాను సుసంఘటిత సారాంశం (కన్సాలిడేట్

అబ్(స్టాక్స్)లో వెల్లడించే గణాంకాల నుంచి రూపొందిస్తారు. మూల ధన వ్యయాన్ని, ప్రణాళికా బద్ధమైన, ప్రణాళికేతర ఆదాయ వ్యయం నుంచి వర్గీకరించి, ప్రత్యేకంగా చూపుతారు. ప్రణాళికేతర వ్యయాన్ని పాత పథకాల కొనసాగింపు గానే వుండనిస్తారు.



## నగదు పుస్తకం (క్యాష్ బుక్)

ప్రతీ పంచాయితీ రాజ్ సంస్థ నందు ఒకే ప్రధాన నగదు పుస్తకాన్ని నిర్వహణలో ఉంచాలి. తగు అవసరార్థం వినియోగంలో వున్న ఇతర ఉప నగదు పుస్తకాలలో నమోదైన మొత్తాలను ఈ ప్రధాన నగదు పుస్తకంలో ఎప్పటికప్పుడు క్రోడీకరిస్తూ వుండాలి.

## ఖాతాల నిర్మాణం (స్ట్రక్చర్ ఆఫ్ అకౌంట్స్)

పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఖాతాలను పార్టు-I, పార్టు-II రెండు విభాగాలుగా విభజించారు.

## పార్ట్-I పంచాయతీ నిధి

పంచాయతీ నిధులకు సంబంధించిన అన్ని తరహాల లావాదేవీలను ఈ విభాగంలో నమోదు చేయడం జరుగుతుంది.

దీనిని మళ్ళీ 'రెవెన్యూ', 'కేపిటల్' గా విభజించారు. రెవెన్యూ అకౌంటును 'వసూళ్ల శీర్షిక' 'వ్యయ శీర్షిక'గా విభజించారు. రెవెన్యూ వసూళ్ళ శీర్షికలో పన్నులు, పన్నేతర ఆదాయాలు, ప్రభుత్వ కేటాయింపులు, గ్రాంటులు మొ॥ ఉంటాయి. రెవెన్యూ వ్యయ శీర్షికలో జీతాలు, ఆఫీసు వ్యయాలు, నిర్వహణ వ్యయాలు మొ॥ ఉంటాయి.

శాశ్వత ఆస్తులను నిర్మించడానికి పెట్టిన పెట్టుబడిని కేపిటల్ వ్యయం అంటారు. ఆస్తులను అమ్మడం ద్వారా కాని లేదా మార్పిడి ద్వారా కాని, రుణాల ద్వారా కాని వచ్చిన ఆదాయాన్ని కేపిటల్ అంటారు.

ఇందు జమైన శీర్షికలు (రిసీప్ట్ హెడ్స్) - వ్యయ శీర్షికలు (ఎక్స్‌పెండీచర్ హెడ్స్) పేరిట మూలధన ఖాతా (కేపిటల్ అకౌంట్), రుణాలు వగైరాలుంటాయి.

నిర్దేశిత లక్ష్య దిశగా ఆస్తుల విస్తరణ, శాశ్వత ప్రయోజనాలను కాంక్షిస్తూ సేకరించిన రుణ మొత్తాలను ఈ ఖాతాలో పొందుపర్చడం జరుగుతుంది. వ్యయ శీర్షికల్లో లక్ష్యా లక్ష్య సాధనకై వినియోగించిన వ్యయమొత్తాలను క్రోడీకరిస్తారు.

## పార్ట్-II

పంచాయతీ రాజ్ సంస్థలు స్వీకరించిన డిపాజిట్లు, భవిష్యత్ నిధులు (ప్రావిడెంట్ ఫండ్స్) రుణాలు, డిపాజిట్లు, అడ్వాన్సులను ఈ విభాగంలో నమోదు చేస్తారు.

సంబంధిత శీర్షికల్లో మొత్తం జమలు, మొత్తం ఆదాయ వ్యయం, మొత్తం మూలనిధి వ్యయాలను కంప్యూటరీకరణ కూడ చేయవచ్చు.

రెండో విభాగం పార్ట్ - II లో ఖాతాలు డిపాజిట్లు, బయానాలు (అడ్వాన్సెస్) రెమిటెన్స్‌ను నమోదు చేస్తారు. దీనికి సంబంధించిన అకౌంట్లలో పంచాయతీ రాజ్ సంస్థలు కేవలం బ్యాంకరుగా వ్యయపరుస్తాయి. అంటే వీటి కాలపరిమితి అయిన తర్వాత తిరిగి చెల్లించవలసి ఉంటుంది.

కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీరాజ్ సంస్థకు వచ్చిన ఆర్థిక సహకార మొత్తాలు (గ్రాంట్లు), యితర ఆర్థిక సంస్థల నుంచి వచ్చిన మొత్తాలను ప్రధాన శీర్షిక '1601' - 'గ్రాంట్స్ - ఇన్ - ఎయిడ్' గా పార్ట్ - I రెవెన్యూ అకౌంటులోనే నమోదు అవుతుంది.

పంచాయతీరాజ్ సంస్థలు ఈ క్రింద పేర్కొన్న ప్రత్యేక ప్రధాన శీర్షికలను పార్ట్ - II లో యితర లావాదేవీల నమోదుకై నిర్వహించడం జరుగుతుంది. రుణాలు భవిష్యత్‌నిధి, పింఛన్లు, భీమా పింఛను నిధి, డిపాజిట్లు, అడ్వాన్సెస్, అవసరార్థం ఇతరత్రా ఈ లావాదేవీల్లో పాలుపంచుకుంటాయి. (జమ/చెల్లింపుల పేరిట).

7610 - పంచాయితీరాజ్ శాఖా సిబ్బందికి రుణాలు

8009 - భవిష్యత్ నిధి (ప్రావిడెంట్ ఫండు)

8011 - భీమా, పింఛను నిధి

8443 - సివిల్ డిపాజిట్

8550 - సివిల్ అడ్వాన్సెస్

## ఖాతాల సంకలనం (కంపైలేషన్ ఆఫ్ అకౌంట్స్)

అన్ని తరహాల ఆదాయ జమలు, ఇతర నగదు రూపంలో జమ అయ్యే ప్రభుత్వ గ్రాంట్లు, బ్యాంక్ పాస్ పుస్తకాల్లో నమోదయ్యే మొత్తాలు. ట్రెజరీ పాస్ బుక్ నమోదులు వెరసి జమ రిజిస్టర్‌లో నమోదు కావాల్సి వుంటుంది. ప్రతీ ప్రధాన శీర్షికకు అవసరానికి సరిపడా పేజీలను ఈ జమల రిజిస్టర్‌లో కేటాయించాలి. ప్రతీదినం, ఆ ఖాతాల్లో ప్రతీ శీర్షిక పేరిట నమోదయిన మొత్తాలను నగదు పుస్తకంలోని నమోదులతో సరిచూసుకోవడం అనివార్యం.

ప్రతి శీర్షిక పేరిట దినవారీ అయిన జమ మొత్తాలను కూడి నెలవారీ మొత్తాలుగా నమోదు చేయాలి. నెలవారీ అభివృద్ధికర మొత్తాలను కూడి, వార్షిక జమ మొత్తాలను శీర్షికల వారీగా లభ్యమయ్యేలా చూడాలి. చిన్న చిన్న లావాదేవీలను వివరణాత్మకమైన 'వర్గీకరణ' ద్వారా చెల్లింపుల

రిజిష్టర్‌లో పొందుపర్చాలి. ప్రధాన శీర్షికల పేరిట జరిగే జమలను ఎలాగూ వివరంగా స్టేట్‌మెంట్‌గా నమోదు చేయగలం కానీ అల్ప శీర్షికల (మైనర్ హెడ్స్) జమల సంకలనం వివరణాత్మకంగా సాధ్యం కాకపోవచ్చు.

వ్యయాలను నమోదు చేసేందుకై ఓ ప్రత్యేక రిజిష్టర్‌ను నిర్వహించడం అవసరం. ఇందులో రోజువారీ జరిపే చెల్లింపులను నమోదు చెయ్యాలి. ఇందు సైతం ప్రతీ ప్రధాన శీర్షిక (మేజర్ - హెడ్)కు ప్రాధాన్యతారీత్యా సరిపడే పేజీలను కేటాయించాలి. రోజువారీ వ్యయాలను దినాంతమున కూడి, నగదు పుస్తక నమోదులతో సరిచూసుకోవాల్సి వుంటుంది. ప్రతీ శీర్షిక పేరిటా అయ్యే 'వ్యయాలను' కూడుకుని నెలవారీ మొత్తం వ్యయాలను తేల్చాల్సి వుంటుంది. నెలవారీ మొత్తాలను కూడి వార్షిక వ్యయాలను శీర్షికల వారీ ఖరారు చేయాల్సి వుంటుంది.

ఈ వ్యయ రిజిష్టర్ల ఆధారంగా ప్రధాన శీర్షికల (మేజర్ హెడ్స్) నెలవారీ వ్యయాలను రూపొందించడం సాధ్యమౌతుంది. శీర్షికల వారీ వ్యయాల స్టేట్‌మెంట్లు (నెలసరి) వోచర్ల చెల్లింపులు, శీర్షికల వారీ చెల్లింపులను ప్రధాన (మేజర్), అల్ప (మైనర్), లక్ష్యానికి అనువుగా (ఆబ్జెక్ట్)



అనే మూడు తరహాల్లో సముచితంగా విడదీసి చూడాలి. సంబంధిత శీర్షిక పేరిట మొత్తాలు నమోదు అయ్యేలా వుండాలి. జి.పి.ఎఫ్., వివిధ బయానాలు, శాలరీ వోచర్స్‌లో తగ్గింపు (కోత) జాబితాలో నమోదయ్యేలా చూడాలి. అన్ని ఆబ్జెక్స్ మొత్తాలను కూడి అట్టి మొత్తంను ప్రధాన శీర్షికలోని చెల్లింపు మొత్తంలో సరిచూసుకోగలగాలి.

## పరిగణన (అకౌంటింగ్), విధానంలో 'సూక్ష్మీకరణ' ఈ క్రింది విధంగా వుంటుంది

ఎ). దినవారీ లావాదేవీలను నగదు పుస్తకంలో నిర్దేశిత నమూనాలో నమోదు చేసుకుంటూ వుండాలి. వచ్చిన జమలను జమల ఖాతాలో, చెల్లింపులను చెల్లింపు ఖాతాలోనూ నమోదు చెయ్యాలి. ప్రతి దినం-నగదు పుస్తకాన్ని ముగించేముందు జమ-చెల్లింపులను 'బేరీజు' వేసుకొని ప్రారంభపు నిల్వగా లావాదేవీలకు సంబంధిత ఖాతా శీర్షికను (హెడ్ ఆఫ్ అకౌంట్) పొందుపర్చడం ఆవశ్యకం/ అవసరం.

బి) నగదు పుస్తకంలో నమోదు చేసిన రోజువారీ లావాదేవీలను సంబంధిత రిజిస్టర్‌లో బదిలీ చేయాల్సి వుంటుంది. 'చెల్లింపులు' జరిపిన పక్షంలో, 'చెల్లింపుల రిజిస్టర్'లో సంబంధిత ఖాతాలో, 'జమ' జరిగిన పక్షంలో, 'జమ-రిజిస్టర్‌లో సంబంధిత ఖాతాలోనూ వెనువెంటనే బదిలీ చేయాలి.

సి) ప్రతీనెల చివరిరోజున నగదు పుస్తకంలోని ముగింపు నిల్వను, బ్యాంకు- ట్రెజరీ రీకన్సిలియేషన్ సరిచూసుకుని, సంబంధిత రిజిస్టర్లలోనూ (జమ-చెల్లింపుల) వీటిని సరిచేయడం అవసరం. నెలవారీ జమలు-చెల్లింపులను స్పష్టం చేయాలి. తద్వారా ఏఏ ఖాతాల్లో ఎంతెంత మొత్తం వ్యయం అయిందీ స్పష్టమౌతుంది.

డి) నెలాఖరున జమల మొత్తాన్ని-చెల్లింపుల మొత్తాన్ని లక్ష్య శీర్షిక స్థాయిలో నెలవారి జమా-చెల్లింపుల ఖాతాలో నమోదు చేయాల్సిందే.

ఇ) నెలవారీ (జమా-చెల్లింపుల) మొత్తాలను గత కాలపు పెద్ద మొత్తానికి జోడించి నడుస్తున్న నెల చివరినాటికి సంకలిత సారంగా అంటే ఆ వార్షిక సంవత్సరంలో ఆనాటి వరకూ అయ్యే ఏక మొత్తంగా (కన్సోలిడేటెడ్ ఎబ్‌స్ట్రాక్ట్) పేర్కొనాలి.

ఎఫ్) సంవత్సరానికి అంటే మార్చి నెలాఖరునాటికి నమోదయ్యే ఏకమొత్తాలు ఆనాటి వార్షిక జమా-చెల్లింపుల ఖాతాకు నమోదవుతాయి.

జి) మార్చి నెల అకౌంట్స్ ముగిసిన నాటికి జమ-వ్యయ ఖాతాలను శాఖల వారీగా సరిచూసుకుని, తప్పొప్పులను సరిచూసుకోవాల్సి వుంటుంది. గుర్తించని లావాదేవీలను, సందిగ్ధపు ఖాతాలను సరిచూసుకొని బదిలీ ఎంట్రీల్లో నమోదయ్యిందీ, లేనిదీ, ఖరారు చేసుకోవాలి. మార్చి మాసాంతానికి తేలిన పెను మొత్తం, ఆయా శీర్షికల వారీగా సరిపోల్చుకున్నప్పుడు-ఆనాటి ''వార్షిక-అకౌంటింగ్'' పరిపూర్తయినట్లే.

– **తక్విద్దిన్,** జాయింట్ డైరక్టర్, ఎ.ఎం.ఆర్-అపార్డ్

**(2వ భాగం వచ్చే సంచికలో...)**



# ప్రభుత్వ భూములు – పంచాయితీల పాత్ర

## భూమికి, మనిషికి గల సంబంధం

భూమికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం పలు శాసనాలను రూపొందించాయి. ఈ శాసనాలలో ఎక్కువ భాగం రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినవే. బ్రిటీషు పాలకులు రూపొందించిన శాసనాలు కూడా కొనసాగించబడుచున్నాయి. భూమికి వున్న విశేష ప్రాధాన్యత దృష్ట్యా ప్రతి వ్యక్తీ వాటిని గురించి తెలుసుకోవలసిన అవసరమున్నది.

సమాజ శ్రేయస్సు భూమి ప్రాధాన్యత

- ❒ జీవనోపాధిని కల్పిస్తుంది
- ❒ ఉత్పత్తి పెరుగుతుంది
- ❒ సంఘంలో ఆత్మగౌరవాన్ని యిస్తుంది

**దేశ జనాభాలో 75% గ్రామీణ ప్రజలు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను భూమిపై ఆధారపడి జీవిస్తున్నవారే. సృష్టి ఆది నుండి కూడా మానవుని జీవనాధారం భూమియే. భూమి కేవలం ఆర్థిక సామాజిక అంశమే కాక, అది మానసిక పెట్టుబడి కూడా.**

- ❒ సామాజిక హోదాని యిస్తుంది.
- ❒ ఆత్మస్థైర్యాన్నిస్తుంది

### భూముల వర్గీకరణ

- ❒ జిరాయితీ రైత్వారీ భూములు
- ❒ దేవదాయ, ధర్మాదాయ భూములు, వక్ఫ్ భూములు.

- ఇనాం భూములు.
- ప్రభుత్వ భూములు.

**జిరాయితీ రైత్వారీ భూములు**

ఇవి వ్యక్తుల సొంత ఆస్తిగా పరిగణింపబడే భూములు. దాన క్రయవిక్రయాది సమస్త హక్కుల కలిగిన వ్యక్తిగత భూములను జిరాయితీ రైత్వారీ భూములని అంటారు.

**1. దేవాదాయ ధర్మాదాయ వక్ఫ్ భూములు**

దేవాదాయ ధర్మాదాయ సంస్థలకు చెందిన భూములు ఆయా సంస్థల నిర్వహణకు, సత్కార్యములు నిర్వహించటానికి ఉద్దేశించబడినవి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ధార్మిక, ధర్మాదాయ వ్యవహారాల నిర్వహణ, పరిపాలన విధానం, నిర్వహణ నిమిత్తం1987వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ధార్మిక, హిందు మత సంస్థల ధర్మాదాయ చట్టం రూపొందించబడినది.

**2. వక్ఫ్ భూములు**

వక్ఫ్ భూములనగా మహ్మదీయ మత సిద్ధాంతం ప్రకారం ఏదైనా సత్కార్యాన్ని నిర్వహించటానికి ఉద్దేశించబడిన ఆస్తులు. వక్ఫ్ ఆస్తులను సక్రమంగా నిర్వహించే నిమిత్తం కేంద్ర ప్రభుత్వంచే 1955వ సంవత్సరంలో వక్ఫ్ చట్టం రూపొందించబడినది.

**ఇనాం భూములు**

గతంలో పాలించిన చక్రవర్తులు, రాజులు, జాగీరుదార్లు కొందరు వ్యక్తులకు వారి వారి ప్రతిభాపాటవాలననుసరించి, నిర్ణీత సేవలు చేసే నిమిత్తం భూముల్ని బహుమానంగా ఇవ్వడం జరిగింది. అట్టి భూములను ఇనాం భూములుగా వర్గీకరించడమైనది.

**ప్రభుత్వ భూములు**

సమాజ ప్రయోజనాలకు, లేక ప్రజా వినియోగం నిమిత్తం కేటాయించబడిన భూములు. వీటిలో కొన్ని ప్రభుత్వ భూములను నిర్వహించటానికి పంచాయితీలకు బదలాయించబడినవి. ఈ విషయంలో ప్రభుత్వ భూముల వర్గీకరణ గురించి కూడా తెలుసుకోవలసిన అవసరమున్నది.

**ప్రభుత్వ భూముల వర్గీకరణ**

**తరము కట్టిన భూములు**

సాగు చేయటానికి అవకాశమున్న, శిస్తు నిర్ణయించిన ప్రభుత్వ





భూములను తరము కట్టిన భూములంటారు. మంజూరు చేయటానికి అభ్యంతరంలేని భూములు. ఈ భూములను భూమి లేని పేదలకు సాగు నిమిత్తం మంజూరు చేయవచ్చు. మంజూరు చేసే అధికారం తహసీల్దారుకు ఉంది.

### తరము కట్టని భూములు

సాగుకు ఉపయోగపడి, శిస్తు నిర్ణయించిన భూములు. ఈ భూములను కూడా భూమి లేని పేదలకు శిస్తు నిర్ణయించిన తర్వాత సాగు నిమిత్తం మంజూరు చేయవచ్చు. శిస్తు నిర్ణయించే అధికారం రెవిన్యూ డివిజనల్ అధికారికి కలదు. శిస్తు నిర్ణయించే తర్వాత పట్టా మంజూరు చేసే అధికారం తహసీల్దారుకు కలదు.

### పోరంబోకు భూములు

ప్రజా ప్రయోజనాల నిమిత్తం కేటాయించిన భూములు. ఉదాహరణకు: కాలిబాటలు, బండిబాటలు, స్మశానాలు, మందబయళ్ళు, పచ్చిక బయళ్ళు కల్లములు, తోపులు, కొండలు, హార్బర్లు, ముఖ్యంగా నీటి వనరులు, అనగా నదులు, చెరువులు, కాలువలు, మురుగు నీటి కాలువలు మొదలైనవి. ఈ భూములు సామాన్యంగా మంజూరు చేయకూడదు. ఇవి కాక, భూసేకరణ చట్టం 1894 ద్వారా ప్రభుత్వము సేకరించిన భూములను కూడా పోరంబోకు భూములనే అంటారు.

### కొన్ని ప్రభుత్వ భూములు పంచాయితీలకు బదలాయింపు

1. పైన ఉదహరించిన ప్రభుత్వ భూములలో ఈ క్రింద తెలియ పరచిన కొన్ని ప్రభుత్వ భూములను ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1994 యొక్క 58వ సెక్షను ప్రకారం పంచాయితీలకు బదలాయించమైనది.

- ❑ పచ్చిక బయళ్ళు
- ❑ కళ్లములు
- ❑ స్మశానములు
- ❑ పశువులు నిలుచు స్థలములు (మంద బయళ్లు)
- ❑ బండ్లు నిలుచు స్థలములు
- ❑ తోపులు

ప్రభుత్వ ఉత్తర్వులు జి.ఒ.ఎం.ఎస్.నెం: 266 (రెవిన్యూ శాఖ) తేదీ. 30.31.1999దీ ప్రకారం పైన పేర్కొనబడిన ప్రభుత్వ భూములను గ్రామ పంచాయితీలు నిర్వహించవలసియున్నది.

ఏదైనా నిర్దిష్ట ప్రయోజనం కొరకు పై భూములు ప్రభుత్వానికి అవసరమైనచో పంచాయితీ పరిధి నుండి తొలగించినట్లు గెజిట్‌లో ప్రచురణచేసి ప్రభుత్వ ఆధీనంలోనికి తీసుకొనవచ్చు.

2. గ్రామ పంచాయితీ పరిధిలో గల ఇతర పొరంబోకు భూముల వినియోగాన్ని నియంత్రించటానికి కూడా గ్రామ పంచాయితీకి అధికారము కలదు. (సెక్షను 58(3)).

3. సెక్షను 58 (4) ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలకు లోబడి గ్రామ పంచాయితీ పరిధిలో గల పోరంబోకు భూములలో చెట్లు నాటవచ్చు. చెట్లు నాటడం ద్వారా గ్రామంలోని ప్రభుత్వ భూములను ఉపయోగించుకొని పచ్చదనం-పరిశుభ్రతను పెంపొందించుకొని గ్రామ పంచాయితీ వనరులను అభివృద్ధి చేసుకొనవచ్చు. (జి.ఒ.ఎస్.నెం: 265 రెవెన్యూ శాఖ తేది 30.3.1999)

5. ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1994 నందలి (53)వ సెక్షను ప్రకారం ఏదేని గ్రామ పంచాయితీ పరిధిలో గల అన్ని రహదారులు జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, జిల్లా పరిషత్ రహదారులు, మండల పరిషత్ రహదారులు మినహా మిగిలిన అన్ని రహదారులపై ఆక్రమణలకు తొలగించే బాధ్యత గ్రామ పంచాయితీపై ఉంది.

6. సెక్షను (80) ప్రకారం గ్రామ పంచాయితీ పరిధిలో వున్న జల ప్రవాహాలు, ఊటలు, రిజర్వాయర్లు, నీటితొట్లు, చలాలు, బావులు తదితర నీటి సరఫరా నిర్మాణాల ప్రక్కన గల ప్రభుత్వ భూమి కూడా గ్రామ పంచాయితీ ఆధీనంలో ఉంటుంది.

అటువంటి నీటి వనరుల ప్రక్కన ఉన్న ప్రభుత్వ భూములపై చెట్లు నాటి వాటి ఫలసాయం అనుభవించే హక్కు, సంబంధించిన గ్రామ పంచాయితీకి ఉన్నది.

7. ఆయా పంచాయితీ పరిధిలో గల ప్రభుత్వ భూముల వివరాలు అనగా (1) సర్వేనంబరు (2) విస్తీర్ణం (3) భూమి వర్గీకరణ (4) గ్రామ పఠం మొదలగు వాటి పూర్తి వివరాలు ఆయా తహసీల్దార్ల నుండి గ్రామ పంచాయితీ కార్యదర్శి సేకరించు కోవాలి.

పైభూముల వినయోగాన్ని నియంత్రించి అభివృద్ధి చేసుకొని పంచాయితీ వనరులను పెంచుకొనవచ్చు.

**– బి. వెంకటేశ్వర రావు,** కన్సల్టెంట్, ల్యాండ్‌సెల్. ◆






# తాజానీటి ప్రాధాన్యత తెలిపేందుకే అంతర్జాతీయ నీటి దినం

పర్యావరణ, అభివృద్ధిలపై 1992లో ఐక్యరాజ్యసమితి నిర్వహించిన ఒక అంతర్జాతీయ కాన్ఫెరెన్స్‌లో మంచి నీటి ఆవశ్యకతపై ఒక అంతర్జాతీయ దినాన్ని ప్రతి ఏటా జరుపుకోవాలని పలువురు సూచించారు. దాంతో 1993 మార్చి 22న అంతర్జాతీయ నీటి దినం నిర్వహించుకోవాలంటూ ఐక్యరాజ్య సమితి సాధారణ సభ తీర్మానించింది.

**తాజానీటి ప్రాధాన్యతను తెలియజేయడానికి, అందరి దృష్టి నీటిపైకి మళ్లించడానికి ప్రతి ఏటా మార్చి 22న అంతర్జాతీయ నీటి దినాన్ని నిర్వహిస్తుంటారు. తాజానీటి వనరులు నశించకుండా సురక్షితంగా చిరకాలం ఉండేందుకు ఆయా వనరులను మెరుగ్గా నిర్వహించేలా చేయడం ఈ అంతర్జాతీయ నీటి దినం లక్ష్యం.**



నీటి కణం


## 2009 - అంతర్జాతీయ నీటి దినం

2009 లో అంతర్జాతీయ నీటి దినం థీమ్‌గా 'సమిష్టి నీరు-సమిష్టి బాధ్యతలు' అనే అంశాన్ని నిర్ణయించారు. సరిహద్దుల్లోని జలాలపై ఈ ఏడాదంతా ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. సరిహద్దులోని జలాల నిర్వహణకు సహకారాన్ని పెంపొందించుకునే అవకాశాలను పెంచడం ద్వారా వివిధ రేఖల మధ్య పరస్పర గౌరవాన్ని, అవగాహనను, నమ్మకాన్ని పెంచవచ్చు. అంతేకాక, శాంతి భద్రతలను, సుస్థిర ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చు.

ఐక్యరాజ్య సమితిలోని విద్య, శాస్త్రీయ, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) ఈ ఏడాది అంతర్జాతీయ నీటి దినాన్ని నిర్వహించింది. ఇందుకు ఐక్యరాజ్య సమితి ఆర్థిక కమీషన్ - యూరప్ (UNCEF) ఐక్యరాజ్య సమితి ఆహార, వ్యవసాయ సంస్థ (FAO) సహకరించాయి.

## 2008 - అంతర్జాతీయ నీటి దినం


2008 అంతర్జాతీయ నీటి దినం అంతర్జాతీయ పారిశుధ్య దినంతో కలిసి వచ్చింది. భూగ్రహంపై ఉన్న ప్రతి ముగ్గురిలో ఒకరిని బాధపెడుతున్న సంక్షోభంపై చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను ఈ దినాలు చాటి చెప్పాయి. ప్రతి 20 సెకన్లకు ఒక బిడ్డ అధ్వాన్నమైన పారిశుధ్య పరిస్థితుల వల్ల మరణిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 260 కోట్ల మంది ప్రజలు




అధ్వాన్నమైన పారిశుధ్య పరిస్థితుల్లో జీవిస్తున్నారు. ఇట్లాంటి పారిశుధ్య పరిస్థితులను నివారించటం మనకు తెలిసి వుండి కూడా, ప్రతి ఏటా 15 లక్షల మంది చిన్నారులు మృత్యువాత పడటాన్ని నిశ్శబ్దంగా చూస్తున్నాం. ఈ దినాల దర్భంగా స్విట్జర్లాండులోని జెనీవాలో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

## 2007 - అంతర్జాతీయ నీటి దినం

నానాటికీ పెరుగుతున్న నీటి కొరత థీమ్‌గా 2007 లో అంతర్జాతీయ నీటి దినాన్ని నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న నీటి కొరతపై



దృష్టి సారించటానికి ఈ లక్ష్యాన్ని నిర్ణయించారు. అంతర్జాతీయ స్థాయిలో, స్థానిక స్థాయిలో ఉన్న చాలీచాలని నీటి వనరుల ను సమర్థవంతంగా, సమానంగా నిర్వహించడానికి సహకారాన్ని పెంపొందించుకోవల్సిన ఆవశ్యకతపై 2007 నాటి కార్యక్రమాలను ఎక్కుపెట్టారు. ఐక్యరాజ్య సమితిలోని ఆహార, వ్యవసాయ సంస్థ (FAO) వీటిని నిర్వహించింది. ఎఫ్ఎవో సెక్రటరీ జనరల్ జాక్యుస్ డియుఫ్ స్వాగతోపన్యాసం చేయగా, ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ బాన్ కి మూన్, గ్రీన్ క్రాస్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు మైఖేల్ గోర్బచేవ్ వీడియో ప్రసంగాలు చేశారు.



## 2006- అంతర్జాతీయ నీటిదినం

2006 సంవత్సరంలో అంతర్జాతీయ నీటి దినం థీమ్‌గా 'నీరు-సంస్కృతి'ని నిర్ణయించారు. యునెస్కో -నాయకత్వంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా రకరకాల సంస్కరణలు, ఆచారాలు ఉన్న విధంగానే నీటి పట్ల కూడా అనేక దృక్కోణాలు, దృక్పథాలు, ఉపయోగాలు ఉన్నాయనే వాస్తవంపై ప్రజల దృష్టిని మళ్లించడానికి ఈ లక్ష్యాన్ని నిర్ణయించారు. అనేక మతాల్లో పవిత్ర జలానికి ప్రాధాన్యం ఉంది. వివిధ క్రతువుల్లో, తంతుల్లో, ధర్మకార్యాల్లో పవిత్ర జలాన్ని ఉపయోగిస్తుంటారు. శతాబ్దాల తరబడి వివిధ కళల్లో నీటికి ప్రాధాన్యత ఉంది. సంగీతం, చిత్రలేఖనం, రచనలు, సినిమా వంటి వాటిల్లో నీరు ప్రముఖంగా చోటు చేసుకుంది. అనేక శాస్త్రీయ పరిశోధనలకు అత్యంత అవసరమైన వనరుగా కూడా నీరు ఉంది.

## 2005- అంతర్జాతీయ నీటి దినం

2005 సంవత్సరంలో అంతర్జాతీయ నీటి దినం థీమ్‌ని 'జీవితం కోసం నీరు : 2005-2015' అని నిర్ణయించారు. 'జీవితం కోసం నీరు' అనే అంశంపై 2005 నుంచి 2015 వరకు అంతర్జాతీయ కార్యాచరణ దశాబ్దంగా 2003 డిసెంబర్‌లో జరిగిన ఐక్యరాజ్య సమితి 58వ సాధారణ సభ ప్రకటించింది. ఈ కార్యాచరణ దశాబ్దం 2005 మార్చి 22న ప్రారంభమైంది. నీటి సంబంధిత అంశాలపై ప్రపంచం మొత్తం దృష్టి సారించాలనే ఉద్దేశ్యంతో ఆ దశాబ్దాన్ని నిర్ణయించారు. అదే విధంగా నీటి సంబంధిత అభివృద్ధి యత్నాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాలని, మిలీనియమ్ డిక్లరేషన్, సుస్థిర అభివృద్ధికి జరిగిన శిఖరాగ్ర సమావేశం నిర్ణయించి అమలు చేయడానికి రూపొందించిన జోహన్స్ బర్గ్ ప్రణాళిక, అజెండా 21 మొదలైన వాటిల్లోని నీటి సంబంధిత గమ్యాలను సాధించడానికి అన్ని స్థాయిల్లో మరింత సహకారం పెంపొందించాలని ఈ దశాబ్దాన్ని నిర్దేశించారు.



## 2004 - అంతర్జాతీయ నీటి దినం

2004 సంవత్సరంలో అంతర్జాతీయ నీటి దినం సందర్భంగా ఐక్యరాజ్య సమితి విపత్తుల నివారణ వ్యూహ సంస్థ, ప్రపంచ వాతావరణ సంస్థ పలు కార్యక్రమాలు నిర్వహించాయి. వాతావరణం - నీటి వనరులు అనే అంశాన్ని థీమ్‌గా నిర్ణయించారు. ఆర్థిక - సామాజిక అభివృద్ధిని, మానవాళి సంక్షేమాన్ని వాతావరణం, నీటి వనరులు విపరీతంగా ప్రభావితం చేస్తాయనే విషయాన్ని ప్రపంచం ముందుకు తీసుకెళ్ళారు.


ప్రపంచ వాతావరణ సంస్థ అంచయనాల ప్రకారం, వరదలు, తుపాన్లు, పెను తుపాన్లు, ఉరుములు, పిడుగులు, కరువు వంటి వాతావరణ సంబంధిత వైపరీత్యాలు ప్రపంచంలోని మొత్తం వైపరీత్యాల్లో 75 శాతం వరకు ఉంటాయి. వీటివల్ల మానవాళి ఎనలేని బాధలకు గురవుతుంది. అనేకమంది ప్రాణాలు కోల్పోతారు. విపరీతమైన ఆర్థిక నష్టం కలుగుతుంది. వీటిని అప్రమత్తంగా ఉండి గమనించటం, వాటి కదలికలను పసిగట్టడం, సమయానికి ప్రజలకు హెచ్చరికలు జారీ చేయటం వల్ల ప్రజలపై, ఆర్థిక వ్యవస్థపై ఆయా విపత్తుల ప్రభావాన్ని, వినాశనాన్ని కొంతమేరకు తగ్గించటం సాధ్యమవుతుంది.

## 2003- అంతర్జాతీయ నీటి దినం

'భవిష్యత్తు కోసం నీరు' అనే అంశాన్ని 2003 సంవత్సరపు అంతర్జాతీయ నీటి దినం థీమ్‌గా నిర్ణయించారు. అందుబాటులో ఉన్న తాజానీటి రాశిని, వాసిని కాపాడుతూ, దాన్నింకా మెరుగుపరిచి భవిష్యత్తు తరాల కి అందించాలని ఈ దినం పిలుపునిచ్చింది. 2015 నాటికి మిలీనియం డెవలప్‌మెంట్ లక్ష్యాలను సాధించాలంటే ఇది అవసరమని వివిధ కార్యక్రమాలు పేర్కొన్నాయి. ప్రపంచవ్యాప్తంగా సురక్షితమైన తాగునీరు యలేకుండా, కనీస పారిశుధ్య వసతులు లేకుండా నికృష్టంగా జీవిస్తున్న ప్రజల సంఖ్య 2015 నాటికి కనీసం సగానికి తగ్గించటం మిలినియం డెవలప్‌మెంట్ లక్ష్యాల్లో ఒకటి.

2003లో అంతర్జాతీయ నీటి దినం ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమ సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. నీటిని మరింత బాధ్యతాయుతంగా వాడుకుంటూ, దాన్ని కాపాడుకోవలసిన అవసరాన్ని అర్థం చేసుకోవటాన్ని ప్రోత్సహించే విధంగా సమాజాలను, ప్రజలను, రాజకీయాలకు ఆయత్తం చేయటం ఈ దినం లక్ష్యం.





## 2002- అంతర్జాతీయ నీటి దినం

'అభివృద్ధి కోసం నీరు' అనే అంశాన్ని 2002లో అంతర్జాతీయ నీటి దినం థీమ్‌గా నిర్ణయించారు. ఐక్యరాజ్యసమితి తరఫున అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ ఈ దినం కార్యక్రమాలను నిర్వహించింది. ప్రపంచంలోని అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో నానాటికీ క్షీణిస్తున్న నీటి వనరులను రక్షించుకోవాలంటే, నీటి వనరుల సమీకృత ప్రణాళిక, నిర్వహణ, అవసరాన్ని ఈ కార్యక్రమాలు చాటి చెప్పాయి.

## 2001 - అంతర్జాతీయ నీటి దినం

'ఆరోగ్య పరిరక్షణలో నీటి దినం' థీమ్‌గా నిర్ణయించారు. ఐక్యరాజ్య సమితిలోని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ కార్యక్రమాలను నిర్వహించింది. సురక్షితమైన మంచినీటిని అందించటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి నిర్దిష్టమైన చర్యలు అవసరమనే సందేశాన్ని ఈ కార్యక్రమాలు అందించాయి. నీటితో వస్తున్న ఆరోగ్య సమస్యలు, వాటికి పరిష్కారాల గురించి ప్రపంచ వ్యాప్తంగా అవగాహనను పెంచవలసిన అవసరాన్ని ఈ కార్యక్రమాలు చాటి చెప్పాయి. పరిష్కారాలు సాధ్యమనే సందేశాన్ని ఈ అంతర్జాతీయ నీటిదినం ఇచ్చింది.

*-హెచ్. కూర్మారావు, ఎం.టెక్ (అగ్రి ఇంజనీరింగ్) ఎం.బి.ఎ.*
*సెంటర్ హెడ్, సిఎన్ఆర్ఎం, ఎ.ఎం.ఆర్ - అపార్డ్*
*రాజేంద్రనగర్, హైదరాబాద్*
*అనువాదం : వై. సరోజ*




# చిన్నారులకొక చిన్ని అవకాశం

## గోడపత్రిక

*"కుండీలో నాటిక మొలక కాస్త పెరిగిన తర్వాత దానికి ఒక విశాలమైన పాదు అవసరమైనట్లు పిల్లవాడికి కూడా కాస్త పెరిగిన తర్వాత బాగా పరిగెత్తడానికి, దూకడానికి అవకాశాలు కావాలి. అప్పుడా పిల్లవాడికి ఇల్లు ఇరుకు అవుతుంది."*

- గిజూభాయి






**పిల్లల్ని విశ్వసిస్తే, ప్రోత్సహిస్తే, వాళ్ళకి స్వేచ్ఛనిస్తే, అవకాశాలిస్తే వాళ్ళ మనస్సులోంచి మహానదులు ప్రవహిస్తాయి. మహారాగాలు పెల్లుబుకుతాయి. మహావేశాలు తన్నుకొస్తాయి. మహా మహా ఆలోచనలు తొంగిచూస్తాయి. అప్పుడు భాష వాటికి వినమ్రంగా వొదిగిపోతుంది.**

ఎంతసేపటికీ చిలక పలుకులు పలికించడం, గుడ్డి కంఠస్తాలు చెయ్యించడం, ముక్కున పెట్టుకొని కక్కించడం వంటివి పెద్ద ఉపయోగం ఉండదు. మా పాఠశాలలో ఇది ఒకప్పటి పరిస్థితి. ఇప్పుడు ఆడుతూ, పాడుతూ చదవడం. ఆహ్లాదరకరమైన తరగతి గది వాతావరణంలో విద్యాభ్యాసం కావించడానికి మేము ఏర్పాటు చేసుకున్నవే మా వినూత్న కార్యక్రమాలు. విద్యార్థి కనీస సామర్థ్యాలను సాధించే క్రమంలో పాఠ్యాంశాలతో పాటు పాఠ్యేతర అంశాలు అయిన కొన్ని కార్యక్రమాలను పిల్లలు నిర్వహిస్తారు. వాటినే 'వినూత్న కార్యక్రమాలు' అంటున్నాము. అవి:

- ★ గోడపత్రిక
- ★ పిల్లల డైరీ
- ★ పాఠశాల పోస్టుబాక్సు
- ★ బాలల సంఘాలు
- ★ తరగతి గది గ్రంథాలయం
- ★ పాఠశాల మేగజైన్
- ★ నిజాయితీ పెటిక

ఈ నెల గోడపత్రిక గురించి తెలుసుకుందాం.

## గోడపత్రిక ఆవశ్యకత

- ★ పిల్లలు తమకు ఇష్టమైన అంశాలను ఎన్నుకొని వాటి ద్వారా అభ్యసన ప్రక్రియ మెళుకువలను తెలుసుకునేందుకు.
- ★ పిల్లల్లో స్తబ్ధంగా ఉండిన జ్ఞానాన్ని వెలికితీయటానిక
- ★ పిల్లలు అనేక అంశాల గురించి స్వయంగా తెలుసుకునేందుకు.
- ★ పిల్లలు తమ సృజనాత్మక నైపుణ్యాలను ప్రదర్శించటానికి
- ★ పిల్లల ఆలోచనలను, ఇష్టాయిష్టాలను అధ్యయనం చేయటానికి
- ★ పిల్లలకు విషయసేకరణ, విషయావగాహన కల్గించడానికి
- ★ పిల్లలకు బడి పట్ల ఆసక్తిని పెంపొందించటానికి
- ★ భావాలను వ్యక్తీకరించుకోవడానికి
- ★ పిల్లల అనుభూతులను, స్పందనలను, ప్రతి స్పందనలను వెలిబుచ్చడానికి.

*అంటే*






ప్రతి పాఠశాలలో తరగతి వారీగా లేదా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నప్పుడు 1, 2 తరగతులకు ఒక గోడపత్రిక 3, 4, 5 తరగతులకు ఒకటి, 6, 7 తరగతులకు ఒకటి ఏర్పాటు చేసుకుంటున్నాము. విద్యార్థులు చేసినవి, వేసినవి, రాసినవి ప్రదర్శించడానికి వీలుగా నోటీస్‌బోర్డు మాదిరిగా ఏర్పాటు చేసుకోవాలి. ధర్మకోల్ అడుగున ఉండేటట్లు చూసుకుంటే పిన్నులతో వాటిని ప్రదర్శించడం, అందరు పిల్లలు వాటిని చూసిన తరువాత తీసివేయడానికి అనువుగా ఉంటుంది. విద్యార్థులు 5 గురు ఉండేటట్లుగా గోడపత్రిక కమిటీని ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేయాలి.

వీరు విద్యార్థుల నుండి వారు గీసిన బొమ్మలు, కథలు, గేయాలు వంటి వాటిని ప్రతిరోజు సేకరించి గోడపత్రిక మీద ప్రదర్శించాలి. ఈ విధంగా ప్రదర్శించిన వాటిని అన్నీ ఫైల్ చేసి పెట్టుకుని నెల చివరలో ఒక పత్రికలాగా పిల్లల మాసపత్రిక లాగా తయారు చేసి గ్రామ పెద్దలచే విడుదల చేయించి

> ***సృజనాత్మక నైపుణ్యాలు ప్రదర్శించిన పిల్లలను ప్రార్థనలో ప్రోత్సహించినప్పుడు ఎప్పుడూ ఏమీ గీయని విద్యార్థి కూడా ఉత్తేజం పొంది ఏదో ఒకటి గీయడానికి ప్రయత్నిస్తాడు. ఒక అడుగు వేయడానికి ముందుకు వస్తే ఎన్ని వేల అడుగులయినా నడవగలుగుతాడు. గోడపత్రికలో ప్రదర్శించబడే అంశాలను తల్లిదండ్రుల సమావేశంలో ప్రదర్శించవచ్చును. ఈ విధంగా చేయడం వలన వారికి బడి పట్ల నమ్మకం, పిల్లలను బడికి పంపించాలనే ఆలోచన కలిగి ఉంటారు.***

ఆ తరువాత రిఫరెన్స్ పుస్తకం లాగా దానిని తరగతి గది గ్రంథాలయంలో ఉంచుకోవాలి. పిల్లల మాసపత్రిక తయారీకి ఒక సైజులో ఉన్న పేపరులను కలిపి సూది, దారంతో కుట్టవచ్చు. లేదా స్పైరల్ బైండింగ్ చేయించుకున్నా బాగుంటుంది.

ఏ రోజైనా ఏ విద్యార్థి అయినా గోడపత్రికలో ప్రదర్శించిన అంశం బాగుంటే ప్రార్థనా సమయంలో ఈ విషయాన్ని అందరు విద్యార్థులకు తెలియజేసి ఆ విద్యార్థిని ప్రశంశించవచ్చు. పెద్ద విద్యార్థులు, తెలివిగలవారు, చురుకుగా ఉన్న పిల్లలే కాకుండా, ఒకటవ తరగతి విద్యార్థి కూడా, చదువులో వెనుకబడిన వారు కూడా గోడపత్రికలో ఏదో ఒకటి ప్రదర్శించడానికి ఉత్సాహం చూపుతారు.

ఎందుకంటే తన పేరు రాసిన ఒక పేపరు గోడపత్రిక మీద చేరడం, పాఠశాలలోని పిల్లలంతా అది చూడటం నిజంగా తనలోని వెనుకబాటుతనం పోగొట్టబడే ఒక అద్భుతమైన మార్గం ఈ గోడపత్రిక. అయితే గోడపత్రిక పర్మనెంట్‌గా ఏర్పాటు చేసినదై ఉండాలి. వీలయినంత వరకు పేపర్ క్లిప్పింగ్‌లను ఎక్కువగా పెట్టకూడదు. పిల్లల చేత రాయబడిన, గీయబడిన వాటినే ప్రదర్శించాలి.

సృజనాత్మక నైపుణ్యాలు ప్రదర్శించిన పిల్లలను ప్రార్థనలో ప్రోత్సహించినప్పుడు ఎప్పుడూ ఏమీ గీయని విద్యార్థి కూడా ఉత్తేజం పొంది ఏదో ఒకటి గీయడానికి ప్రయత్నిస్తాడు. ఒక అడుగు వేయడానికి ముందుకు వస్తే ఎన్ని వేల అడుగులయినా నడవగలగుతాడు. గోడపత్రికలో ప్రదర్శించబడే అంశాలను తల్లిదండ్రుల సమావేశంలో ప్రదర్శించవచ్చును. ఈ విధంగా చేయడం వలన వారికి బడి పట్ల నమ్మకం, పిల్లలను బడికి పంపించాలనే ఆలోచన కలిగి ఉంటారు.

గోడపత్రికలో ప్రదర్శించే అంశాల పట్ల ఎలాంటి ఆంక్షలు విధించకూడదు. విద్యార్థులు తమకు నచ్చిన విషయాలపై స్వీయ రచన చేసే ప్రక్రియలు ఉదా: కవితలు, గేయాలు, సూక్తులు, బొమ్మలు, వ్యాసాలు, జోక్స్, వార్తలు, కార్టూన్లు, వారికి నచ్చిన అంశాలు, తెలిసిన సమాచారం ఏదయినప్పటికీ అవకాశం ఇవ్వాలి.

ఒకప్పుడు మా పాఠశాలల్లో చిత్రలేఖనం, బొమ్మలు వేయడం అంటే అది బ్రహ్మ ప్రక్రియ లాగా ఉండేది. ఇప్పుడు ప్రతీ పిల్లవాడి బ్యాగులో వాడు గీసిన బొమ్మల చిట్టా ఉంది. నా బొమ్మలు చూడు అని గర్వంగా చూపెడుతున్నాడు. ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకే గతంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించేవారు. ఇప్పుడయితే చిత్రలేఖనాన్ని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించే పోటీలలో చేర్చేశాము.

కొత్తొక వింత పాత ఒక రోత లాగా దీన్ని మార్చకుండా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు సృజనాత్మకంగా, ఉత్సాహంగా ఉంటూ, విద్యార్థులలో కూడా అది ఉండేలాగా ప్రయత్నం చేయాలి. నిజంగా పిల్లలకి బొమ్మలేయడం చాలా యిష్టం. బొమ్మలేస్తే మార్కులొస్తాయా, బొమ్మలేయడం వేస్టు అనే అభిప్రాయం తల్లిదండ్రుల్లో, కొంతమంది ఉపాధ్యాయుల్లోనూ ఉంది. కాని ఒక పిల్లవాడికి ఏదైనా ఒక విషయంలో నైపుణ్యం సాధిస్తే ఆ ప్రేరణ, ఉత్సాహం కొత్త అంశాలు నేర్చుకోవడానికి పునాదిరాయిగా పని చేస్తాయనేది నిజంగా నిజం. మిగతా అంశాలు వచ్చే నెల చూద్దాం. . . .

***– జి. సురేఖ***

*ప్రధానోపాధ్యాయురాలు, బాచుపల్లి పాఠశాల, రంగారెడ్డి జిల్లా*

# సిరులు కురిపిస్తున్న వాటర్ షెడ్

నిత్యం కరువుకాటకాలతో అల్లాడే ప్రకాశం జిల్లాలోనే అనేక గ్రామాలు నేడు పచ్చగా కళకళలాడుతున్నాయి. ప్రభుత్వం అందించిన సహకారం సకాలంలో ఉపయోగించుకొని తమ జీవితాలతోపాటు గ్రామాలను కూడా అభివృద్ధి చేసుకుంటూ సాటి గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అటువంటి గ్రామాలలో ప్రకాశం జిల్లాలోనే ఒక గ్రామ పంచాయితీ విజయగాథ ఇప్పుడు మనం చూద్దాం.

తరతరాలుగా అజ్ఞానం, అమాయకత్వం అభివృద్ధికి అమడ దూరంగా జీవిస్తున్నారు ప్రకాశం జిల్లాలోని మండలం కుంచేపల్లి గ్రామస్థులు. కొండ ప్రాంతం కావడంతో వర్షాలు వచ్చినప్పుడు భూములన్నీ కోతకు గురై, సారవంతమైన భూమలు బీడుగా మారి వాళ్ళను మరింతగా కృంగదీసేవి. ప్రకృతి ప్రసాదించిన వర్షాన్ని ఎలా కాపాడుకొవాలో తెలియదు. భూగర్భ జలాలు ఎలా పెంపోందించుకోవాలో తెలియదు. ఈ క్రమంలో వ్యవసాయం పూర్తిగా అటకెక్కింది. అప్పోసొప్పో చేసి వ్యవసాయం చేద్దామన్నా నీటి సౌకర్యం లేని పరిస్థితి. ఈ నేపధ్యంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ సహకారంతో హరియాలి వాటర్‌షెడ్ రెండవ బ్యాచ్ క్రింద కుంచేపల్లి గ్రామాన్ని వాటర్‌షెడ్ కార్యక్రమంలో చేర్చడం జరిగింది. డబ్ల్యు.డి.టి (వాటర్ షెడ్ టీమ్ మెంబర్) సహకారంతో గ్రామంలోని చిన్న సన్న కారు రైతులు, పేదలు, మహిళలు ఒక సంఘంగా ఏర్పడి గ్రామంలో చేయవలసిన పనులను మ్యాప్ ద్వారా గుర్తించి వాటికయ్యే ఖర్చు వివరాలను జిల్లా నీటి యాజమాన్య సంస్థకు అనుమతి కోసం పంపారు. మొత్తం 13 లక్షల 50 వేల రూపాయల నిధులు విడుదలయ్యాయి. గ్రామంలోని భూసారాన్ని కొట్టుకుపోకుండా ఆపేందుకు మట్టికట్టలు, రైతువారీ కుంటలు. నీటి మళ్ళింపు కాలువలు, ఊటచెరువులు, రాతి కత్తువలు, సంకెన్‌పిట్స్ తదితర పనులను ఐక్యంగా దగ్గర ఉండి గ్రామ సంఘం ద్వారా పనులు పూర్తి చేసుకున్నారు. దాదాపు 3 వేలకు పైగా జనాభా కలిగిన ఈ ఊరిలో అధిక శాతం దళితులే. ఈ గ్రామానికి సర్పంచ్ దళితుడే కావడం వలన గ్రామంలోని అందరూ కలగలుపుకొని పనిచేయడం వల్ల నీటి అభివృద్ధి పనులు వేగవంతమయినవి. ఈ విధంగా ప్రభుత్వం అందించిన సహకారం వల్ల తమ గ్రామాన్ని అభివృద్ధి చేసుకొని ఇప్పుడు పాడిపంటలతో సంతోషంగా గడుపుతున్నారు. ఈ గ్రామంలో ముఖ్యంగా మహిళా సంఘాలు గ్రామ ఐక్య సంఘాలు ద్వారా తీసుకొన్న రుణాలతో పశువులు పెంపొందించుకొన్నారు. అంతే కాకుండా కుట్టుపని, అల్లికలు, చిల్లర దుకాణాలు మరియు తదితర వ్యాపారాలు చేసుకుంటూ వారి స్వశక్తితో జీవనం కొనసాగిస్తున్నారు. రైతు వారీ కుంటలు, ఊటకుంటలు నిర్మించడం వల్ల భూగర్భ జల సంపద పెరిగి పంటలు పుష్కలంగా పెరుగుతున్నాయి. రాతి కత్తువలు నిర్మించినందువల్ల ఇది వరకటిలా నేలకోతకు గురవకుండా వ్యవసాయం చేసుకుంటున్నారు. అధిక దిగుబడులు పొంది పొరుగు గ్రామాలకు కుంచేపల్లి గ్రామస్థులు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇలా అనేక గ్రామాలు వాటర్‌షెడ్ కార్యక్రమాలను ఉపయోగించుకొని అభివృద్ధి పథంలో సాగుతున్నాయి. ప్రజలతో అనునిత్యం సత్సంబంధాలను నెరపుతూ గ్రామాల అభివృద్ధికి దోహదపడే వాటర్‌షెడ్ కార్యక్రమాలను జిల్లా నీటి యాజమాన్య సంస్థ విజయవంతంగా అమలు చేస్తోంది.

**– జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ప్రకాశం జిల్లా**




Printed & published by Phanikumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Printers, 11-4-668, Redhills, Hyderabad, Rangareddi, A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : Phani Kumar**

# ప్రదేశం చెప్పండి !
# ప్రైజు గెలుచుకోండి !!

ఈ ఫోటో చూశారుగా ఇది మన రాష్ట్రంలోని ఒక ప్రముఖ ప్రదేశానికి సంబంధించిన ఫోటో. ఈ ప్రదేశం ఏమిటో, ఎక్కడ, ఏ జిల్లాలో ఉందో, దాని విశేషాలు ఏమిటో రాసి ఈ కింది అడ్రసుకి పంపండి. సరిగా ఉన్న సమాధానాల్లో ఐదు ఎంట్రీలను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసి, ఈ **'స్థానిక పాలన'** పత్రికను ఏడాది పాటు ఉచితంగా పంపిస్తాం.

మా అడ్రసు:
**ఎడిటర్,**
**'స్థానిక పాలన' మాస పత్రిక**
**ఎ.ఎం.ఆర్. అపార్డ్, రాజేంద్రనగర్, హైదరాబాద్-500 030.**




అసలైన విజయానికి చిహ్నం
శుభ శుక్రవారం